మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

అనుక్షణం
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ 12 గురువారం డిసెంబర్ 2024 పేజీలు 8-12 వెల: రూ.6 సంపుటి:3 సంచిక: 87
Navabhoomi daily fallows..




## ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే
# జమిలి బిల్లు?

- కేబినెట్ ఆమోదం పొందిన జమిలి ఎన్నికల ప్రతిపాదనపై పార్లమెంటరీ కమిటీ అభిప్రాయం కోరిన కేంద్రం
- ఈ ప్రతిపాదనతో పాటు జమిలి ఎన్నికల బిల్లును కూడా ఒకేసారి ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధం!
- పార్లమెంట్ సమావేశాల ముగింపు రోజైన 20నే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం
- అదే రోజు జమిలి బిల్లుకు ఆమోదం తెలిపే ఛాన్స్

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్న కేంద్రం.. ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన జమిలి ఎన్నికల ప్రతిపాదనపై పార్లమెం టరీ కమిటీ అభిప్రాయం కోరిన కేంద్రం.. దాన్ని సభలో మాత్రం ప్రవేశపెట్టలేదు. దీంతో ఈ

# వసూళ్ల దందా!

## అడ్డంగా దొరికిన మాజీ మంత్రి!

- ఆధారాలతో దొరికేసిన విడదల రజనీ
- చిక్కుల్లో పడిన మాజీ మంత్రి విడదల రజనీ
- మంత్రిగా ఉన్న సమయంలో అక్రమ వసూళ్లు
- కూటమి ప్రభుత్వం రాగానే రజనీపై ఫిర్యాదులు
- రజనీ అక్రమ వసూళ్లపైన విజిలెన్స్ ఆధారాలు
- ప్రభుత్వానికి నివేదిక అందజేసిన విజిలెన్స్

అమరావతి-నవభూమిబ్యూరో
మాజీ మంత్రి విడదల రజనీ చిక్కుల్లో పడ్డారు. మంత్రిగా ఉన్న సమయంలో విడదల రజనీ అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నేరుగా హెూం మంత్రిని కలిసి పలువురు రజనీపైన ఫిర్యాదులు చేసారు. అందులో కొందరు పోలీసు అధికారులు భాగస్వాములు అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటి పైన విచారణ చేసిన విజిలెన్స్ అధికారులు తాజాగా రజనీ అక్రమాలను తేల్చారు. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వటం తో ఇప్పుడు తదుపరి చర్యల పైన ఉత్కంఠ కొనసాగుతోంది. మాజీ మంత్రి విడదల రజనీ అక్రమ వసూళ్ల పైన విజిలెన్స్ ఆధారాలు సేకరించింది. ప్రభుత్వాని కి నివేదిక ఇచ్చింది.



విడదల రజనీ రూ.2 కోట్లు తీసుకున్నట్లు తేల్చిన విజిలెన్స్ అందుకు సహకరించిన వారి పేర్లను వెల్లడించింది. పోలీసు, మైనింగ్ అధికారులతో కలిసి వ్యాపారులను రజనీ బెదిరింపులకు గురి చేసారనే ఆరోపణల పైన విజిలెన్స్ విచారణ చేసింది. ఇందులో ఆసక్తి కర అంశాలు వెలుగులోకి వచ్చాయి. రజనీ 2019లో వైసీపీ నుంచి చిలకలూరి పేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017లో జగన్ కేబినెట్ లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసారు. ఆ సమయం లోనూ మంత్రిగా ఉంటూ పలువురి నుంచి అక్రమ వసూళ్లు చేసారనే ఆరోపణలు వచ్చాయి. ' చిలుకలూరిపేట పరిధిలోని స్టోర్ క్రషర్ నిర్వహిస్తున్న యాజమాన్యం నుంచి వసూళ్లకు పాల్పడ్డారని కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. రజనీ

## తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్
# అధ్యక్షుడిగా జితేందర్ రెడ్డి

- తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడి స్థానానికి
- జితేందర్‌రెడ్డితోపాటు తెలంగాణ బ్యాడ్మింటన్
- ఉపాధ్యక్షుడు చాముండేశ్వరినాథ్ కూడా నామినేషన్
- చాముండేశ్వరి నాథ్‌పై 34 ఓట్ల తేడాతో జితేందర్ గెలుపు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ ఎంపీ, ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారు జితేందర్ రెడ్డి విజయం సాధించారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడి స్థానానికి జితేందర్ రెడ్డితోపాటు తెలంగాణ బ్యాడ్మింటన్ ఉపాధ్యక్షుడు చాముండేశ్వరినాథ్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి కూడా చాముండేశ్వరి నాథ్ నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం. ఈ క్రమంలో జరిగిన తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో క్రీడాశాఖ సలహాదారుడుగా వ్యవహరిస్తున్న జితేందర్ రెడ్డి విజయం సాధించారు. ప్రత్యర్థి చాముండేశ్వరి నాథ్‌పై 34 ఓట్ల తేడాతో జితేందర్ రెడ్డి

# ఒంటరి పోరు

- ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుపై తేల్చేసిన కేజ్రీవాల్
- కాంగ్రెస్‌తో పొత్తుల్లేవన్న ఆప్
- 2 విడతలుగా అభ్యర్థుల జాబితా

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
సార్వత్రిక ఎన్నికల తర్వాత పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోరు సాగింది. కానీ త్వరలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం మరోసారి కాంగ్రెస్, బీజేపీ కంటే ఆప్ ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేసే అవకాశాలున్నాయన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. దీనిపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇవాళ క్లారిటీ ఇచ్చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఆప్ మధ్య సీట్ల పంపకాల చర్చలు తుది దశకు చేరుకున్నాయన్న ప్రచారం కొన్ని రోజులుగా సాగుతోంది. తొలుత ఒంటరిగా పోటీ చేస్తానని ప్రకటించిన ఆప్.. ఆ తర్వాత పొత్తులో భాగంగా కాంగ్రెస్ కు 15 సీట్లు ఇచ్చేందుకు అంగీకరించినట్లు

## తెలంగాణ హైకోర్టులో
# మోహన్ బాబుకు ఊరట

- విచారణకు హాజరు కావాలని మోహన్ బాబుకు పోలీసుల నోటీసులు
- స్టే ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించిన మోహన్ బాబు
- 24వ తేదీ వరకు మినహాయింపు ఇచ్చిన హైకోర్టు
- 2 గంటలకోసారి ఇంటి వద్ద చూసి రావాలని పోలీసులకు ఆదేశం

2



రంగారెడ్డి జిల్లా-నవభూమిబ్యూరో
సినీ నటుడు మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. మోహన్ బాబుకు పోలీసులు జారీ చేసిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చింది. మోహన్ బాబు, మంచు మనోజ్ పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరువురికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. రాచకొండ పోలీసులు తనకు ఇచ్చిన నోటీసులపై స్టే ఇవ్వాలని కోరుతూ మోహన్ బాబు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం రాచకొండ పోలీసులు జారీ చేసిన నోటీసులపై స్టే ఇచ్చింది. అలాగే, పోలీసుల ముందు విచారణకు హాజరయ్యేందుకు ఈ నెల 24వ తేదీ వరకు మినహాయింపు ఇచ్చింది. జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు

# మంచు లక్ష్మీ శాంతిమంత్రం

- మంచు ఫ్యామిలీలో గొడవల వేళ మంచులక్ష్మీ మంత్రాంగం
- పీస్ అంటూ మంచులక్ష్మీ ఇన్‌స్టాలో ట్వీట్‌తో తేటతెల్లం
- తండ్రీ,సోదరుల మధ్య సయోధ్యకు లక్ష్మీ మంతనాలు
- గొడవల నేపథ్యంలో మనోజ్ కోర్కెలపై మెత్తబడినట్లు వినికిడి

2



రంగారెడ్డి జిల్లా-నవభూమిబ్యూరో
మంచు మోహన్ బాబు కుటుంబంలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. మోహన్ బాబు ఆయన చిన్న కొడుకు మంచు మనోజ్ మధ్య గొడవలు ఏర్పడ్డాయి. దీంతో మంగళవారం రాత్రి జలపల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది తనపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని, తనకు తన భార్యకు ప్రాణహాని ఉందని పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్లో మంచు మనోజ్ ఫిర్యాదు చేశారు.

# విపక్ష కూటమిలో లుకలుకలు?

- విపక్ష ఇండియా కూటమిలో విభేదాలు
- అదానీ అంశంపై చర్చకు ప్రతిపక్షాల డిమాండ్
- విపక్ష ఆందోళనకు టీఎంసీ,ఎస్పీ గైర్హాజరు
- ఇటీవల విపక్షకూటమి భేటీకి టీఎంసీ దూరం
- కూటమి సారథ్యంపై దీదీకి పెరుగుతున్న మద్దతు



2

**ఢిల్లీ-నవభూమిబ్యూరో:** విపక్ష 'ఇండియా కూటమి'లో విభేదాలు మరోసారి బయటపడా యి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి అదానీ అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే దీని వల్ల వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ విషయంపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగాలని, ఇదే విపక్షాల లక్ష్యమని పేర్కొన్నారు. డిసెంబరు 13న కచ్చితంగా పార్లమెంట్లో రాజ్యాంగంపై చర్చ జరగాలని అన్నారు.
కాగా సభా కార్యకలాపాలు ఎలా సాగాలో భాజపా, కాంగ్రెస్ నిర్ణయిస్తున్నాయని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ సభలోని ప్రతి విషయంలో బాజపా, కాంగ్రెస్ మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నాయని.. ఈ వైఖరిపై ఇతర పార్టీ నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని వాపోయారు. మరోవైపు, రాహుల్ నేడు పార్లమెంట్ లోక్సభ స్పీకర్ ఓం బిర్లాను. కలిశారు. సభలో తనపై భాజపా నేతలు చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినటు కాంగ్రెస్ ఎంపీ మీడియాకు. చెప్పారు. లోక్సభలో అదానీ అంశంపై తక్షణమే చర్చ జరపాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ విషయంపై పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అయితే, ఇందులో టీఎంసీ, సమాజ్వాదీ పార్టీ నేతలు పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. ఈ రెండు పార్టీల ఎంపీలు సభా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఇటీవల జరిగిన విపక్ష కూటమి భేటీకి కూడా టీఎంసీ దూరంగా ఉంది. పార్లమెంట్ సజావుగా సాగాలని తాము కోరుకుంటున్నామని తృణమూల్ నేతలు చెబుతున్నారు..
ప్రతిపక్ష కూటమికి సారథ్యం వహించే బాధ్యతను మమతా బెనర్జీకి అప్పగించాలని కాంగ్రెస్పై మిత్రపక్షాలు ఒత్తిడి తీసుకొస్తున్నాయి

# వైసీపీ పోరుబాటకు సిద్ధం

- సజ్జలకు మరో బాధ్యత అప్పగించిన జగన్
- ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్ఆర్సీపీ ఉద్యమాల బాట
- అనంతపురంలో13న రైతుల సమస్యలపై ఆందోళన
- అన్ని జిల్లా,మండల కేంద్రాల్లో రైతుల ఆందోళన



2

అమరావతి-నవభూమిబ్యూరో
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం-జనసేన- బీజేపీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్ఆర్సీపీ ఉద్యమాల బాట పట్టింది. ఈ నెల 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించబోతోంది. అనంతపురం జిల్లా దీనికి వేదిక. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆ జిల్లా పార్టీ నాయకులు ఆవిష్కరించారు. రైతులకు మోసపూరిత హామీలను ఇచ్చి చంద్రబాబు గద్దెనెక్కారంటూ మండిపడుతున్నారు. "ఈ ఆందోళన నేపథ్యంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్రస్థాయి కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో మాటాడారు. వారికి దిశా నిర్దేశం చేశారు. 13వ తేదీన నిర్వహించదలిచిన ఆందోళనపై చర్చించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడారు. చంద్రబాబు- పవన్ కల్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరించిందని, ధాన్యం సేకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇలాంటి సమయంలో రైతులకు అండగా

# ముగ్గురు లేదా నలుగురు?

- మంత్రి వర్గ విస్తరణపై ఢిల్లీలో సీఎం కసరత్తు
- పలుమార్లు రాహుల్‌తో చర్చించినట్లుగా వినికిడి
- ఈనెలాఖరు లేదా స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత విస్తరణ
- సామాజిక వర్గాల పరంగా నలుగురికి ఛాన్స్!

హైదరాబాద్-నవభూమిబ్యూరో
సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనతో మళ్లీ మంత్రి వర్గ విస్తరణ తెరపైకి వచ్చింది. ఢిల్లీలో మంత్రి వర్గ కూర్పుపై కసరత్తు చేస్తున్నట్లు వినిపిస్తోంది. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత విస్తరణ ఉంటుందని అందరూ ఊహించారు. అయితే అధిష్టానం నాన్చుతుండటంతో ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి కేబినెట్ విస్తరణపై అధిష్టానంతో సీఎం చర్చిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ గ్రీన్‌సిగ్నల్ లభించలేదు.ఈనెలలో మంత్రివర్గ విస్తరణ ఉన్నట్లుగా వినిపిస్తోంది.లేదా స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అయినా విస్తరణ జరిగే అవకాశముంది. మొదట ముగ్గురిని లేదా నలుగురిని తీసుకోవచ్చునని, ఆ తర్వాత మరో ఇద్దరికి ఛాన్స్ ఉందని వినిపిస్తోంది. సామాజిక వర్గాల పరంగా ఎవరికైతే ప్రాధాన్యత లేదో వారికి ఈసారి ఛాన్స్ లభించే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గం కింద సుదర్శన్‌రెడ్డికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. అలాగే వాకటి శ్రీహరి, మైనార్టీ కోటా కింద ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌తో పార్టీ ఎస్సీ కోటా కింద గడ్డం వివేక్‌కు ఛాన్స్ లభించవచ్చునని వినిపిస్తోంది. అయితే మంత్రి వర్గంలో ఛాన్స్ కోసం చాలా మంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నల్లమాద పద్మావతి రెడ్డి, పరిగి రామ్మోహన్‌రెడ్డి,మల్‌రెడ్డి రంగారెడ్డి,ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు గడ్డం వినోద్ కూడా రేసులో ఉన్నారు. మరో విడత విస్తరణలో వీరి పేర్లను పరిశీలించే ఛాన్స్ ఉంది.

# బంగాళాలో బలపడ్డ అల్పపీడనం

- ఏపీలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు
- వాయుగుండంగా మారడానికి అనుకూల వాతావరణం
- నెల్లూరు, అనంతపురం, శ్రీ సత్యసాయి పుట్టపర్తి, కడప, అన్నమయ్య,రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు
- ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల చిరుజల్లులు

2



అమరావతి-నవభూమిబ్యూరో
వరుస అల్పపీడనాలు, తుఫాన్లు తాకిడి కొనసాగుతూ వస్తోంది. ఒకదాని వెంట ఒకటిగా అల్పపీడనాలు ఏర్పడుతూనే ఉన్నాయి దాదాపు రెండునెలల నుంచి. ప్రతి సంవత్సరం నవంబర్/డిసెంబర్ నెలల్లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సహజమే అయినప్పటికీ- ఇప్పుడు దీని తీవ్రత మరింత పెరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మరింత బలపడ్డ.. తాజాగా బంగాళాఖాతం ఆగ్నేయ దిశగా ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడింది. తీవ్ర అల్పపీడనంగా రూపు దాల్చింది. ఇది వాయుగుండంగా మారడానికి అనుకూల వాతావరణం ఉన్నట్లు చెన్నైలోని ప్రాంతీయ భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. వచ్చే 24 నుంచి 48 గంటల్లో వాయుగుండంగా మారవచ్చని పేర్కొంది. "బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీకి భారీ హెచ్చరిక" వాయవ్య దిశగా.. అనంతరం క్రమంగా వాయవ్య దిశగా కదులుతుందని, ఆ సమయంలో దీని వేగం గంటకు ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్ల వరకు ఉండొచ్చు. వచ్చే 48 గంటల వ్యవధిలో శ్రీలంక, తమిళనాడు, పుదుచ్చేరి, తీరప్రాంతానికి సమీపించే అవకాశం ఉంది. తమిళనాడు మధ్య- దక్షిణ ప్రాంతం వద్ద తీరం దాటొచ్చు. తమిళనాడు వ్యాప్తంగా.. ఈ తాజా అల్పపీడనం ప్రభావంతో

# టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కొత్త బాట

తిరుపతి-నవభూమిబ్యూరో
తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం నాడు 67,284 మంది స్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 19,064 మంది తలనీలాలు సమర్పించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ఒక్క రోజే హుండీ ద్వారా 4.27 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఒక కంపార్టుమెంట్ భక్తులు వేచి ఉన్నారు. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వ దర్శనానికి ఎనిమిది నుంచి 10 గంటల సమయం పట్టింది. కంపార్ట్‌మెంట్‌లో ఉన్న వారికి శ్రీవారి సేవకులు మంచినీరు, పాలు, అల్పాహారాన్ని అందించారు. "బీఆర్ నాయుడిని మెచ్చుకున్న 2లో





## ములుగు జిల్లాలో పెద్దపులి సంచారం.. భయాందోళనలో ప్రజలు

**ములుగు-నవభూమి:** జిల్లాలో పెద్దపులి సంచారంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో పెద్దపులి సచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పాదముద్రలు సేకరించి ప్రజలను అప్రమత్తం చేశారు. తొలుత వెంకటాపురం మండలం, బోదాపురం, అలుబాక శివార్లలో రైతులు పెద్దపులి ఆనవాళ్లు గుర్తించారు. తర్వాత గోదావరి దాటి ఇవతలి వైపు మంగపేట మండలంలోకి ప్రవేశించినట్టు సమాచారం. దీంతో గ్రామాల్లో మినీ మైకుల ద్వారా అధికారులు దండోరా వేయించారు. మంగపేట మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరిలో చేపలవేటకు, పశువుల మేతకు అడవుల్లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.కాగా ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని అలుబాక బోధాపురం సమీపంలో పెద్దపులి కలకలం సృష్టించింది. మిర్చి తోటలకు వెళ్లే దారిలోని గోదావరి పాయలో కొందరు స్థానికులు పెద్దపులి అడుగులను గుర్తించారు. భయపడిపోయి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు అలుబాక బోధాపురం శివారులోని అడుగులను పరిశీలించారు. అవి పెద్దపులి అడుగులేనని ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు. గోదావరి తీర ప్రాంతంలో కొంతమంది రైతులు పుచ్చతోటలు సాగు చేస్తున్నారు. సోమవారం రాత్రి తోటల వద్ద పడుకున్న సమయంలో పెద్ద పులి అరుపులు వినిపించినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. పెద్దపులి జాడ దొరికే వరకు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఎలాంటి ఆనవాళ్లు కనిపించిన వెంటనే సమాచారం అందించాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు.




## కేసీఆర్ ముద్ర చెరిపేయాలని కుట్ర..



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్‌కు ఉన్న మంచిపేరు చెరిపేసేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ధ్వజమెత్తారు. అసలు ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు ఏం ఒరగబెట్టిందని ఆమె ప్రశ్నించారు. రాష్ట్ర చిహ్నంలో మార్పులు, తెలంగాణతల్లి విగ్రహం లో మార్పులు, బతుకమ్మ చీరలు మాయం చేయడం.. ఇదా అభివృద్ధి అంటే?.. అని ఆమె నిలదీశారు.తెలంగాణతల్లి విగ్రహంలో మార్పులు చేసి కొత్త విగ్రహం ప్రతిష్ఠించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని చందచెరువు కట్టపై గల తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ అప్పట్లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులు, మేధావులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన రూపంలో తెలంగాణ తల్లి విగ్రహానికి జీవం పోశారని, ఇప్పు డు ఆ విగ్రహం రూపాన్ని అర్థం పర్థం లేకుండా మార్చేశారని ఆరోపించారు.

తెలంగాణలో కేసీఆర్ ముద్ర లేకుండా చేయాలన్నదే కాంగ్రెస్ పన్నాగమని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్?లాల్, డిప్యూటీ మే యర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ లావణ్యబీరప్ప, పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాజీనగర్ చౌరస్తాలో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆ ధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భం గా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై విమర్శలు గు ప్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, పార్టీ నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, కృష్ణారెడ్డి, గణేశ్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## నిజాం ప్రధాన సైనికాధికారి నివాసమే నేటి రాష్ట్రపతి నిలయం



**హైదరాబాద్-నవభూమి:** బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంగా పిలుస్తున్న భవనాన్ని 1860లో నిజాం నవాబు నజీరుద్దౌలా నిర్మించారు. సాలర్‌జంగ్ ప్రధానిగా ఉన్న సమయంలో బొల్లారం( నిజాం ప్రభుత్వం అధీనంలోని ఒక కంటోన్మెంట్ ప్రాంతంగా ఉండి, ప్రధాన సైనికాధికారి నివాసంగా ఉండేది. 1950లో హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దక్షిణాదిలో రాష్ట్రపతి విడిది కోసం ఆహ్లాదకరమైన వాతావరణంలో అతిథి గృహంగా మార్చి ఈ భవనాన్ని రాష్ట్రపతి నిలయంగా నామకరణం చేశారు. 90 ఎకరాల సువిశాలమైన ప్రాంగణంలో భవనాన్ని 2,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు. ఇందులో మూడు ప్రధాన విభాగాలు ఏర్పాటుచేశారు. రాష్ట్రపతి, కుటుంబ సభ్యులు, ఏడీసీ విభాగాలుగా విభజించారు. రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లో మరో 20 గదులను నిర్మించారు.

**రాజేంద్రప్రసాద్ నుంచి ద్రౌపది ముర్ము వరకు..**

దేశ ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ నుంచి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వరకు ప్రతి ఏడాది శీతాకాల విడిది కోసం వచ్చారు. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా మిగతా రాష్ట్రపతుల మాదిరిగానే శీతాకాల విడిది కోసం నగరానికి మొదటిసారి రాష్ట్రపతి హోదాలో వస్తున్నారు.

**రాష్ట్రపతి నిలయం చుట్టూ రక్షణ దళాలు**

రాష్ట్రపతి నిలయం పరిసరాల చుట్టూ రక్షణ విభాగాల దళాలు ఉండటంతో భద్రతాపరంగా పటిష్ఠంగా ఉంది. రాష్ట్రంలోని మిలిటరీ వ్యవహారాలను పర్యవేక్షించే ఆంధ్రా, తెలంగాణ సబ్ ఏరియా కమాండెంట్ ప్రధాన కార్యాలయం కూడా రాష్ట్రపతి నిలయాన్ని ఆనుకొని ఉంది. సీడీఎం, ఈఏఈ, ఎంసీఈఎంఈ, ఏఓసీ తదితర రక్షణ విభాగాలు ఇక్కడ ఉన్నాయి.

**పనుల్లో ప్రభుత్వ విభాగాలు..**

ఈనెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం నగరానికి రాక సందర్భంగా రాష్ట్రపతి నిలయంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల ఆధునికీకరణ పనులు చేపట్టడంతో ప్రభుత్వం విభాగాల అధికారులు తలమునకలయ్యారు. రాష్ట్రపతి నిలయంలోని దట్టమైన పొదలను తొలగించడం, పచ్చదనం పెంచడం, తాగునీటి సదుపాయం కల్పించడం, పారిశుధ్య నిర్వహణ తదితర పనులను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సంయుక్తంగా చేపడుతున్నాయి.

**ప్రత్యేక హెలిప్యాడ్..**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోసం రాష్ట్రపతి నిలయాన్ని ఆనుకొని ఉన్న ఈఎంఈ పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రయాణించడానికి వీలుగా హెలిప్యాడ్‌ను అధికారులు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు హెలిక్యాప్టర్‌లో ప్రయాణించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## జమిలి బిల్లు?

**(1వపేజీ తరువాయి)**ప్రతిపాదనతో పాటు జమిలి ఎన్నికల బిల్లును కూడా ఒకేసారి ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నెల 20 వరకూ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగబోతున్నాయి. ఇందులోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకూలిస్తే పార్లమెంట్ సమావేశాల ముగింపు రోజైన 20వ తేదీనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్ట బోతున్నట్లు సమాచారం. అదే రోజు దానికి ఆమోద ముద్ర కూడా వేయాలని కేంద్రం భావి స్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జమిలి ఎన్ని కలపై కసరత్తు మరింత వేగం పుంజుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. జమిలి ఎన్నికల నిర్వ హణకు ఈసీ ఎప్పటి నుంచో సిద్ధమవుతోంది. గతంలో మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ గోవింద్ నేతృత్వంలోని కమిటీ జమిలి ఎన్నికలకు మద్దతుగా ప్రతిపాదనలు కూడా చేసింది. దీంతో పాటు కేంద్రం జమిలిపై పార్లమెంటరీ కమిటీ అభిప్రాయం కూడా కోరింది. ఈ అభిప్రాయం కూడా తీసుకుని ఈ నెలలో ముగిసే పార్లమెంట్ సమావేశాల్లో జమిలి బిల్లు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విపక్షాల నుంచి జమిలి ఎన్నికలపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నా.. పార్లమెంట్ ఉభయసభల్లో తమకున్న మెజార్టీతోనే దీన్ని ఆమోదించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

## బయట పరదా.. లోపల పనులు.. సీజ్ చేసినా ఆగని అక్రమ నిర్మాణాలు



**హైదరాబాద్-నవభూమి:** మహదేవపురం కాలనీలో అక్రమ భవన నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. అధికారులు బిల్డింగ్‌లను సీజ్ చేసిన వారం రోజుల్లోపే మళ్లీ నిర్మాణ పనులు మొదలుపెడుతున్నారు. భవన యజమానుల నుంచి అధికారులు స్లాబ్‌కొక ధర చొప్పున డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహదేవపురం సీ-బ్లాక్, డీ-బ్లాక్‌లలో ఈ అక్రమ అంతస్తుల నిర్మాణాలకు అధికారులే ఆద్యం పోస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు.పత్రికల్లో వచ్చిన కథనాలతో తూతూ మంత్రంగా స్పందిస్తూ భవనాలను సీజ్ చేస్తున్నారు. ఆ తర్వాత యజమానులతో బేరసారాలు సాగించి అభయమిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు భవనానికి అదనపు అంతస్తులు నిర్మిస్తే నోటీసులు ఇవ్వడమే మా పని కూల్చివేయడం మా పని కాదని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో భవన నిర్మాణ యజమానులు యదేచ్ఛగా జీ-2 అనుమతులు తీసుకుని జీ-5 వరకు నిర్మిస్తున్నా చోద్యం చూస్తున్నారని అధికారుల తీరుపై మండిపడుతున్నారు.ముందుగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది కాలనీలలో ఎక్కడెక్కడ నూతన నిర్మాణాలు చేపడుతున్నారో రెక్కీ నిర్వహించి నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు ఏ అధికారిని కలిస్తే పని సులువుగా అవుతుందో సలహాలు, సూచనలిస్తూ వారే ముందుండి నడిపిస్తున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులతో నోటీసులు ఇప్పిస్తాం, అటు తర్వాత వారిని మేనేజ్ చేసి మీరు యదేచ్ఛగా కట్టుకోవచ్చని అభయమిస్తున్నారు. దీనివల్ల రాబోయే రోజుల్లో కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్య మొదలవుతుందని మహదేవపురం కాలనీ వాసులు తెలుపుతున్నారు. కాలనీ వాసులే గతంలో అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేశారంటే ఈ దందా కొనసాగుతుందో అర్థమవుతోంది.మహదేవపురం సీ-బ్లాక్, డీ-బ్లాక్‌లలో కొన్ని భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన తెల్లారే యజమాని భవనానికి అంటించిన బోర్డును తీసేసి తనపని తాను సాఫీగా చేసుకుంటూ, భవనానికి సున్నం కూడా వేయించాడు.

మహదేవపురం చౌరస్తాకు సమీపంలో ఉన్న భవనాన్నీ సీజ్ చేశారు. కానీ బయట సీజ్ బోర్డు అలాగే కన్పిస్తున్నా లోపల మాత్రం మేస్త్రీలు నిర్మాణ పనులను సాఫీగా చేసుకుంటున్నారు. అలాగే సీ బ్లాక్‌లో విచ్చలవిడిగా 4 నుంచి 8 వరకు జీం2 అనుమతులు తీసుకుని జీం4, జీం5 వరకు నిర్మిస్తున్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఉన్న భవనం ఎటువంటి సెట్‌బ్యాక్ లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా వెలుస్తున్న భవనాలను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

మహదేవపురంలో సీజ్ చేసిన భవనాల్లో పనులు జరిగితే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసులను నమోదు చేస్తామన్నారు. భవన యజమానులు ఎంతవరకు అనుమతులు తీసుకున్నారో, దాని ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలి.

## తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జితేందర్ రెడ్డి

**(1వపేజీ తరువాయి)**గెలుపొందారు. ఈ ఎన్నికల్లో జితేందర్ రెడ్డికి 43 ఓట్లు రాగా.. చాముండేశ్వరినాథ్‌కు కేవలం 9 ఓట్లే వచ్చాయి. మరోవైపు, కార్యదర్శిగా మల్లారెడ్డి గెలుపొందారు. ఈ పోటీలో మల్లారెడ్డికి 40 ఓట్లు రాగా.. బాబూరావుకు 12 ఓట్లు వచ్చాయి. కాగా, జితేందర్ రెడ్డి 1954, జూన్ 26న రామచంద్రారెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లా, మానవపాడ్ మండలంపెద్ద ఆముద్యాలపాడు గ్రామంలో జన్మించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.కాం చదివారు. 1981, డిసెంబరు 19న రాజేశ్వరి రెడ్డితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. వ్యాపార రంగంలో విజయం సాధించిన జితేందర్ రెడ్డి 1999లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 13వ లోక్‌సభకు ఎన్నికయ్యాడు. 1999-2000 మధ్యకాలంలో 2010లో తెలంగాణ రాష్ట్ర సమితి పొలిట్ బ్యూరో సభ్యులు నియమించబడ్డారు.

2014, మేలో 16వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014, జూన్ 13 నుంచి సభా కార్యక్రమాల సలహా సంఘం సభ్యులుగా ఉన్నారు. సెప్టెంబరు 15న పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ఫుడ్ మేనేజ్మెంట్ జాయింట్ కమిటీ చైర పర్సన్ నియమించబడ్డారు. పార్లమెంట్ లోకల్ ఏరియా డెవెలప్మెంట్ పథకాల కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2014, సెప్టెంబరు 19 నుంచి స్టాండింగ్ రక్షణ కమిటీ సభ్యులుగా నియమించబడ్డారు. సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2015, జనవరి 29 నుంచి జనరల్ పర్పసెస్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2016, జూన్ 2 రక్షణ స్టాండింగ్ కమిటీ సబ్ కమిటీ సభ్యులుగా నియమించబడ్డారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత జితేందర్ రెడ్డి బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# మంచు లక్ష్మీ శాంతిమంత్రం

**(1వపేజీ తరువాయి)**ఆ వెంటనే మోహన్ బాబు సైతం కొడుకు నుంచి తనకు ప్రాణహాని ఉందని రాచకొండ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంచు మనోజ్‌పైన ఆయన భార్య మౌనికపైన పోలీసులు కేసు నమోదు చేశారు.మోహన్ బాబు ఇంటి చుట్టూ విష్ణు 40 మంది బౌన్సర్లను పెడితే.. మనోజ్ 30 మంది బౌన్సర్లను దింపాడు. దీంతో మోహన్ బాబు ఇంటివద్ద ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. మంగళవారం రాత్రి జలపల్లిలోని మంచు టౌన్‌కు మంచు మనోజ్ దంపతులు చేరుకున్నారు. మంచు మనోజ్ వాహనాన్ని గేట్ దగ్గరే బౌన్సర్లు ఆపేశారు. ఈ విషయం తెలుసుకున్న మీడియా అక్కడకు భారీగా చేరుకుంది. లోపలకి వెళ్లిన మీడియాపై మోహన్ బాబు దాడి చేశారు.మీడియా పై మోహన్ బాబు అరాచకం సృష్టించారు. సహనాన్ని కోల్పోయిన మోహన్ బాబు విచక్షణా రహితంగా మీడియా పై దాడి చేశారు.మైక్ లాగి మరీ మీడియా ప్రతినిధిపై ఆయన దాడి చేశారు. ఈ ఘటనలో సదరు మీడియా ప్రతినిధికి గాయాలు అయ్యాయి. ఆ తర్వాత బీపీ డౌన్ అవ్వడంతో మోహన్ బాబు ఆస్పత్రిలో చేరారు. మంచు కుటుంబంలో ఇన్ని వివాదాలు నడుస్తోన్న సమయంలో మంచు లక్ష్మీ చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు సంచలనంగా మారింది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో కూతురి వీడియోను పోస్ట్ చేసి పీస్ అంటూ మాత్రమే రాసుకొచ్చింది. దీంతో మంచు లక్ష్మీ తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. తండ్రీ, అన్నదమ్ముల మధ్య ఇంత జరుగుతుంటే వారి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నట్లు వినిపిస్తోంది.

## తెలంగాణ హైకోర్టులో మోహన్ బాబుకు ఊరట

**(1వపేజీ తరువాయి)**వాయిదా వేసింది.

ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా... మోహన్ బాబుపై నమోదైన కేసులను ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు వివరించారు. పరస్పర ఫిర్యాదులతో కేసులు నమోదైనట్లు తెలిపారు. నిన్న సాయంత్రం జర్నలిస్ట్‌పై దాడి కేసులో మోహన్ బాబుపై మరో క్రిమినల్ కేసు నమోదైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యవహారంలో పోలీసుల నోటీసులు అందుకున్న మంచు మనోజ్ ఈ రోజు విచారణకు హాజరయ్యారని కోర్టుకు తెలిపారు.

మోహన్ బాబు ఇంటి వద్ద గస్తీ ఏర్పాటు చేయాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టును కోరారు.

అయితే నిత్యం గస్తీ ఏర్పాటు చేయడం కుదరదని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. అయితే రెండు గంటలకు ఓసారి పోలీసులు అక్కడి పరిస్థితులను గమనించి వస్తారన్నారు.

దీంతో, రెండు గంటలకోసారి పోలీసులు మోహన్ బాబు ఇంటి వద్దకు వెళ్లాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వరకు పరిస్థితిని పర్యవేక్షించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

## టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కొత్త బాట

**(1వపేజీ తరువాయి)**చంద్రబాబు" టీటీడీ కొత్తగా మరో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఉద్యోగులందరికీ నేమ్ బ్యాడ్జీలను అందించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు కూడా నేమ్ బ్యాడ్జీల వ్యవస్థ టీటీడీలోలేదు. కొత్తగా దీన్ని ప్రవేశపెట్టనుంది టీటీడీ. ఒక్క తిరుమలలో మాత్రమే కాకుండా టీటీడీ పాలక మండలి పరిధిలోకి వచ్చే విభాగాలన్నింట్లో పని చేసే ప్రతి ఒక్క ఉద్యోగికీ ఈ బ్యాడ్జీలు అందుతాయి. దీనికి అవసరమైన కసరత్తు త్వరలోనే మొదలు పెట్టనుంది టీటీడీ. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వయంగా వెల్లడించారు. శ్రీవారి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి తిరుమలకు వచ్చే అశేష భక్తుల పట్ల కొందరు ఉద్యోగులు, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని గుర్తించడానికి, వారి పేర్లు భక్తులకు తెలిసేలా చేయడానికి నేమ్ బ్యాడ్జీలను అందిస్తామని అన్నారు. ఎంతో భక్తి ప్రపత్తులతో స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించే ఉద్యోగులపై చర్యల తీసుకోవడానికి వెనుకాడబోనని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. ఈ నేమ్ బ్యాడ్జ్ ద్వారా భక్తుల పట్ల అమర్యాదగా వ్యవహరించిన వారిని వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని అన్నారు. శ్రీనివాసుడిని దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ప్రతి ఒక్క ఉద్యోగి, సిబ్బందికీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# చంద్రబాబు కీలక ప్రకటన - గేమ్ ఛేంజర్..!!

**అమరావతి-నవభూమిబ్యూరో**

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేసారు. గత అయిదేళ్లు కాల పాలన గురించి ప్రస్తావన చేసారు. ఆరు నెలల కూటమి పాలనలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ప్రతీ సంక్షోభం అవకాశంగా మలచుకోవాలని సూచించారు. వాటిని గుర్తించి..సమర్ధంగా నిర్వహించటమే నాయకత్వ లక్షణమని వెల్లడించారు. ఇదే సమయంలో ఏపీ ప్రభుత్వం ఈ ఉదయం గుగూల్ తో ఆర్టీజీఎస్ ద్వారా పౌర సేవలను అందించే ఒప్పందం చేసుకున్నామని ..విశాఖ కేంద్రంగా ఆ సంస్థ పని చేస్తుందని ప్రకటించారు. పరిస్థితుల్లో మార్పు రెండు రోజుల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు. ఈ రోజు ఏపీ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. గుగూల్‌తో చేసుకున్న ఒప్పందం గురించి వివరించారు. మంత్రి లోకేష్ గుగూల్‌తో ఈ ఒప్పందం వెనుక కీలకంగా వ్యవహరించారని చంద్రబాబు అభినందించారు.




గత అయిదేళ్లు కాలంలో రాష్ట్రంలో తీసుకున్న నిర్ణయాలతో అన్ని రంగాల్లోనూ నష్టపోయామని చెప్పుకొచ్చారు. ఆ సంక్షోభ సమయం నుంచి ఇప్పుడు అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకుంటున్నామని వివరించారు. కలెక్టర్ల సదస్సు ద్వారా ప్రజా సేవలను ఎలా మెరుగ్గా నిర్వహించాలనేది కీలకమని చంద్రబాబు స్పష్టం చేసారు. గేమ్ ఛేంజర్‌గా ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం మేరకు గుగూల్ సంస్థ విశాఖలో ఆ సంస్థ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తోందని చంద్రబాబు వెల్లడించారు. విశాఖకు గూగుల్ లాంటి సంస్థలు వస్తే అది గేమ్ చేంజర్ అవుతుందని చెప్పుకొచ్చారు. డేటా సెంటర్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సంస్థలు ఏర్పాటైతే ఓ రాష్ట్రం ఒక దిక్సూచీగా మారుతుందని చెప్పారు. ఏపీని రానున్న రోజుల్లో నాలెడ్జ్ ఎకానమీగా మార్చటం తో పాటుగా .. స్మార్ట్ వర్క్ చేసేలా కార్యాచరణలు రూపొందించాలని కలెక్టర్లకు సూచించారు. తొలి కలెక్టర్ల సమావేశం కంటే రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో కొంత మార్పు కనిపిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. కలెక్టర్లలో పోటీ తత్వం పెరగాలి గతంలో ఉద్యోగులు ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు పెన్షన్లు సైతం ఒకటో తేదీనే ఇస్తున్నామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టప్రకారం శిక్షించాల్సిందేనని తేల్చి చెప్పారు. ఆ విషయంలో కలెక్టర్లు జాగ్రత్తగా వ్యవ హరించాలని స్పష్టం చేశారు. పాలనలో వేగం పెరిగితేనే ప్రజలకు వేగంగా సేవలు అందుతాయని వివరించారు. దీని ద్వారా పెట్టుబడులు కూడా వస్తాయని పేర్కొన్నారు.

## వసూళ్ల దందా!

**(1వపేజీ తరువాయి)**మద్దతుదారులు వారితో నగదు ఇవ్వాలనే చర్చలు చేసారు. వారు అందుకు అంగీకరించకపోవటంతో అక్రమ మైనింగ్ చేశారని అధికారులతో రూ. 50 కోట్ల ఫైన్ వేయించినట్లు తెలుస్తోంది. దాంతో ఆ వ్యాపారులు రాజీకి వచ్చారు. వారిని పోలీసు అధికారి జాషువా బెదిరించినట్లు ఫిర్యాదు దారులు పేర్కొన్నారు. ఆ తరువాత వ్యాపారుల నుంచి అందరూ కలిసి రెండు కోట్ల ఇరవై లక్షలు వసూలు చేసారు. ఇందులో రెండు కోట్లు విడదల రజనికి అందినట్లు విజిలెన్స్ విచారణలో తేల్చారు. అదే విధంగా మిగిలిన సొమ్ములో పది లక్షలు రజనీ పీఏకి వెళ్లగా.. మరో పది లక్షలు పోలీసు అధికారి జాషువా తీసుకున్నట్లుగా విజిలెన్స్ నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఇక, ఇప్పుడు విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయం పైన ఉత్కంఠ కనిపిస్తోంది.

## విపక్ష కూటమిలో లుకలుకలు?

**(1వపేజీ తరువాయి)**ఇండియా కూటమిని తానే ఏర్పాటు చేశానన్న దీదీ.. దాన్ని సరిగ్గా నడపాల్సిన బాధ్యత సారథి స్థానంలో ఉన్నవారిపై ఉంటుందన్నారు. దీదీకి ఈ వాద్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండగా.. సమాజ్వాదీ, శివసేన (ఉద్ధవ్) నేతలు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. దీంతో కూటమిలో గందరగోళ వాతావరణం నెలకొంది.

## వైసీపీ పోరుబాటకు సిద్ధం

**(1వపేజీ తరువాయి)**నిలవాల్సిన అవసరం తమపై ఉందని అన్నారు. ప్రభుత్వంపై అన్ని రకాలుగా ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం జరిగేలా పోరాటం చేయాలని సజ్జల సూచించారు. ఈ నెల 13వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలను నిర్వహించాలని, వినతిపత్రాలను సమర్పించా లని అన్నారు. పార్టీ శ్రేణులందరూ ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసేవారు లేక, గిట్టుబాటుధర అందక రైతులు అల్లాడుతున్నా రని, అన్నదాతలు ఈ దుస్థితికి చేరడానికి కారణం చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలేనని అన్నారు. రాష్ట్రంలో రైతు సమస్యలను నిర్లక్ష్యంగా చూస్తున్న ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా ఈ ఉద్యమం సాగాలని జగన్ సూచించారని చెప్పారు. అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి సంయుక్తంగా ర్యాలీలను నిర్వహించాలని, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రాలను అందజేయాలని సజ్జల చెప్పారు. గ్రామం నుంచి జిల్లాస్థాయి వరకు మొత్తం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఈ ఉద్యమంలో పాల్గొనాలని అన్నారు. శాంతియుతంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ఉద్దేశపూరకంగా అనుమతులు నిరాకరించినా, కేసులు పెట్టినా న్యాయపరంగా ఎదుర్కొంటా మని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ, రైతాంగానికి అండగా నిలుస్తూ వారి గొంతుకగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు.

## బంగాళాలో బలపడ్డ అల్పపీడనం

**(1వపేజీ తరువాయి)**తమిళనాడు వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని చెన్నై రీజినల్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ సాయంత్రం నుంచి నాలుగు రోజుల పాటు చెన్నై సహా కడలూరు, మైలాడుథురై, నాగపట్నం, కరైకల్, చెంగల్పట్టు, విల్లుపురంలల్లో భారీ వర్షాలు కురుస్తాయి. గల్ఫ్ ఆఫ్ మన్నార్.. తిరువారూరు, తంజావూరు, కాళ్లకురిచ్చి, అరియలూర్, పెరంబలూర్, తిరుచిరాపల్లి, పుదుక్కోట్టై, రామనాథపురం, శివగంగ, తూత్తుకూడి జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు పడతాయి. కేప్ కొమొరిన్ ఏరియా పరిధిలోకి వచ్చే కన్యాకుమారి, భారత్- శ్రీలంక మధ్య భాగం అంటే గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెన్నై ఐఎండీ తెలిపింది. ఏపీ దక్షిణ ప్రాంతం, రాయలసీమపైనా.. దీని ప్రభావం ఏపీ దక్షిణ ప్రాంతం, రాయలసీమపైనా తీవ్రంగా ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. నేడు నెల్లూరు, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల చిరుజల్లులు పడొచ్చు. సీమ జిల్లాల్లో.. గురువారం నాడు నెల్లూరు, అనంతపురం, శ్రీ సత్యసాయి పుట్టపర్తి, కడప, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే

## ఒంటరి పోరు

**(1వపేజీ తరువాయి)**ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పందించిన అరవింద్ కేజ్రివాల్ అలాంటిదేమీ లేదని తేల్చిచెప్పేశారు. కాంగ్రెస్ తో పొత్తుకు అవకాశమే లేదని కేజ్రివాల్ క్లారిటీ ఇచ్చారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తుందని అరవింద్ కేజ్రివాల్ తేల్చిచెప్పేసారు. తమ సొంత బలంతోనే ఆప్ ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేయబోతోందని కేజ్రివాల్ ఎక్స్‌లో వెల్లడించారు. అలాగే కాంగ్రెస్‌తో పొత్తుకు ఎలాంటి అవకాశం లేదని కూడా తేల్చిచెప్పారు. దీంతో కాంగ్రెస్-ఆప్ మధ్య పొత్తు లేదని తేలిపోయింది. ఇప్పటికే ఆప్ ఢిల్లీ ఎన్నికల కోసం రెండు విడతలుగా అభ్యర్థుల జాబితాల్ని కూడా విడుదల చేసింది.

## 16న సీఎం చంద్రబాబు పోలవరం పర్యటన

**అమరావతి-నవభూమి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు పోలవరం పర్యటనకు వెళుతున్నారు. డిసెంబరు 16న ఆయన పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. గతంలో తాము 2014-19 మధ్య ప్రభుత్వంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించి, పనులను సమీక్షించేవారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జూన్ 17న పోలవరం వెళ్లారు. ఇక, తన తాజా పర్యటన సందర్భంగా... చంద్రబాబు పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణం గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకోనున్నారు. జనవరి 2 నుంచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మించనుండగా, దానిపై ఇంజినీర్లతో మాట్లాడనున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### రఘురామ కేసులో సీఐడీ మాజీ ఏఎస్పీ విజయపాల్ కు రెండ్రోజుల కస్టడీ

**అమరావతి-నవభూమి:** ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజును గత ప్రభుత్వ హయాంలో కస్టడీలో చిత్రహింసలు పెట్టారన్న కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయపాల్ ఆరోపణలు ఎదుర్కొంటుండడం తెలిసిందే. ఆయనను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
గురువారం
12 । డిసెంబర్ । 2024


# విదేశీ వ్యవహారాలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ





**న్యూఢిల్లీ-నవభూమి:** విదేశీ వ్యవహారాల పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశమైంది. కొద్దిసేపటి క్రితమే ఈ సమావేశం ప్రారంభమైంది. పార్లమెంట్ హౌస్ బిల్డింగ్‌లో ఈ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ .. 'భారత్-బంగ్లాదేశ్ సంబంధాల భవిష్యత్తు' అనే అంశంపై కీలక ఉపన్యాసం చేయనున్నారు.

ఇటీవల షేక్ హసీనా పదవీచ్యుతురాలు అయినప్పటి నుంచి భారత్-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు సన్నగిల్లుతూ వచ్చాయి. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు పెరిగాయి. కొన్ని రోజుల క్రితం బంగ్లాదేశ్‌లోని ఇస్కాన్‌కు చెందిన చిన్మయి క్రిష్ణదాస్‌ను బంగ్లాదేశ్ పోలీసులు అరెస్ట్ చేయడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలహీనమయ్యాయి.

ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌లో పర్యటించారు. ఆ దేశంలోని కీలక నేతలతో సమావేశమై.. రెండు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపర్చే ప్రయత్నం చేశారు. ఇవాళ బంగ్లాదేశ్ నుంచి తిరిగొచ్చిన ఆయన.. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో బంగ్లా టూర్ వివరాలను వెల్లడించనున్నారు.

## బీజేపీ నేతను మోసగించిన నవ వధువు.. లక్షల డబ్బుతో పరార్



**పాట్నా-నవభూమి:** బీజేపీ నేతను నవ వధువు మోసగించింది. అతడిని పెళ్లాడిన ఆమె లక్షల డబ్బుతో పారిపోయింది. ఆ మహిళకు మరో భర్త కూడా ఉన్నట్లు ఆ బీజేపీ నేత ఆరోపించాడు. మాయమైన నవ వధువుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ధరమ్‌గంజ్ గ్రామానికి చెందిన బీజేపీ యువమోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి రాకేష్ గుప్తాకు ఇటీవల ఇషికా అనే మహిళతో పెళ్లి జరిగింది. గుడిలో పెళ్లి చేసుకున్న ఈ జంట ఆ తర్వాత ఘనంగా రిసెప్షన్ ఏర్పాటు చేశారు. అయితే బెంగాల్‌లోని తన ఊరికి వెళ్లిన నవ వధువు ఆ తర్వాత మాయమైంది.

కాగా, కొత్తగా పెళ్లైన తన భార్య ఇషికాను రాత్రివేళ తన ఇంట్లో అత్తమామలు ఉంచలేదని రాకేష్ గుప్తా ఆరోపించాడు. వారి కోసం ఆ మహిళ పదేపదే డబ్బు అడిగిందని తెలిపాడు. ఒక స్థలం, రూ.30 లక్షలకు పైగా నగదు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ డబ్బుతో ఆమె పారిపోవడానికి అత్తమామలు సహరించారని ఆరోపించాడు. తమ కుమార్తెను డాక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురికి పిలిచారని, అక్కడకు వెళ్లిన ఆమె కనిపించకుండా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తొమ్మిది నెలల కిందట బెంగాల్‌లోని కంకిలో మరో వ్యక్తిని పెళ్లాడిన ఆమె అతడిని కూడా మోసం చేసిందని ఆరోపించాడు. దీనికి సంబంధించిన ఫొటోను బయటపెట్టాడు. మరోవైపు రాకేష్ గుప్తా ఆరోపణలను ఇషికా తల్లిదండ్రులు ఖండించారు. వారిద్దరికి పెళ్లి జరుగలేదని తెలిపారు. డిసెంబర్ 6న కేవలం నిశ్చితార్థం జరిగిందని చెప్పారు. అయితే పోలీసులు ఇరు కుటుంబాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా వారి మధ్య ఘర్షణ జరిగింది. కాగా, రాకేష్ గుప్తా ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిమిషాల తేడాతో మామా, కొత్త కోడలు ఆత్మహత్య.. గ్రామంలో విషాదం..!



**మౌగంజ్-నవభూమి:** ఎప్పటిలాగే ఆ రోజు కూడా ఆ కుటుంబం రాత్రి భోజనం పూర్తి చేసుకుంది. ఆ తర్వాత కోడలు సడీసప్పుడు లేకుండా తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది. అత్త కీడును శంకించి తన భర్తను అప్రమత్తం చేసింది. దాంతో మామ.. కోడలు గది తలుపుతట్టినా ఫలితం లేకపోవడంతో ఆందోళనతో మొత్తుకున్నాడు. సప్పుడు విన్న ఇరుగుపొరుగు వచ్చి తలుపులు పగులగొట్టగా కోడలు గదిలో ఉరేసుకుని ఉంది. అది చూసిన మామ మరో గదిలోకి వెళ్లి తాను కూడా ఉరేసుకున్నాడు.

నిమిషాల వ్యవధిలోనే మామ, కోడలు ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం మౌగంజ్ జిల్లాలోని నాయ్‌గర్హి పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీర్ గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. భీర్ గ్రామానికి చెందిన వెంకట్ యాదవ్ (60) భార్య, కొడుకు, కోడలుతో కలిసి నివాసం ఉంటున్నాడు. వెంకట్ యాదవ్ కుమారుడు రామ్ గరీబ్‌కు ఇటీవలే వివాహం జరిగింది. పూనమ్ యాదవ్ అనే యువతి ఆ ఇంటి కోడలిగా వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఎప్పటిలాగే కుటుంబంలోని నలుగురూ భోజనం చేశారు. ఆ తర్వాత రామ్ గరీబ్ బయటికి వెళ్లాడు. పూనమ్ యాదవ్ సడెన్‌గా తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది. కీడును శంకించిన అత్త తన భర్తను అప్రమత్తం చేసింది. దాంతో ఆందోళనకు గురైన వెంకట్ యాదవ్ కోడలు గది తలుపుతట్టాడు. అయినా అవతలి నుంచి స్పందన లేకపోవడంతో ఆయన పెద్దగా కేకలు వేశాడు. దాంతో ఆ చప్పుడు విని ఇరుగుపొరుగు వచ్చారు. గది తలుపులు పగులగొట్టారు. లోపల చూడగా పూనమ్ యాదవ్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. దాంతో ఆ ఇంట్లో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. కాసేపటికే వెంకట్ యాదవ్ మరో గదిలోకి వెళ్లి తాను కూడా ఉరేసుకున్నాడు. నిమిషాల వ్యవధిలో మామా, కోడలు ఇద్దరూ ఆత్మహత్య చేసుకోవడం గ్రామంలో సంచలనంగా మారింది. కాగా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మామ, కోడలు ఆత్మహత్యలకు గల కారణాలు దర్యాప్తులో తెలుస్తాయని చెప్పారు.

# దీదీ కంటే ఉద్ధవ్ ఠాక్రేనే సరైన వ్యక్తి.. ప్రతిపక్ష కూటమి నాయకత్వంపై శివసేన నేత కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతిపక్ష ఇండియా కూటమిలో నాయకత్వ పోరు ముదురుతున్నది. ఇటీవలే జరిగిన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో దారుణ ఓటమితో కాంగ్రెస్, రాహుల్‌గాంధీ నాయకత్వ పటిమపై కూటమి భాగస్వామ్య పార్టీల్లో నమ్మకం సడలింది. రాహుల్ నాయకత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమేనని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తామూ మునగడం ఖాయమని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతున్నారు. ఇప్పటికే సమాజ్‌వాదీ, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్), శివసేన (యూబీటీ) దీదీకి మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దుబే కీలక వ్యాఖ్యలు చేశారు. మమతా బెనర్జీ సమర్థ నాయకురాలే అని.. అయితే, కూటమికి నాయకత్వం వహించేందుకు తమ పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే అత్యంత సరైన వ్యక్తి అని వ్యాఖ్యానించారు. 'మమతా బెనర్జీ బలమైన నాయకురాలు. 2016, 2021లో బెంగాల్‌లో ప్రధాని మోదీ రాజకీయ ఉప్పెనను రెండుసార్లూ సమర్థవంతంగా అడ్డుకున్నారు. అయితే, కూటమిని ఏకం చేయడానికి, ముందుకు నడిపించడానికి అవసరమైన అన్ని లక్షణాలు ఉద్ధవ్ ఠాక్రేకు ఉన్నాయి. దేశాన్ని ఆయన అభివృద్ధివైపు నడిపించగలడు. ఇండియా కూటమిని అందరికంటే మెరుగ్గా నడిపించగలడు' అని దుబే వ్యాఖ్యానించారు.

## ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి.. మందుపాతర పేలి జవాన్‌లకు గాయాలు



**బీజాపూర్-నవభూమి:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో భద్రతాసిబ్బందికి, మావోయిస్టులకు మధ్య బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గంగ్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముంగా గ్రామంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్లో ఒక మావోయిస్టు మరణించాడు. ఈ సందర్భంగా మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఇద్దరు భద్రతాసిబ్బందికి గాయాలయ్యాయి. ముంగా గ్రామంలో మావోయిస్టు డివిజన్ కమిటీ మెంబర్ దినేష్ మొదియమ్, కమాండర్ వెల్లాతోపాటు 30 నుంచి 40 మంది భేటీ అయ్యారన్న సమాచారం మేరకు భద్రతా సిబ్బంది కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా మావోయిస్టులు తారసపడటంతో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కాల్పులు శబ్దం ఆగిన అనంతరం భద్రతా సిబ్బంది పరిశీలించగా ఒక మావోయిస్టు మృతదేహం లభించింది. ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు సంబంధించిన 9 ఎంఎం పిస్టల్, ఒక మందుపాతర, ఆరు రిమోట్ స్విచ్‌లు, మావోయిస్టులకు సంబంధించిన ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాయపడ్డ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డులను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనా ప్రాంతంలో ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నది.

# 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్‌స్టేషన్.. ప్రకటించిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతరిక్షరంగంలో భారత్ చరిత్ర సృష్టిస్తున్నది. ఎప్పటికప్పుడు సరికొత్త విజయాలను సాధిస్తూ వస్తున్నది. తాజాగా కేంద్ర సెన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కీలక ప్రకటన చేశారు. 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్ ఉంటుందని వెల్లడించారు. సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకోబోతు న్నామన్నారు. అలాగే, 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలుమోపుతారన్నారు. ఫిబ్రవరి 27న తిరువనంతపురంలో గగన్‌యాన్ మిషన్‌ను సంబంధించిన వ్యోమగాముల పేర్లను ప్రకటించిన అనంతరం.. ప్రధాని నరేంద్ర మోదీ 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్ ఉంటుందని చెప్పారు. ఇప్పుడు ఈ కల త్వరలోనే నెరవేరబోతున్నది. ప్రస్తుతం దేశాలకు స్పేస్‌స్టేషన్స్ ఉన్నాయి. భారత్ సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తే.. చారిత్రాత్మక విజయంతో పాటు సొంత స్పేస్‌స్టేషన్ ఉన్న మూడోదేశంగా నిలువనున్నది.

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ భారత్ స్పేస్ స్టేషన్ కోసం ప్రణాళికలు రూపొందించింది. 52 టన్నుల బీఏఎస్ తొలుత ముగ్గురు వ్యోమగాములు వెళ్లొచ్చు. భవిష్యత్‌లో దాని సామర్థ్యాన్ని ఆరుకి పెంచే యోచనలో ఉన్నది. బెంగళూరులోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌లో జరిగిన కన్నడ సాంకేతిక సదస్సులో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. బీఏఎస్ అనేది లైఫ్ సైన్సెస్, మెడిసిన్ రంగాల్లో శాస్త్రీయ పరిశోధనలకు మద్దతు ఇచ్చేందుకు, అంతరిక్ష పరిశోధనలను మెరుగుపరిచేందుకు భారత్ అభివృద్ధి చేస్తున్న మాడ్యులర్ స్పేస్ స్టేషన్. తొలి మాడ్యుల్ 2028లో ఎల్‌వీఎం3 వాహకనౌక ద్వారా ప్రారంభించనున్నట్లు భావిస్తున్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత స్పేస్‌స్టేషన్ రూపుదిద్దుకుంటుంది. స్పేస్‌స్టేషన్ మాడ్యుల్స్‌ని పలు దశల్లో నింగిలోకి పంపి.. ఆ తర్వాత అంతరిక్షంలోనే వాటిని అనుసంధానిస్తారు. 2035 నాటికి స్పేస్‌స్టేషన్ పూర్తవుతుంది. ప్రస్తుతం విశ్వంలో ఒకే స్పేస్‌స్టేషన్ ఉన్నది. దీన్ని నానా అనేక దేశాల సహకారంతో నిర్మించింది. ప్రస్తుతం చైనా సైతం సొంతంగా ఇంటర్‌నేషనల్ స్పేస్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నది. భారత్ సైతం బీఎస్ఏని నిర్మిస్తే మూడోదేశంగా నిలువనున్నది. ఈ స్టేషన్‌కు భారత అంతరిక్ష కేంద్రంగా నామకరణం చేశారు. ఇది భవిష్యత్తులో అంతరిక్ష యాత్రల కోసం మైక్రోగ్రావిటీ, మానవ ఆరోగ్యం, లైఫ్ సస్టెయినింగ్ టెక్నాలజీస్‌పై అధ్యయనానికి అనుమతి ఇస్తుంది. అమెరికా, చైనా దేశాలు ఇప్పటికే తమ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపుతున్నాయి. తాజాగా ఆ జాబితాలో భారత్ పేరు సైతం చేరనున్నది. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం యువ శాస్త్రవేత్తలను ప్రేరేపించడంతో పాటు అంతరిక్షరంగంలో కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం. చంద్రయాన్-1తో చంద్రుడిపై తొలిసారిగా నీటి జాడలను గుర్తించింది. ఆ తర్వాత చంద్రయాన్-3తో దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలిదేశంగా ఇస్రో నిలిచింది. భారత్ స్పేస్ స్టేషన్ సైతం గర్వకారణంగా నిలువనున్నది. అదే సమయంలో అంతరిక్ష పరిశోధనల్లో భారత దేశ స్థానాన్ని సుస్థిరం చేయనున్నది.

## వినూత్న నిరసన.. రాజ్‌నాథ్ సింగ్‌కు గులాబీ, జాతీయ జెండా ఇచ్చిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలు, అదానీ అవినీతి అంశాలు పార్లమెంట్‌ను కుదిపేస్తున్నాయి. సోరోస్ అంశంపై కాంగ్రెస్‌ను అధికార పార్టీ ఎంపీలు ప్రశ్నిస్తుండగా.. అదానీ వ్యవహారంపై బీజేపీని విపక్ష కూటమి ఎంపీలు నిలదీస్తున్నారు. దీంతో సమావేశాలు అట్టుడుకుతున్నాయి. అదానీ అంశంపై కాంగ్రెస్ ఎంపీలు ఇవాళ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పార్లమెంట్ ఆవరణలో గులాబీలు జాతీయ జెండాలను అందించారు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమి ఎంపీలంతా పార్లమెంట్ ఆవరణలో నిల్చొని.. సమావేశాలకు హాజరైన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులకు వీటిని అందించారు. అదే సమయంలో వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు కూడా రాహుల్ గులాబీని, జాతీయజెండాను ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

## బెంగాల్‌లో 40 రాఫెల్స్, రెండు సరిపోతాయి.. బంగ్లాదేశ్‌ను హెచ్చరించిన సువేందు అధికారి



**కోల్‌కతా-నవభూమి:** పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులు, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులపై భారత్‌లో నిరసనలు తీవ్రమవుతున్నాయి. ఇందులో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ నేత సువేందు అధికారి బంగ్లాదేశ్‌ను హెచ్చరించారు. బెంగాల్‌లో 40 రాఫెల్స్ ఉన్నాయన్న ఆయన ఆ దేశంపై దాడికి రెండు సరిపోతాయని అన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బసిర్‌హట్‌లో బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని ఘోజదంగా వద్ద పలు హిందూ సంఘాలతోపాటు బీజేపీ మంగళవారం నిరసన చేపట్టింది.

కాగా, బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అయిన సువేందు అధికారి ఈ నిరసనకు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన బంగ్లాదేశ్‌పై మండిపడ్డారు. భారత్‌పైనే బంగ్లాదేశ్ ఆధారపడిందని అన్నారు. 97 ఉత్పత్తులను పంపకపోతే మీకు కూడు, గుడ్డ ఉండవని విమర్శించారు. అలాగే జార?ండ్ నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్తు సరఫరా చేయకపోతే బంగ్లాదేశ్‌లోని 80 శాతం గ్రామాలు చీకట్లో మగ్గుతాయని అన్నారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపకపోతే రాఫెల్ యుద్ధ విమానాలను పంపుతామని సువేందు అధికారి హెచ్చరించారు. 'హసిమారాలో 40 రాఫెల్ విమానాలు ఉన్నాయి. కేవలం రెండు విమానాలు పంపితే ఆ పని పూర్తి అవుతుంది' అని అన్నారు. అలాగే బంగ్లాదేశ్‌లోని మహ్మద్ యూనస్ ప్రభుత్వాన్ని తాలిబాన్‌తో పోల్చారు. 'ఉగ్రవాద, రాడికల్, మానవ వ్యతిరేక' ప్రభుత్వంగా అభివర్ణించారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా డిసెంబరు 16న పెద్ద సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

## మెరికాతో 553 మిలియన్ డాలర్ల రుణ ఒప్పందాన్ని ఉపసంహరించుకున్న అదానీ పోర్ట్స్



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీఎఫ్‌సీ)తో కుదుర్చుకున్న 553 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని భారత బిలియనీర్ అదానీకి చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీఎస్ఈజడ్) లిమిటెడ్ ఉపసంహరించుకుంది. శ్రీలంక రాజధాని కొలంబోలో ఓడ రేవు అభివృద్ధికి గాను ఈ రుణం ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, ఇప్పుడీ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గినట్టు సోమవారం రాత్రి ఏపీఎస్ఈజడ్ ఫైలింగ్‌ను బట్టి తెలిసింది. రుణ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గిన నేపథ్యంలో కంపెనీ తన ఆదాయం, ఇతర మూలాల నుంచి వచ్చిన డబ్బు, మూలధనం నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

కాగా, అదానీపై ఇటీవల అమెరికాలో తీవ్ర అభియోగాలు నమోదయ్యాయి. సోలార్ ప్రాజెక్టుల కోసం భారత్‌లో ప్రభుత్వ అధికారులకు ముడుపులు ఇచ్చేందుకు అమెరికాలోని పెట్టుబడిదారుల నుంచి 265 మిలియన్ డాలర్లు సేకరించినట్టు కేసు నమోదైంది. అయితే, అమెరికా ఆరోపణలను అదానీ గ్రూప్ కొట్టిపడేసింది. అదానీ ప్రస్తుతం ఆసియా కుబేరుల్లో రెండోస్థానంలో ఉన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తొలి స్థానంలో కొనసాగుతున్నారు.

# చైనా.. ఉక్రెయిన్.. ఇజ్రాయెల్.. ప్రతిచోటా భారతీయులు.. మరి సిరియాలో?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐదేళ్ల కిందట చైనాలో కొవిడ్ వ్యాప్తి మొదలైన సమయంలో వేలాది మంది భారతీయులను అక్కడి నుంచి తరలించారు.. ముఖ్యంగా వీరిలో వైద్య విద్యార్థులు అధికంగా ఉన్నారు.. కొవిడ్ కేంద్ర స్థానంగా భావిస్తున్న వూహాన్ మెడికల్ యూనివర్సిటీ వందల మంది భారత్‌కు క్షేమంగా తీసుకొచ్చారు. దాదాపు మూడేళ్ల కిందట ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలుపెట్టిన సమయంలో ఆ దేశంలో భారీగా ఉన్న భారతీయులను హుటాహుటిన తీసుకొచ్చారు. వీరిలోనూ అత్యధికులు వైద్య విద్యార్థులే. 14 నెలల కిందట గాజా నుంచి ఇజ్రాయెల్ పై దాడికి దిగారు హమాస్ మిలిటెంట్లు. దీంతో ఇజ్రాయెల్ కూడా ప్రతి దాడులు మొదలుపెట్టింది. ఆ దేశం నుంచి వందల మంది భారతీయులను వెనక్కుతీసుకొచ్చారు. గాజాలోనూ ఒక భారతీయుడు ఉన్నట్లు తర్వాత కథనాలు వచ్చాయి. కానీ, అవి నిర్ధారణ కాలేదు. ఇప్పుడు సిరియా వంతు తాజాగా మరో పశ్చిమాసియా దేశం సిరియాను హస్తగతం చేసుకున్నాయి తిరుగుబాటు దళాలు. దీంతో అధ్యక్షుడు బషర్-అల్ అసద్ కుటుంబంతో పాటు దేశాన్ని వీడారు. ఈ నేపథ్యంలో బాబుపై పవన్ మరోసారి! అక్కడున్న భారతీయులను రప్పించేందుకు విదేశాంగ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా 75 మంది భారత పౌరులను సిరియా రాజధాని డమాస్కస్ నుంచి లెబనాన్ కు తీసుకొచ్చారు. వీరిలో 44 మంది కశ్మీర్ కు చెందిన జైరిన్ (యాత్రికులు) అని ప్రభుత్వం తెలిపింది. వాణిజ్య విమానాల్లో లెబనాన్ నుంచి త్వరలోనే ఢిల్లీకి వస్తారని పేర్కొంది. సిరియాలో భారీగానే భారతీయులు పశ్చిమాసియా దేశాల్లో కాస్త మంచి పేరున్న సిరియాను అంతర్యుద్ధం బాగా దెబ్బకొట్టింది. దీంతో 6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొన్ని లక్షల మంది ప్రవాస జీవితం గడుపుతున్నారు. మరోవైపు సిరియాలో ఇంకా అనేకమంది భారతీయులు ఉన్నారని ప్రభుత్వం తెలిపింది.

## జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రకుట్ర భగ్నం.. ఐఈడీని ధ్వంసం చేసిన బలగాలు..



**బారాముల్లా-నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లో భద్రతా బలగాలు ఉగ్రవాద కుట్రను భగ్నం చేశాయి. హంద్వారా-బారాముల్లా హైవేపై భద్రతా బలగాలు బుధశారం ఐఈడీని గుర్తించి నిర్వీర్యం చేశాయి. కుప్వారా జిల్లాలోని హంద్వారా ప్రాంతంలోని లాంగేట్ వద్ద హైవే వెంబడి అనుమానాస్పద బ్యాగ్‌ను పోలీసులు, ఆర్మీ సంయుక్త గస్తీ బృందం గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత డిస్పోజల్ టీం అక్కడికి చేరుకొని అనుమానాస్పద బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని.. ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని పేర్కొన్నారు. ఇంతకు ముందు డిసెంబర్ 9న శ్రీనగర్-బారాముల్లా జాతీయ రహదారిపై టీసీపీ పల్‌హల్లాన్ వద్ద అనుమానాస్పద బ్యాగ్ కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. విచారణ అనంతరం బ్యాగ్‌లో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ అమర్చినట్లు గుర్తించారు. భద్రతా బలగాలు ఐఈడీని స్వాధీనం చేసుకుని ఉగ్రవాదుల దుశ్చర్యను తిప్పికొట్టారు.

## ఢిల్లీలో 4.9 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు.. అధ్వానంగానే గాలి నాణ్యత



ఢిల్లీ-నవభూమి: ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. ఢిల్లీలో ఈ సీజన్‌లో అత్యంత శీతల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవాళ ఉదయం రాజధానిలో ఉష్ణోగ్రతలు 4.9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు చలికి గజగజ వణికిపోతున్నారు. నిరాశ్రయులు నైట్ షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్నారు. చలికి తోడు ఢిల్లీలో వాయు కాలుష్యం అధ్వాన స్థితిలోనే కొనసాగుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. ఇవాళ ఉదయం 7 గంటల ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 209గా నమోదైంది. ఆనంద్ విహార్ ప్రాంతంలో ఏక్యూఐ 218గా, అశోక్ విహార్‌లో 227, ద్వారకాలో 250, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో ఏక్యూఐ లెవల్స్ 218గా నమోదయ్యాయి. ఇక ఆయా నగర్‌లో 148, బురారీ క్రాసింగ్ వద్ద 187, ఛాందినీ చౌక్ ప్రాంతంలో 181, డీటీయూలో 165గా ఏక్యూఐ నమోదైనట్లు సీపీసీబీ తెలిపింది. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.



## ఉపకారికి బంగ్లాదేశ్ అపకారం!

కూర్చున్న కొమ్మనే నరుక్కుంటూ భవిష్యత్తును కాలరాసుకోవడం అంటే ఏమిటో ఇవాళ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను చూసి అర్థం చేసుకోవచ్చు! రిజర్వేషన్ల విషయంలో అసంతృప్తి పేరిట హసీనా నాయకత్వంలోని గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదలైన నిరసనలను ఉద్దేశపూర్వకంగా హిందువుల వైపు మరల్చి, మరీ ముఖ్యంగా హిందూ స్త్రీల పట్ల చెప్పలేని చూడలేని దారుణ మారణకాండను సృష్టిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో చూసి కన్నీరు కార్చని హృదయం లేదు. ఎలాగో కాస్త తేరుకున్న బంగ్లాదేశ్ హిందువులు, వారికి మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలోని హిందువులు చేపట్టిన నిరసనల ఫలితంగా తాత్కాలికంగా హింసాకాండ ఆగినట్టు కనిపించినా కొద్ది రోజుల్లోనే మళ్లీ వికృత చేష్టలు మొదలయ్యాయి. ఇందులో భాగంగానే తాజాగా ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షస్‌నెస్) పూజారి అయిన చిన్మోయ్ కృష్ణదాస్‌పై దేశద్రోహి ముద్ర వేసి జైలుకి పంపాలన్న కుట్ర మొదలైంది. చిన్మోయ్ కృష్ణదాస్ తరఫున వాదిస్తున్న ప్రభుత్వ న్యాయవాదిని అల్లరి మూకలు హత్య చేశాయి. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా బాధిత హిందువులను సమైక్యపరిచి, కాపాడేందుకు ప్రయత్నించడమే చిన్మోయ్ కృష్ణదాస్ చేసిన తప్పు. బంగ్లాదేశ్‌లో గత ఆగస్టు నెల నుంచి కొనసాగిన విధ్వంసకాండలో లెక్కకు మించి హిందూ దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. ఇందులో పదుల కొద్దీ ఇస్కాన్ మందిరాలు కూడా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్‌కు 65 దేవాలయాలుండగా 50 వేలకు పైగా భక్తులు ఉన్నారు. తాజా పరిణామాల్లో భాగంగా ఇస్కాన్‌కి వ్యతిరేకంగా జమాతే ఏ ఇస్లామి సంస్థ బెదిరింపులకు తెగబడింది. ఈ సంస్థ కార్యకర్తలు ఇస్కాన్ ఆలయ బోర్డును కూడా తొలగించి తమ సంస్థ బోర్డు పెట్టారు. అసలు చిన్మోయ్ అరెస్ట్‌కి ముందే బంగ్లా పోలీసులు ఇస్కాన్ ఉగ్రవాద సంస్థ అని వాదిస్తున్నారు. ఇస్కాన్ సభ్యులు భారత నిఘా సంస్థకు అనుబంధంగా పని చేస్తున్నారనీ, దేశంలో మతపరమైన హింసకు వీరే కారణమనీ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో అనేక విలయాలు సంభవించినప్పుడు అక్కడి ప్రజలకు అండగా నిలిచి, బాధితులకు అన్నవస్త్రాలూ నిత్యావసరాలూ ఇచ్చి ఆదుకున్న ఇస్కాన్‌పై దేశద్రోహి అన్న ముద్ర వేశారు.

బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీల రక్షణపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తోంది. కానీ, బంగ్లాదేశ్ లోని యూనిస్ సర్కారు భారత ప్రభుత్వ వాదనను తోసిపుచ్చుతూ వచ్చింది. ఇప్పుడు తమ నిర్లక్ష్యాన్నీ, వివక్షాపూరిత వైఖరినీ కప్పిపుచ్చుకునేందుకు ఇస్కాన్‌ని దోషిగా చూపిస్తోంది. చిన్మోయ్ అరెస్ట్‌తో దేశంలోని హింసకు బాధ్యత వహించకుండా తప్పించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇస్కాన్ సంస్థపై నిషేధం విధించాలన్న పిటిషన్‌ని బంగ్లాదేశ్‌లోని ఢాకా హైకోర్టు తోసిపుచ్చడం ఒక్కటే కాస్త ఉపశమనం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో విస్తరించిన ఇస్కాన్ కార్యకలాపాలపై, సేవలపై ఎక్కడా ఏ వివాదాలూ తలెత్తలేదు. చివరికి భారత్ దాయాది పాకిస్థాన్‌లో సైతం కరాచీ, లరా?నా, సింధ్, హైదరాబాద్, క్వెట్టా, బలోచిస్థాన్ ప్రాంతాల్లో ఇస్కాన్ సంస్థ సేవలు కొనసాగుతున్నాయి. మరెక్కడా లేని రీతిలో ఒక్క బంగ్లాదేశ్‌లోనే ఇస్కాన్‌ని లక్ష్యంగా చేసుకోవడం చూస్తే ఇది కుట్ర గాక మరేమిటి? మూడు నెలల కిందట బంగ్లాదేశ్‌లో భారీగా వానలు కురిసినప్పుడు పలు గ్రామాలు నీట మునిగి అనేక ప్రాంతాలు జలమయమై ఆహారం, ఆశ్రయం లేకుండా పోయాయి. ఆ పరిస్థితుల్లో ఇస్కాన్ భక్తులు బంగ్లాదేశ్ వరద బాధితులకు గొప్ప సేవలందించారు. ప్రాణాలను పణంగా పెట్టి మరీ పడవలపై వరద నీటిలో బాధితుల వద్దకు వెళ్ళి ఆకలి తీర్చారు. బంగ్లాదేశ్‌లో ఇలా ప్రకృతి విలయం ఎప్పుడు సంభవించినా ఇస్కాన్ సభ్యులు చేయూతనిస్తుంటారు. బంగ్లాదేశ్‌లో హిందువుల పైనా, ఇస్కాన్ ఆలయాలపైనా దాడులు జరిగిన సమయంలో కూడా ఇస్కాన్ భక్తులు తమ సేవలను ఆపలేదు. తమపై దాడి జరిగిన చోటే వరద బాధితల కడుపులు నింపిన సహృదయత బంగ్లాదేశ్ ఇస్కాన్ సభ్యుల్లో కనిపించింది. ప్రత్యేకించి శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవ సమయంలో కులమత బేధమన్నది లేకుండా ఆ దేశంలోని పేదలకు ఇస్కాన్ సంస్థ రేషన్ కూడా అందజేస్తూ వస్తోంది. ఇలా ఎన్నో సేవలతో బంగ్లాదేశ్ ప్రజలను అదుకున్న ఇస్కాన్‌పై లేనిపోని ఆరోపణలు చేసి నిషేధం విధించాలనడం బుద్ధి జీవులకు ఆమోదయోగ్యం కాదు. బంగ్లాదేశ్ ప్రజలకు ఇస్కాన్ చేస్తున్న సేవలు ఇలా ఉండగా%-% ఆ దేశ ప్రభుత్వానికి భారత సర్కారు ఎన్ని సందర్భాల్లో అండగా నిలిచిందన్నది మరో పెద్ద చరిత్ర! బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మూలం భారత్. అక్కడి ప్రజలు పోరాటం చేస్తున్నప్పుడు అండగా నిలిచి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఏర్పాటు అయ్యేందుకు సైనిక బలగాలను పంపించి అండగా నిలిచిన దేశం మన దేశం! బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడు ఆ దేశ జనాభాలో హిందువులు దాదాపు 20శాతం ఉండేవారు. నేడు చూస్తే అక్కడ హిందూ మైనార్టీలు 8 శాతానికి క్షీణించారు. జనవరి 2013 నుంచి సెప్టెంబర్ 2021 మధ్య కాలంలో హిందూ సమాజంపై కనీసం 3,679 సార్లు దాడులు జరిగాయని అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీ వెల్లడించింది. అయినప్పటికీ ఆ దేశంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం భారీగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చింది. ఆపత్కాలంలో ఆ దేశ ప్రభుత్వానికి చేదోడువాదోడుగా నిలిచింది. మరోవైపు ఇస్కాన్ సంస్థతో పాటుగా హిందూ సమాజానికి చెందిన సంస్థలు బంగ్లాదేశ్‌లో వివిధ రకాలుగా సేవలు చేస్తున్నాయి. ప్రస్తుత బంగ్లాదేశ్ అధినేత మహ్మద్ యూనిస్ నోబెల్ బహుమతి పొందిన విశిష్ట వ్యక్తి. ప్రభుత్వాధినేతగా ఆయన చొరవ చూపించి ఈ అకృత్యాలను ఆపి, చిన్మోయి కృష్ణదాస్‌ను విడుదల చేస్తారని ఆశిద్దాం. ఈ డిమాండ్ భారతదేశ వ్యాప్తంగా వినిపిస్తోంది. సుమారు 150కు పైగా రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, రిటైర్డ్ హైకోర్టు జడ్జీలు, రిటైర్డ్ సైనికాధికారులు సంతకాలు చేసి, గౌరవ రాష్ట్రపతికి సమర్పించిన వినతిపత్రంలో, చిన్మోయి కృష్ణ దాస్‌ను విడుదల చేసి బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనారిటీలను రక్షించాలన్న డిమాండ్‌ను గట్టిగా వినిపించారు.

## అమర వీరులు అష్ఫాఖ్, బిస్మిల్ స్మరణలో 19న 'ఐక్యతా దినోత్సవం' జరుపుకుందాం

### చరిత్రకారుడు నశీర్ అహమ్మద్ పిలుపు



భారతీయ విప్లవకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు పండిత రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ స్మరణల ోడిసెంబర్ 19న “ ఐక్యతా దినోత్సవం” జరపాల్సిందిగా ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలసిన విలేకరులతో మాట్లాడుతూ ఈ యోధులు ఇరువురికి బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష విధించి 1927 డిసెంబర్ 19న అమలుపర్చిందని తెలిపారు. భారత స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాఖుల్లా ఖాన్ (1900-1927), పండిత రాంప్రసాద్ బిస్మిల్ (1897-1927) ల మధ్యన చాలా పోలికలు ఉన్నాయని నశీర్ అహమ్మద్ అన్నారు. భయమెరగని ఈ ఇరువురు విప్లకారులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షాజహాన్పూర్ కు చెందినవారని, వీరిరువురూ షాజహాన్పూర్ లోని “ అబ్బీ రిచ్ మిషన్ ఉన్నత పాఠశాల “ లో చదువుకున్నారని, అంతేకాకుండా పాఠశాలలో చదువుతున్నప్పుడే వీరికి విప్లవ భావాలు అలవడ్డాయని, మాతృభూమి విముక్తి పోరాటంలో పాల్గొనాలన్న నిర్ణయం మేరకు ఇరువురు మధ్యలోనే చదువు మానేశారన్నారు. అనంతరం రాంప్రసాద్,





అష్ఫాఖ్ “ హిందుస్థాన్ రిపబ్లిక్ ఆర్మీ “ లో సభ్యులుగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సాగిన సాయుధ విప్లవోద్యమంలో భాగస్వాములయ్యారు. ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర ఆజాద్ మార్గదర్శకంలో సాగిన బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాలలో ఇరువురు కలసి చురుగ్గా పాల్గొన్నారు, ఆంగ్లేయ ప్రభుత్వాధినేతలను కలవరపెట్టిన “కాకొరి రైలు దోపిడీ” సంఘటనలో ఇరువురు ప్రధాన పాత్ర నిర్వహించారని నశీర్ వివరించారుచారు. ఆ కారణంగా ఆనాటి ఆంగ్లేయ వలస ప్రభుత్వం ఈ విప్లవకారుల పట్ల కటినంగా వ్యవహరిస్తూ ఇరువురికి ఉరి శిక్ష విధించగా, ఆ శిక్ష 1927 డిసెంబర్ 19 తెల్లవారు జామున ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జైళ్ళల్లో అమలయ్యాయి. పండిత రాంప్రసాద్ బిస్మిల్ ను గోరఖ్పూర్ జైలులో, అష్ఫాఖుల్లా ఖాన్ ను ఫైజాబాద్ జైలులో ఒకేరోజు, ఒకే సమయాన ఆంగ్ల ప్రభుత్వం ఉరిశిక్షకు గురిచేసింది. ఈ విప్లవకారుల ఇరువురు జీవిత పర్యంతం భారతీయులలో ఐక్యతకు ప్రతీకలుగా నిలిచారని, ఆనాడు ఒకరికోసం మరొకరు తమ ప్రాణాలను బలిపెట్టడానికి ఇద్దరూ పోటీ పడిన వైనానాన్ని నశీర్ అహమ్మద్ దృశ్యాత్మకంగా వివరించారు. ఆ కారణంగా భారతీయులలో ఐక్యతను మరింతగా పటిష్ఠం కావాలన్న ఆకాంక్షతో ప్రతి ఏటా డిసెంబర్ 19న “ఐక్యతా దినోత్సవం” జరుపుకుంటూ ఆ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకుందామని నశీర్ ప్రజలకు, ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేశారు. ఈ అమరవీరుల త్యాగమయ సాహసోపేత పోరాట చరిత్ర తెలుసుకోదలచిన పాఠకులకు ఆ మహనీయుల జీవిత చరిత్రల గ్రంథాలను (పిడిఎఫ్ ఫైళ్లు) ఉచితంగా పంపగలమని ఆయన తెలిపారు. ఆసక్తిగల పాఠకులు ం 91 9440241727 తో సంప్రదించాల్సిందిగా బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ ప్రజలకు ఆహ్వానం పలికారు.

## ఆలయం.. ఆదరణ.. అక్కసుల చరితం!



సర్వమత సమాదరణలో మనకు సాటిరాగల దేశం లేదని గర్వంగా చెప్పుకుంటాం. శతాబ్దాల మతాల సహ జీవనానికి అదే కారణమనీ నమ్ముతాం. అది నూటికి నూరుపాళ్లు నిజమా? ఒట్టి ఆదర్శ ప్రచారమా? చరిత్ర పరిశీలనకు అది నిలబడేదేనా? మన పాలకులు అంతటి విశాల హృదయులా? రాజ్యాన్ని వీరభోజ్యంగా భావించిన నేలలో అంతటి ఔన్నత్యాన్ని ప్రదర్శించారా? అన్నీ గంభీర ప్రశ్నలే! అందరినీ సంతృప్తిపరచే జవాబులే తేలికగా లభించవు! రాజ్య విస్తరణకు రక్తాలు చిందించటంలో మన పాలకులు ఎవరికీ తీసిపోలేదు. కానీ సర్వమత సమాదరణలో మాత్రం మన పాలకులు కొంతమేరకు సఫలం అయ్యారు. పూర్తిగా విఫలం మాత్రం కాలేదు! అందుకే మన చరిత్రను జాగ్రత్తగా మదింపు వేసుకుంటే సమాదరణలో మన సఫలతను ఆత్మస్తుతిగా భావించలేం! దీన్నుంచి ప్రేరణ పొంది మరిన్ని మంచి అడుగులు వేయటానికి మాత్రం ప్రస్తుతం తడబడుతున్నాం. విద్వేషాన్ని ఎగదోసే భావాలతో మందిర్%-%మసీద్‌ల చుట్టూ వివాదాలను రగల్చటానికే నాయకులు వ్యూహాలకు పదును పెడుతున్నారు. మసీదులపై కేసుల మీద కేసులు అందుకే పడుతున్నాయి. వారణాసి, మథుర, భోజ్‌శాల వివాదాలకు ఇప్పుడు సంభల్ మసీదు గొడవ తోడైంది. ఆరోపణల సారం మాత్రం మారటం లేదు. గుడులను కూల్చి మసీదులు కట్టారనే ఆరోపణలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయోధ్య తీర్పుతో భవిష్యత్తులో మందిర్%-%మసీద్ వివాదాలు తలెత్తవనే నమ్మకం క్రమేపీ నీరుకారి పోతోంది. ప్రార్థనా స్థలాలు, కట్టడాల స్వభావాన్ని మార్చకూడదని నిర్దేశించే 1991 నాటి చట్టాన్ని సుప్రీంకోర్టు గట్టిగానే సమర్థించింది. దాన్నిప్పుడు పట్టించుకునే పరిస్థితి కనపడటం లేదు. గుడుల కూల్చివేతలను తేల్చటానికీ, అవసరమైన పక్షంలో ప్రార్థనలు అనుమతించటానికీ సుప్రీం తీర్పు తమకు అడ్డుకాబోదన్న రీతిలోనే కింది కోర్టులు వ్యవహరిస్తున్నాయి. దీన్ని కట్టడి చేయాలని అభ్యర్థనలు వెల్లువెత్తుతున్నా సుప్రీంకోర్టు నుంచి అలాంటి ఆదేశాలు ఇప్పట్లో వచ్చే అవకాశమే కనపడటం లేదు.

ఇస్లాం పాలకులందరినీ ఆలయ విధ్వంసకులుగా ప్రచారం చేయటం ఇటీవల మామూలై పోయింది. చరిత్ర పేరుతో పుంఖానుపుంఖంగా అటువంటి రచనలు వచ్చి పడుతున్నాయి. అన్ని వైపుల నుంచి చుట్టుముట్టుతున్న ఆ తరహా ప్రచారంతో ఇబ్బందులెన్నో వస్తున్నాయి. పాలకుల మతం ఆధారంగా చరిత్రలో మంచిచెడులను నిర్ణయించటంతో ద్వేషభావనలకు పునాదులు పడ్డాయి. దేశంలో చీకటియుగం ముస్లిం పాలకులతో మొదలైందని చెప్పటానికి చరిత్రనే తారుమారు చేస్తున్నారు. బ్రిటిష్ పాలకులతో మొదలైన చరిత్ర వక్రీకరణ ఇటీవల ఇంకా ముదిరిపోతోంది. మన చరిత్రలో ఆలయాల విధ్వంసాలు జరిగాయి. కాదనలేం. మసీదులు దాడులకు గురయ్యాయి. వాటినీ తృణీకరించలేం. అధికారం కోసం సాగిన యుద్ధాల్లో ప్రార్థనా మందిరాలు సమిధలయ్యాయి. వాటినీ విస్మరించలేం. ప్రత్యర్థిని దెబ్బతీయటానికి అతని కోటలనే కాదు అతను పరమ పవిత్రంగా పూజించే దేవాలయాలనూ మందిరాలనూ లక్ష్యంగా చేసుకున్నారు. అవి జరగలేదనీ చెప్పలేం. కానీ మొత్తం చరిత్రంతా అదేననీ, ముస్లిం రాజుల పాలనంతా పరమత ద్వేషంతోనే నిండిపోయి ఆలయాల విధ్వంసంతో గడచి పోయిందని చెప్పటంతోనే సమస్య వస్తుంది. ముస్లిం రాజుల పాలన మొదలయ్యే నాటికే కుల సామాజిక వ్యవస్థ బాగా వేళ్లూనుకుంది. దీన్ని తొలగించటానికో, సంస్కరించటానికో ముస్లిం పాలకులు ప్రయత్నించ లేదు. సైనిక సామర్థ్యంతో పాలనా యంత్రాంగంలో పైస్థాయిలో కుదురుకున్నా శిస్తు, పన్ను వసూళ్లకు కుల పెద్దలపైనే ఆధారపడ్డారు. చాలా చోట్ల రెవెన్యూ యంత్రాంగాన్ని యథాతథంగా కొనసాగించారు. సైన్యంలో గతంలోలాగే చేరికలను ప్రోత్సహించారు. కొందరికి ఉన్నత పదవులూ కట్టబెట్టారు. ఇక మెడమీద కత్తిపెట్టి మతమార్పిడులు చేశారనటానికి కూడా చారిత్రక ఆధారాల్లేవు. వందలేళ్లు అధికారం చలాయించిన ఢిల్లీ చుట్టుపక్కల గంగామైదాన ప్రాంతాల్లో అత్యధిక ప్రజలు ముస్లింలుగా మారలేదు. వందల సంవత్సరాలు ముస్లిం పాలనలో ఉన్నా హైదరాబాద్‌లోనూ మెజారిటీ ప్రజలు హిందువులుగానే ఉన్నారు. బలవంతంగా మతమార్పిడులు చేసి ఉంటే ముస్లిం పాలనకు కేంద్రాలైన నగరాల్లోనే గట్టిగా ఆ పనిని చేసి ఉండేవారు. బలగాలన్నీ అక్కడే ఉంటాయి. బలవంతాలూ అక్కడే సులువు! ఇక దేశానికి రెండు కొనల్లో ఉండే పశ్చిమ పంజాబులోనూ, తూర్పు బెంగాల్‌లోనూ పెద్దఎత్తున ప్రజలు ముస్లింలుగా మారటానికి అనేక కారణాలున్నాయి. అక్కడా బలప్రయోగం లేదు. సూఫీ గురువుల బోధనలే ప్రధానపాత్రను పోషించాయి. ఇక ముస్లిం పాలకులు కూడా గుడులకు జాగీర్లూ ఇచ్చారు. ఇనాంలూ ఇచ్చారు. పునరుద్ధరణకు పైకాలూ ఇచ్చారు. చరిత్రను నిష్పాక్షికంగా విశ్లేషించిన అధ్యయనాల్లో ఇదే తేలింది. క్యాలిఫోర్నియా వర్సిటి యాంత్రపాలజీ ప్రొఫెసర్‌గా పనిచేసిన క్యారన్ లేనర్డ్ హైదరాబాద్‌లోని హిందూ ఆలయాలపై చేసిన పరిశీలనల్లో ఎన్నో నిజాలు నిగ్గుతేలాయి. నిజాంల పాలనలో కీలకంగా ఉన్న కాయస్థ కులస్థులపై లేనర్డ్ చేసిన పరిశీలన బహుముఖమైంది. 50 ఏళ్ల కిందటే అందుకోసం విస్తృతంగా పర్యటించారు. హైదరాబాదీయులపై ఇటీవల వరకూ ఆమె పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. నిజాంలు హిందూ ఆలయాలపై చూపిన ఆదరణను వివరించటానికి లేనర్డ్ చాలా ఉదాహరణలు ఇచ్చారు. ముస్లిం పాలకులు గుడులను కూల్చివేస్తారనే దురభిప్రాయం తొలగటానికి లేనర్డ్ పరిశోధనలు తోడ్పడతాయి. సందేహం లేదు! అంతమాత్రాన నిజాంలు మతాన్ని రాజకీయాల కోసం అసలు వాడుకోలేదని చెప్పలేం. సంక్షోభం చుట్టుముట్టినప్పుడు మతాన్ని రెచ్చగొట్టే చర్యలకు ఊతం ఇచ్చారు. రజాకార్ల విజృంభణలో అది స్పష్టంగా కనపడింది. 1940లకు ముందు మాత్రం మతాదరణలో చాలావరకూ సాధారణ వైఖరినే ప్రదర్శించారు. ఈ సాధారణ వైఖరేమిటి అన్న ప్రశ్న వెంటనే వస్తుంది. దీన్నే బహుళ మత సంస్కృతుల ఆదరణ విధానంగా లేనర్డ్ వర్ణించారు. అంటే ఒక మతాన్ని పాలక మతంగా స్వీకరించి.. మిగతా మతాలను పూర్తిగా అణగదొక్కి.. పాలకవర్గ మతానికే ప్రోత్సాహం ఇవ్వటం కాకుండా.. అన్ని మతాలను వీలైనంతమేరకు ఆదరించటమే దాని సారంగా చెప్పుకోవచ్చు. భారత ఉపఖండంలో ఈ భావన ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఒక విధాన రూపాన్ని సంతరించుకుంది. నైజాం పాలకులూ దీన్ని అనుసరించారు. వారు సున్నీ వర్గానికి చెందిన వారైనా షియాల ప్రార్థనా మందిరాల పోషణకు జాగీర్లు ఇచ్చారు. మొహర్రం ఊరేగింపులను కొనసాగనిచ్చారు.

ముస్లిం రాజుల పాలనా కాలంలో కాయస్థులు పాలనా వ్యవహారాల్లో, రెవెన్యూ లెక్కల్లో ప్రావీణ్యం సంపాదించి, మంచి అధికారులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ భాషలపై గట్టిపట్టును సాధించారు. ఇక హైదరాబాద్ కాయస్థుల్లో ఏడు ఉపకులాలు (సక్సేనా, మాథుర్, శ్రీవాత్సవ, గౌర్, భట్నాగర్, నిగం, అస్తానా) ఉండేవి. నిజాంల రాజ్యం లోని కాయస్థ అధికారులు-ప్రముఖుల అజమాయిషీ లో 19వ శతాబ్దంలో 15 హిందూ ఆలయాలు ఉండేవి. వీటిల్లో ఎక్కువ వాటిని వారే స్వయంగా నిర్మించారు. అంతకుముందు నుంచీ ఉన్న కొన్నిటిని నిర్వహణలోకి తీసుకున్నారు. రాంబాగ్ (హైదరాబాద్ కు పశ్చిమాన), చిత్రగుప్త (ఉప్పుగూడ), దేవల్ బజార్ రూప్‌లాల్ (శాలిబండ), నర్సింజీ/ మాయారాం (శాలిబండ), బుచర్‌మాల్ ఆలయం (శాలిబండ), లలితాదేవి బాగ్ (ఉప్పుగూడ), బాలాజీ మహదేవ్ (కోట్ల ఆలీ జా), కేశవ్‌గిరి (హైదరాబాద్ దక్షిణం), రామచంద్రజీ (పురానపూల్), రాంమందిర్ (శాలి బండ), కాళీ టెంపుల్ (ఉప్పుగూడ), శంకర్‌జీ (మీర్ జుమ్లా ట్యాంక్), నర్సింగ్ బాబా (ఉప్పుగూడ), శంకర్‌బాగ్ (ఉస్మాన్‌గంజ్) ఆలయాలు.. ఇప్పుడు మనం పాతబస్తీగా భావించే ప్రాంతంలోనే ప్రధానంగా ఉండేవి. కాయస్థేతరులు నిర్మించిన గుడులు కూడా ఉన్నాయి. రెండుమూడు చోట్ల ఆలయాలు, దర్గాలు, మసీదులు ఒకే ప్రాంగణంలో ఉండేవి. బ్రహ్మక్షత్రీ కులానికి చెందిన రాజా రఘురాం బహదూర్ 1822లో నిర్మించిన కిషన్‌బాగ్ గుడి అలాంటిదే. ఈ గుడికి మూడో నిజాం సికిందర్‌జా రెండు జాగీర్లు ఇచ్చారు. దర్గా ఉర్సు ఉత్సవాలకు రాజా రఘురాం ప్రత్యేకంగా భవనాలను నిర్మించారు.

## రాక్షస గుణాలు అంతం కావాలంటే..

**భక్తి**



గణేశుడు గణాలన్నిటికీ రాజైతే కార్తికేయుడు సర్వసైన్యాధ్యక్షుడు. మన శరీరంలో కుడివైపున ఉండే పింగళా నాడిని ప్రభావితం చేసే శక్తికి ప్రతీకగా ఉంటాడు. ఆ శక్తి మన ప్రాణశక్తితో అనుసంధానమై ఉంటుంది. కార్తికేయుడి అనుగ్రహం పొందడం వల్ల... తేజస్సు, చక్కటి క్రియాశీలత, చెడుని అంతమొందించే అంతర్గత దైవశక్తి లభిస్తాయి. పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మ దేవుడి గురించి కఠోరమైన తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షం అయ్యాక... తనకు మరణం లేకుండా వరం ఇవ్వాలని కోరాడు. అలాంటి వరం సాధ్యం కాదని బ్రహ్మదేవుడు చెప్పగా... తారకాసురుడు బాగా ఆలోచించి, శివుడి కుమారుడి చేతిలో మాత్రమే మరణించే వరం ఇవ్వాలని అడిగాడు. ఎందుకంటే ఆ సమయానికి శివుని భార్య సతీదేవి అగ్నిలోకి దూకి ఆత్మార్పణ చేసుకుంది. ఆ బాధతో శివుడు హిమాలయాల్లో తపస్సులో లీనమై ఉన్నాడు. శివుడు తపస్సును భగ్నం చేసే సాహసులెవరూ లేరు. ఒకవేళ శివుడు తపస్సు నుంచి బయటకు వచ్చినా... ఆయనకు భార్య లేదు కాబట్టి కుమారుడు కలిగే అవకాశం లేదని తారకాసురుడు భావించాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని అనుగ్రహించాడు.

కుమారస్వామి జననం...ఆ తరువాత తనను చంపేవారెవరూ లేరనే గర్వంతో తారకాసురుడు విర్రవీగాడు. ముల్లోకాలను తన దారుణ కృత్యాలతో గడగడలాడించాడు. దేవేంద్రుణ్ణి తరిమేసి స్వర్గలోక ఆధిపత్యాన్ని తీసుకున్నాడు. అప్పుడు తమకు తరుణోపాయం సూచించాల్సిందిగా దేవతలందరూ నారదుణ్ణి వేడుకున్నారు. సతీదేవి పర్వతరాజైన హిమవంతుడి కుమార్తెగా... పార్వతి పేరుతో మళ్ళీ జన్మించిందని, ఆమె శంకరుడికి పత్ని అవుతుందని నారదుడు చెప్పాడు. ఆ తరువాత దేవతలందరూ కలిసి సప్తర్షుల సాయంతో శివ పార్వతులకు వివాహం జరిపించారు. వారి సంతానమే కుమారస్వామి లేదా కార్తికేయుడు. ఆరు ముఖాలు ఉంటాయి కాబట్టి ఆయనకు 'షడాననుడు', 'షణ్ముఖుడు' అని, నెమలి ఆయన వాహనం కాబట్టి 'శిఖి వాహనుడు' అని, ఋషి పత్నులైన కృత్తికల దగ్గర పెరగడం వల్ల 'కృత్తికాసూనుడు', 'కార్తికేయుడు' అనే నామాలు ఏర్పడ్డాయి. ఆయనను సుబ్రహ్మణ్యస్వామి, మురుగన్, వేలాయుధన్, దండపాణి.. ఇలా అనేక పేర్లతో పిలుస్తారు.

తారకాసుర సంహారం...కార్తికేయుడి జననం మార్గశిర శుద్ధ షష్ఠి నాడు జరిగింది. ఆయన ద్వారా తమకు స్వేచ్ఛ రాబోతోందని దేవతలు సంతోషించగా, తారకాసురుడి అనుచరుల్లో నిరాశ, భయాందోళనలు పెరిగాయి. కుమారస్వామికి విశ్వామిత్ర మహర్షి 'గుహ' అనే నామాన్ని ఇస్తూ... వేదజ్ఞానాన్ని ప్రసాదించాడు. అగ్ని దేవుడు 'శక్తి' అనే ఆయుధాన్ని ఇచ్చాడు. అనంతరం కైలాసానికి యువరాజుగా కార్తికేయుడు పట్టాభిషిక్తుడు అయ్యాడు. వివిధ దేవతలు తమ ఆయుధాలను, శక్తులను బహుమతులుగా ఇచ్చారు. దేవతల సేనాధిపతిగా ప్రకటించారు. కొంతకాలానికి తారకాసురుడు నాశనమయ్యే సమయం వచ్చింది. వారిద్దరి మధ్యా జరిగిన యుద్ధంలో తారకాసురుడు మరణించాడు. గణేశుడు గణాలన్నిటికీ రాజైతే కార్తికేయుడు సర్వసైన్యాధ్యక్షుడు. మన శరీరంలో కుడివైపున ఉండే పింగళా నాడిని ప్రభావితం చేసే శక్తికి ప్రతీకగా ఉంటాడు. ఆ శక్తి మన ప్రాణశక్తితో అనుసంధానమై ఉంటుంది. కార్తికేయుడి అనుగ్రహం పొందడం వల్ల... పసిపిల్లల్లో ఉండే అమాయకత్వంతో కూడిన తేజస్సు, చక్కటి క్రియాశీలత, చెడుని అంతమొందించే అంతర్గత దైవశక్తి లభిస్తాయి. భగవంతుడి పట్ల వినయ విధేయతలు, నాయకత్వ లక్షణాలు, అందరికీ మార్గదర్శకత్వం చేయగల శక్తి, దైవికమైన జ్ఞానం, వివేకం కలుగుతాయి. మన సూక్ష్మ శరీరంలో కార్తికేయుడి స్థానం కుడివైపు మూలాధార చక్రంలో ఉంటుంది. మన లోపల ఉన్న కుండలినీ శక్తి ఆ చక్రాన్ని దాటి పైకి రావాలంటే... మనలో కార్తికేయుడి గుణగణాలు ఉండాలి. ఆ గుణగణాలు ఏమిటో, కార్తికేయుడి ఆశీస్సులు ఎలా పొందాలో శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో వివరించారు. కార్తికేయుడి నివాసం మన సూక్ష్మ శరీరంలోని కుడివైపున మూలాధార చక్రమే అయినా... పింగళి నాడి మొత్తం మీద ఆయన ప్రభావం ఉంటుంది. అందుకే ఆయనకు 'సుపింగళా' అనే పేరు ఏర్పడింది. మూలాధార చక్రం శుభ్రమైనప్పుడు.... పింగళానాడి మొత్తం శుభ్రమవుతుంది. మనలోని మూలధార చక్రం, ఆజ్ఞా చక్రం ఒకదానితో ఒకటి పరిపూర్ణమైన సంబంధం కలిగి ఉంటాయి. కాబట్టి మూలాధార చక్రం కుడిభాగం శుభ్రమైతే ఆజ్ఞాచక్రం కుడిభాగం కూడా శుభ్రపడుతుంది. మనలో అహంకారాన్ని నియంత్రించుకొనే శక్తిని మెరుగుపరుస్తుంది. మనలోని రాక్షస గుణాలు అంతం కావాలంటే కార్తికేయుడి అనుగ్రహం కావాలి. అంటే కుడివైపున మూలధార చక్రం బలంగా ఉండాలి. ఈ చక్రం శుభ్రమయ్యేకొద్దీ మనలోని అనవసరమైన ఆలోచనలు తగ్గుతాయి. అంతర్గత ప్రశాంతత కలుగుతుంది. కార్తికేయుడి ఆశీస్సులు ఉన్న వ్యక్తి ఇతరులను శాసించగలుగుతాడు. ఇలా శాసించగలిగే శక్తి పురుషులకు వారి మాటల ద్వారా, చురుకుదనం ద్వారా, వ్యక్తిగత విజయాలద్వారా లభిస్తే... మహిళలకు సహనం, హుందాతనం, క్షమాగుణం, కరుణ, అందరినీ ఆదరించే గుణం ద్వారా లభిస్తుంది. సాధారణంగా కొన్ని దేవాలయాలలో రెండు సర్పాలు ఒకదానితో ఒకటి మెలికలు తిరుగుతూ ఉన్న శిల్పం మనకు కనిపిస్తుంది. ఆ శిల్పంలోని రెండు సర్పాలు మన సూక్ష్మ శరీరంలో ఇడా, పింగళా నాడులు ఒకదానితో ఒకటి మెలికలు తిరిగి... ఆరు శక్తి కేంద్రాలను లేదా షట్చక్రాలను ఎలా ఏర్పరుస్తాయో సూచిస్తాయి. వీటినే 'చంద్రనాడి, సూర్యనాడి' అని కూడా పిలుస్తారు. మన వెన్నెముక అడుగు భాగాన త్రికోణాకార ఎముకలో ఉండే కుండలినీ శక్తి... ఈ రెండు నాడుల మధ్య ఉండే సుషమ్నా నాడి ద్వారా పైకి వచ్చి, మన మాడు పైభాగంలో ఉండే బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, మన చుట్టూ ఉన్న, సర్వవ్యాపితమైన భగవంతుడి పరమ చైతన్య శక్తితో ఐక్యం అవుతుంది. అప్పుడే సాధకుడికి యోగప్రాప్తి కలుగుతుంది. ప్రతి నిత్యం సహజయోగ సాధన ద్వారా దీన్ని సాధించగలమనీ, కార్తికేయుడి గుణాలను, శక్తులను మనలో స్థిరపరుచుకోగలమనీ శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో స్పష్టం చేశారు.

నవతార

## మెరిసే చర్మానికి మునగాకు



అందానికి, ఆరోగ్యానికి మునగాకు ఎంతగానో తోడ్పడుతుంది. దీనిలో ఎ, సి, ఇ విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజ లవణాలు, మరెన్నో పోషకాలు ఉన్నాయి. చలికాలంలో చర్మాన్ని మెరిపించడంలో మునగాకు ఎలా సహకరిస్తుందో తెలుసుకుందాం.
మునగాకును ఆహారంలో చేర్చుకోవడం వల్ల అందులోని పోషకాలు చర్మం మీద పేరుకునే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. వృద్ధాలన్నీ తొలగి చర్మం కాంతిమంతం అవుతుంది.ఒక గిన్నెలో గుప్పెడు మునగాకులను వేసి ఒక గ్లాసు నీళ్లు పోసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీటిని వడబోయాలి. దీనితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మంచి టోనర్‌లా పనిచేసి చర్మం మృదువుగా మారుతుంది.మునగాకును తరచూ తినడం వల్ల చర్మానికి రక్త ప్రసరణ పెరిగి, తేమ అందుతుంది. చర్మం మీద నిలిచి ఉండే కొవ్వులను కరిగించి మొటిమలు రాకుండా చేస్తుంది. ముఖం మీద ముడతలు, గీతలు ఏర్పడకుండా నివారిస్తుంది. అకాల వార్ధక్య లక్షణాలు రానీయకుండా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.మునగాకులను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. బాగా ఆరాక మెత్తని పొడిలా చేయాలి. దీనితో ముఖాన్ని మెల్లగా రుద్దితే బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ తొలగిపోతాయి.గుప్పెడు మునగాకులను తీసుకుని నీళ్లు చల్లుతూ మెత్తగా నూరాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అర్ధగంట ఆరనివ్వాలి. తరవాత మంచినీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మ రంధ్రా?ల్లోని మురికి తొలగిపోతుంది. మొటిమలు, బ్లాక్ హెడ్స్ రావు. చర్మానికి మంచి ఛాయ వస్తుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
గురువారం
12 । డిసెంబర్ । 2024



# చలికాలం చెక్కుచెదరని ఆరోగ్యం



చలికాలం అంతర్గత, బాహ్య ఆరోగ్యాలను చెక్కుచెదరకుండా ఉంచుకోవడం కోసం ఆయుర్వేద ఆరోగ్య సూత్రాలను ఆచరించవచ్చు. బలాన్ని పెంచుకునే వీలున్న ఈ కాలాన్ని వీలైనంత మెరుగ్గా ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆయుర్వేద నిపుణులు ఇలా వివరిస్తున్నారు.

**ఆవు నెయ్యి శ్రేష్ఠం**

ఈ కాలంలో చర్మం పొడిబారకుండా మృదువుగా ఉండడం కోసం, శరీరం పొడిబారిపోకుండా ఉండడం కోసం రోజుకు రెండు చెంచాల చొప్పున కల్తీ లేని ఆవు నెయ్యి తీసుకోవచ్చు. ఈ కాలంలో శరీరాన్ని తేమగా ఉంచుకోకపోతే, ఆ ప్రభావం మోకాళ్ల నొప్పులు, వెన్ను నొప్పులు, ఒంటి నొప్పులు, నాడీ సంబంధ రుగ్మతల రూపంలో వేసవిలో శరీరాన్ని బాధిస్తుంది. ఆవు నెయ్యితో కొలెస్ట్రాల్ పెరుగుతుందని భయపడుతూ ఉంటారు. కానీ సమర్థంగా అరిగించుకోగలిగితే ఆవు నెయ్యితో శరీరానికెంతో మేలు కలుగుతుంది. అందుకోసం వ్యాయామంతో శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి.

ఏడాదిని ఉత్తరాయనం, దక్షిణాయనం అనే రెండు భాగాలుగా విభజించుకుంటే ఉత్తరాయనంలో వేడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి శరీరం బలహీనపడుతుంది. శరీరంలోన సత్తువ బయటకు వెళ్లిపోతుంది కాబట్టి ఆ కాలాన్ని ఆదాన కాలం అంటారు. దక్షిణాయనంలో చల్లని వాతావరణం వల్ల శరీరం శక్తిని స్వీకరించి, బలపడుతుంది కాబట్టి ఈ కాలాన్ని విసర్గ కాలం అంటారు. కాబట్టి ఏడాదిలోని మొదటి ఆరునెలల్లో కోల్పోయిన సత్తువను తిరిగి పొందే వీలున్న కాలంగా దక్షిణాయనాన్ని, మరీ ముఖ్యంగా చలికాలాన్నీ పరిగణించాలి. ఇది సత్తువను పెంచే కాలమే అయినప్పటికీ, చల్లదనం మూలంగా విజృంభించే వ్యాధులకు దూరంగా ఉండాలంటే ఈ కాలానికి తగిన, తగని ఆహార పదార్థాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి. అలాగే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం కోసం ఈ కాలాన్ని పరిపూర్ణంగా సద్వినియోగం ? చేసుకోవాలి.

**శక్తిని పుంజుకునే కాలం**

ఈ కాలంలో జఠరంలో అగ్ని ప్రబలంగా ఉండడం మూలంగా తిన్న ఆహారం తేలికగా అరుగుతుంది. కాబట్టి మిగతా కాలాలకు సరిపడా శక్తి నిల్వలను పెంచుకోవడం కోసం చలికాలాన్నీ, ఈ కాలంలో దొరికే పదార్థాలను మెరుగ్గా ఉపయోగించుకోవాలి. ఈ కాలంలో పండే పంటలన్నీ శరీరానికి శక్తినిచ్చేవే! కాలం కాని కాలంలో కృత్రిమంగా పండించే హైబ్రిడ్ పండ్లు కూడా నేడు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది. మాంసకృత్తులు, కొవ్వులు ఎక్కువగా ఉండే పదార్థాలను నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అలాగే పెరుగు మినహా మిగతా పాల ఉత్పత్తులన్నీ తినొచ్చు. ఈ కాలంలో దొరికే ఉసిరి, యాపిల్, పైనాపిల్, నారింజ, ద్రాక్ష మొదలైన సిట్రస్ పండ్లతో పాటు గాజర్ తింటూ ఉండాలి. ఈ కాలంలో గోధుమలు, బియ్యం తినొచ్చు. తృణధాన్యాల్లో రాగులు, ఉలవలు, సజ్జలు, బార్లీలు శరీరం పొడిబారుతుంది. కాబట్టి వీటి పరిమాణం తగ్గించాలి. కూరగాయల్లో చిక్కుడు తగ్గించాలి. ఈ కాలంలో పాలకూర, క్యాబేజీ, మినుములు, అలసందలు, పెసల పరిమాణం పెంచాలి. ఈ కాలంలో సముద్రాహారం, చికెన్, మటన్ నిరభ్యంతరంగా తినొచ్చు. ఈ కాలంలో ర్యాడిష్ మినహా మిగతా దుంపలన్నీ తినొచ్చు. డ్రైఫ్రూట్స్‌లోని మంచి కొవ్వులను శరీరం శోషించుకోవడం కోసం వాటిని బాగా నమిలి తినాలి. అలాగే చల్ల నీళ్లకు బదులుగా గోరువెచ్చని నీళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ కాలంలో దాహం తగ్గుతుంది కాబట్టి నీళ్ల పరిమాణం తగ్గించకూడదు. ఇలా చేస్తే మొలల సమస్య పెరుగుతుంది. కాబట్టి వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి.

# ఆ మందులు మనకు ప్రమాదకరం



మనందరికీ ఇల్లే పదిలమైన ప్రదేశం. కానీ మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యాల వల్ల సురక్షితమైన ఇల్లే ప్రమాదకరమైన ప్రదేశంగా మారిపోతుంది. మరీ ముఖ్యంగా క్రిమికీటకాలు, ఎలుక మందులు, ఇంటిని శుభ్రపరిచే ఉత్పత్తులు లాంటివి పొరపాటున పొట్టలోకి చేరుకుంటే, ఆరోగ్యపరంగా తిరిగి సరిదిద్దలేని నష్టం జరగవచ్చు. కాబట్టి వీటితో తలెత్తే ప్రమాదాలు, ప్రత్యామ్నాయ పద్ధతుల గురించి తెలుసుకుందాం!

చిట్టెలుకలు, ఎలుకలు, పందికొక్కులు లాంటివి గ్రామాలకే పరిమితం కాదు. నగరాల్లో కూడా అవి స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాయి. వాటితో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది కాబట్టి ఎన్నో రకాల ఎలుక మందులు తయారవుతున్నాయి. పొడి, పేస్ట్, పెల్లెట్స్, సిరీల్ బెయిట్స్ లేదా బ్లాక్స్ రూపంలో ఇవి మార్కెట్లో దొరుకుతూ ఉంటాయి. వీటిని ఇళ్లలో ఉపయోగించినప్పుడు, పొరపాటున లేదా ప్రమాదవశాత్తూ తినేయడం జరుగుతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా పిల్లలున్న ఇళ్లలో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువ. కొన్ని సందర్భాల్లో వీటి నుంచి వెలువడే విషపూరిత వాయువులు పీల్చుకోవడం వల్ల కూడా ప్రమాదాలు తలెత్తవచ్చు. ఎరువులు, బాణాసంచా, మందుగుళ్లు, ఎలుక మందుల తయారీల్లో పసుపు లేదా తెల్లగా ఉండే ఫాస్ఫరస్‌ను ఉపయోగిస్తూ ఉంటారు. వెల్లుల్లి వాసన వెదజల్లుతూ ఉండే ఈ పదార్థం అన్ని చోట్లా దొరుకుతూ ఉంటుంది.

**ఫాస్ఫరస్ ప్రమాదం**

ఎలుక మందుల తయారీలో ఉపయోగించే ఈ విషపూరిత పదార్థం పొట్టలోకి చేరుకున్న వెంటనే వేగంగా శోషణ చెంది, కాలేయం, మూత్రపిండాలు, జీర్ణకోశం, హృదయనాళ వ్యవస్థ పనితీరును దెబ్బతీస్తుంది. కేవలం 8 గ్రాముల ఎలుక మందు, ప్రాణాంతక పరిస్థితికి దారి తీసేటంత ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఈ విషం బారిన పడిన 24 గంటల్లోగా వాంతులు, తలతిరుగుడు, డయేరియా, పొట్టలో నొప్పి మొదలైన లక్షణాలు తలెత్తుతాయి. రెండవ దశలో ఒకటి నుంచి నాలుగు రోజుల పాటు ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. మూడవ దశలో, బహుళ అవయవాలు విఫలమవుతూ పరిస్థితి ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. ఈ దశలో మానసిక స్థితి కూడా దెబ్బతింటుంది. అయోమయం, సైకోసిస్, చిత్రభ్రమలు మొదలై, కోమాలోకి జారిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే ఈ ఎల్లో ఫాస్ఫరస్ విషానికి ఎలాంటి విరుగుడూ లేకపోయినప్పటికీ, డీకంటామినేషన్, సపోర్టివ్ థెరపీలతో చికిత్స చేయవచ్చు. దాన్లో భాగంగా విషం మరింతగా శోషణ చెందకుండా ఉండడం కోసం పొట్టలోని విషాలను బయటకు రప్పించే గ్యాస్ట్రిక్ లావేజ్ పద్ధతిని అనుసరిస్తారు. అందుకోసం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా సెలైన్‌ను పొట్టలోకి పంపిస్తారు. ఈ చికిత్సతో కోలుకున్న తర్వాత, రోగిని ఐసియులో ఉంచి, ప్రతిరోజూ కాలేయం, మూత్రపిండాల పనితీరులను పర్యవేక్షించవలసి ఉంటుంది.

**పారాసిటమాల్‌తో...**

ఈ మాత్రలను ఎక్కువ పరిమాణాల్లో తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా విషపూరితం అయ్యే ప్రమాదం ఉంటుంది. పెద్దలకు 7.5 నుంచి 10 గ్రాములు, ఒకటి నుంచి ఆరేళ్లలోపు పిల్లలైతే ఒక కిలో శరీర బరువుకు 150 మి.గ్రా నుంచి 200 మి.గ్రా పారాసిటమాల్ ప్రమాదకరం. ఈ మోతాదుల్లో పారాసిటమాల్ తీసుకున్న 24 గంటల్లోగా ఆకలి తగ్గిపోవడం, వాంతులు, తల తిరుగుడు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. 48 గంటల్లోగా పొట్టలో నొప్పి, ఆకలి లేకపోవడం, వాంతులు, 48 నుంచి 96 గంటల్లోగా కామెర్లు, హైపోగ్లైసీమియా, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి. ఇలాంటి సందర్భాల్లో కూడా పొట్టలోని మాత్రలను బయటకు రప్పించే చికిత్సనే వైద్యులు అనుసరిస్తారు.

**నెయిల్ పాలిష్, హార్పిక్‌లతో...**

వీటిలోని విషపూరిత రసాయనాలైన టోలీన్, ఫార్మాల్డిహైడ్, డైబ్యుటైల్ ఫ్థాలేట్‌లు, పారాసిటమాల్ పాయిజనింగ్ మాదిరిగానే కాలేయం, మూత్రపిండాలను దెబ్బ తీస్తాయి. పిల్లలు ప్రమాదవశాత్తూ బాత్రూమ్ శుభ్రం చేసే హార్పిక్ తాగేస్తూ ఉంటారు. హార్పిక్ పొట్టలోకి చేరుకుంటే జీర్ణ వ్యవస్థ దెబ్బతిని, వాంతులు, డయేరియా వేధిస్తాయి. కాలేయం ఇసి?మిక్ షాక్‌కు గురవుతుంది. వీటితో పాటు, బాత్రూమ్ శుభ్రం చేసే యాసిడ్లు, ఫినాయిల్, పొడి, చాక్‌పీస్ రూపంలో ఉండే చీమల మందులు కూడా ప్రమాదకరమే!



# రోజూ వైన్ తాగితే బరువు తగ్గుతారా ?



నిత్యం పరిమిత మోతాదులో వైన్ తాగితే గుండె జబ్బులు రాకుండా ఉంటాయని, బరువు తగ్గవచ్చని చెబుతుంటారు. వైన్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని, అవి కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయని, కనుక రోజూ తగిన మోతాదులో వైన్ తాగితే ఆరోగ్యకర లాభాలు ఉంటాయని కూడా వైద్యులు చెబుతుంటారు. అలాగే వైన్ తాగడం వల్ల బరువు తగ్గవచ్చని కూడా వారు అంటుంటారు. అయితే అసలు ఇందులో నిజమెంత ? అంటే.. ఈ విషయాన్ని తేల్చడానికే హార్వర్డ్ యూనివర్సిటీ సైంటిస్టులు పరిశోధనలు చేశారు. వారు మధ్య వయస్సు ఉన్న 19,220 మంది మహిళలను 12.9 సంవత్సరాల పాటు పరిశీలించారు. వారిలో కొందరు రెడ్ వైన్ తాగేవారు ఉండగా, కొందరు వైట్ వైన్ తాగేవారు, కొందరు ఆల్కహాల్ తీసుకోని వారు ఉన్నారు. ఈ క్రమంలో చివరికి తేలిందేమిటంటే... రెడ్ వైన్ తాగిన వారు బరువు పెరగ్గా, వైట్ వైన్ తాగిన వారు బరువు తగ్గినట్లు గుర్తించారు. ఇక ఆల్కహాల్ తీసుకోని వారు బరువు పెరిగే అవకాశం 43 శాతం వరకు ఉంటుందని తేల్చగా, వైన్ తాగిన వారు బరువు పెరిగే అవకాశం 33 శాతం వరకు ఉంటుందని నిర్ధారించారు. అందువల్ల నిత్యం తగిన మోతాదులో వైట్ వైన్ తాగితే బరువు తగ్గవచ్చని, రెడ్ వైన్ తాగితే బరువు పెరుగుతారని సైంటిస్టులు చెబుతున్నారు.

## చేప కుర్మా



**కావల్సినవి:** బొచ్చె చేప ముక్కలు - ఐదు, అల్లం వెల్లుల్లి ముద్ద- రెండు చెంచాలు, ఉల్లిపాయ, టమాటా ముక్కలు - పావుకప్పు చొప్పున, పచ్చిమిర్చి - ఐదు, కరివేపాకు రెబ్బలు - కొన్ని, పసుపు - చెంచా, ఉప్పు - రుచికి తగినంత, ధనియాలపొడి, జీలకర్రపొడి - చెంచా చొప్పున, మెంతి పొడి - అరచెంచా, కారం - నాలుగు చెంచాలు, గరంమసాలా పొడి - చెంచా, చింతపండు - నిమ్మకాయంత, కొత్తిమీర తరుగు - కొద్దిగా, నూనె - పావుకప్పు.

**తయారీ:**

చేపముక్కలకు ఉప్పు, పసుపు, కారం, అరచెంచా వెల్లుల్లి ముద్ద పట్టించి అరగంట నాననివ్వాలి. ఇప్పుడు బాణలిలో కొద్దిగా నూనె వేడిచేసి చేపముక్కల్ని వేయించాలి. మరో బాణలిలో మిగిలిన నూనె వేడి చేసి ఉల్లిపాయముక్కలు వేయించి మిగిలిన అల్లంవెల్లుల్లి ముద్ద, మరికాస్త ఉప్పు, కారం, ధనియాలపొడి, జీలకర్ర చేర్చాలి. ఆ తరవాత సన్నగా తరిగిన టమాటాముక్కలు వేసి మెత్తగా అయ్యేదాకా వేయించాలి. ఆ తరవాత రెండు కప్పుల నీళ్లు పోసి అవి మరుగుతుండగా కరివేపాకు, గాటుపెట్టిన పచ్చిమిర్చి వేయాలి. అందులో చింతపండు రసం వేయాలి. ఈ గ్రేవీ మరుగుతున్నప్పుడు వేయించిపెట్టుకున్న చేపముక్కల్ని వేసి కొద్దిగా మెంతిపొడి చల్లాలి. ముక్కలు ఉడికి దగ్గరయ్యాక మసాలాపొడి, కొత్తిమీర చల్లి దింపేస్తే సరిపోతుంది. వేడివేడి చేపల కుర్మా సిద్ధం.

## చికెన్ రైస్



**కావల్సినవి:** అన్నం - ఒకటిన్నర కప్పు, ఉడికించిన చికెన్ - ముప్పావుకప్పు, ఉల్లిపాయ - ఒకటి, వెల్లుల్లి - రెండు రెబ్బలు (దంచుకోవాలి), పొడుగ్గా తరిగిన క్యారెట్ - అరకప్పు, ఉడికించిన పచ్చిబఠాణీ - పావుకప్పు (అవి లేకపోతే ఎండుబఠాణీని నానబెట్టి ఉడికించుకోవాలి), వెన్న - టేబుల్‌స్పూను, కొత్తిమీర తరుగు - రెండు టేబుల్‌స్పూన్లు, నూనె - టేబుల్‌స్పూను, ఉప్పు - తగినంత, మిరియాలపొడి - చెంచా.

తయారీ: బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలూ, దంచిన వెల్లుల్లి వేయాలి. ఉల్లిపాయ ముక్కలు కాస్త వేగాయనుకున్నాక క్యారెట్ తరుగూ, ఉడికించిన పచ్చిబఠాణీ వేసి వేయించాలి. క్యారెట్ పచ్చివాసన పోయాక చికెన్ ముక్కలూ తగినంత ఉప్పూ, మిరియాలపొడి వేసి బాగా కలపాలి. ఇది కూరలా తయారయ్యాక అన్నం, వెన్నా, కొత్తిమీర తరుగూ వేసి బాగా కలిపి ఐదు నిమిషాలయ్యాక దింపేయాలి.

# స్కర్ట్‌కు తగ్గ టాప్



ఇప్పుడు స్కర్ట్‌ల హవా నడుస్తోంది. లాంగ్, నీ లెంగ్త్, షార్ట్... ఇలా స్కర్ట్స్‌లో చెప్పలేనన్ని రకాలొచ్చేశాయి. అయితే ఆ దుస్తుల్లో మరింత అందంగా కనిపించాలంటే నప్పే టాప్‌తో జత చేయాలి! ఏ స్కర్ట్‌కు ఎలాంటి టాప్ మ్యాచ్ అవుతుందంటే... ప్రింటెడ్ నీ లెంగ్త్: ముదురు రంగు ప్రింట్లు, గ్రాఫిక్ డిజైన్లు మోకాలి కిందవరకూ ఉండే స్కర్ట్‌లు ఎంచుకుంటే వాటికి తెల్లని టాప్ చక్కగా సూటవుతుంది. అయితే టాప్ స్లీవ్స్ పొడవుగా, ఉండి, మెడ దగ్గర స్లిట్ ఉండేలా చూసుకోవాలి. స్టయిల్‌గా కనిపించాలనుకుంటే స్లీవ్స్ చివర్లో ఫ్రిల్స్ ఉండాలి. లాంగ్ స్కర్ట్: పొడవాటి స్కర్ట్‌కు వీలైనంత చిన్న టాప్ ఎంచుకోవాలి. ఒకే రంగు స్కర్ట్‌కు గ్రాఫిక్ టీ షర్ట్ చక్కగా మ్యాచ్ అవుతుంది. షిఫాన్ స్కర్ట్ వేసుకుంటే వి నెక్, క్రాప్ టాప్స్ బాగుంటాయి. మెటాలిక్ లేదా సీక్వెన్స్ స్కర్ట్: ఇలాంటి స్కర్ట్‌లు పార్టీల్లో బాగుంటాయి. వీటిని బ్లాక్ క్రాప్ టాప్‌తో మ్యాచ్ చేయాలి. స్కర్ట్ మెరుస్తూ ఉంటుంది కాబట్టి టాప్‌కు మెరుపులు జత చేయకూడదు. పూర్తి ప్లెయిన్ టాప్ అయితేనే ఎలిగెంట్‌గా ఉంటుంది.

# కీటో డైట్ పాటిస్తున్నారా..? ఈ ఆహారాలను తినండి..!



నేటి తరుణంలో బరువు తగ్గాలనుకునే చాలా మంది కీటో డైట్ పాటిస్తున్నారు. అంతేకాదు, డయాబెటిస్, థైరాయిడ్, పీసీవోడీ సమస్యలు తదితర అనేక అనారోగ్య సమస్యలకు కీటో డైట్ ఉపయోగంగా ఉంటుందని తెలియడంతో అనేక మంది ఈ డైట్‌ను ఫాలో అవుతున్నారు. అయితే కీటో డైట్‌లో కార్బొహైడ్రేట్లు ఉన్న ఆహారాలను చాలా తక్కువగా, ఫ్యాట్లు, ప్రోటీన్లు ఉన్న ఆహారాలను ఎక్కువగా తినాలి. ఈ క్రమంలోనే కింద సూచించిన ఆహారాలను కీటో డైట్‌లో భాగం చేసుకుంటే మరింత మెరుగైన ఫలితాలను పొందవచ్చు. 1. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల కీటోడైట్‌లో ఉన్న వారు చేపలను ఎక్కువగా తినాలి. నిత్యం కనీసం 85 గ్రాముల చేపలను తింటే ఫలితం ఉంటుంది. చేపల ద్వారా మనకు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు కూడా లభిస్తాయి.

2. క్యాప్సికం, పుట్టగొడుగులు, కాలిఫ్లవర్, క్యాబేజీ, బ్రొకొలి, పాలకూర వంటి కూరగాయలను కూడా కీటో డైట్‌లో ఉన్నవారు తినవచ్చు. వీటిలో మన శరీరానికి కావల్సిన పొటాషియం, మెగ్నిషియం, విటమిన్ సి, కె వంటి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి.

3. కీటో డైట్‌లో ఉన్నవారు రెగ్యులర్‌గా చికెన్ తినాలి. దీని వల్ల ప్రోటీన్లు, ఫ్యాట్లు మనకు సమృద్ధిగా లభిస్తాయి.

4. కీటోడైట్ పాటించే వారు అవకాడోలను కూడా నిరభ్యంతరంగా తినవచ్చు. వీటిల్లో కార్బొహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఫ్యాట్లు, పొటాషియం, మినరల్స్ మనకు లభిస్తాయి.

5. కోడిగుడ్లను అత్యుత్తమ కీటోజెనిక్ డైట్‌గా చెప్పవచ్చు. వీటిల్లో కార్బొహైడ్రేట్లు తక్కువగా, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మెటబాలిజాన్ని పెంచుతాయి. మెదడు యాక్టివ్‌గా ఉండేలా చూస్తాయి.

6. ఆలివ్ ఆయిల్, రాస్ప్ బెర్రీలు, స్ట్రాబెర్రీలు, బ్లాక్‌బెర్రీలు తదితర ఆహారాలను కూడా కీటోడైట్‌లో ఉన్నవారు తీసుకోవచ్చు. అయితే ప్రాసెస్ చేయబడిన మాంసాహారం, చీజ్, పెరుగు, తీపిగా ఉండే పండ్లు, డ్రై ఫ్రూట్స్, బ్రెడ్, అన్నం తదితర కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాలను మాత్రం కీటోడైట్‌లో ఉన్నవారు మానేయాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in







## ఒక్కరోజులోనే భారీగా పెరిగిన గోల్డ్ రేట్.. కొనాలంటే ఆలోచించాల్సిందే

**న్యూఢిల్లీ-నవభూమి:** మన దేశంలో ఆభరణాలు అంటే బంగారమే. దాన్ని మించింది మరొకటి లేదనే చెప్పాలి. గోల్డ్‌ను స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. ఎంత పసిడి ఉంటే అంత ధనవంతులుగా చూస్తుంటారు. అందుకే కాస్త డబ్బు ఉన్నా అందరూ బంగారం కొనేందుకు ఇష్టపడతారు. పసిడిని ఆభరణంగానే గాక మంచి ఇన్వెస్ట్‌మెంట్‌గానూ చెప్పొచ్చు. అవసరమైతే తనఖా పెట్టడానికి దీన్ని మించింది లేదు. అందుకే ధనవంతులే కాదు.. మధ్యతరగతి ప్రజలు కూడా బంగారం కొని దాచుకునేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే ఇప్పుడు గోల్డ్ కొనాలంటే ఆలోచించక తప్పదు.
తులం ఎంతంటే..నిన్నమొన్నటి వరకు బంగారాన్ని కొనేందుకు అందరూ ఎగబడ్డారు. గోల్డ్ రేట్స్ పడిపోతుండటంతో డిమాండ్ మరింత పెరిగింది. అయితే ఒక్క రోజులోనే పసిడి ధరలు అమాంతం పెరిగాయి. డిసెంబర్ 11, బుధవారం నాడు బంగారం ధరలు పెరిగాయి. మంగళవారంతో పోలిస్తే గోల్డ్ రేట్ ఏకంగా రూ.1,000 పెరిగింది. తులం పసిడి ధర ఇంకోసారి 80 వేల మార్క్‌ను టచ్ చేసింది. ఇవాళ 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేట్ రూ.80,060 పలుకుతోంది. అదే 22 క్యారెట్ల 10



గ్రాముల బంగారమైతే రూ.79,470గా ఉంది. ఒక్క రోజులోనే పసిడి ధరల్లో ఇంత మార్పు రావడానికి అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితులు ప్రధాన కారణమని చెబుతున్నారు.

## ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ మల్హోత్రా



**న్యూఢిల్లీ-నవభూమి:** రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన గవర్నర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి, రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. ఆర్బీఐ 26వ గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ గవర్నర్‌గా సేవలందించిన శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారం (డిసెంబర్ 10)తో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన స్థానంలోకి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తున్న సంజయ్ మల్హోత్రాను మోదీ సర్కారు తీసుకొచ్చింది. నిన్న దాస్ పదవీ విమరణ చేయడంతో.. ఆర్బీఐ తదుపరి గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. నేటి నుంచి మూడేండ్లపాటు ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు.

## క్విక్ కామర్స్‌లోకి అమెజాన్ 15 నిమిషాల్లో డెలివరీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరో వినూత్న సేవలకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా క్విక్ కామర్స్ సేవలకు పెరుగుతుతున్న డిమాండ్ నేపథ్యంలో ఈ సేవలు అందించడానికి సిద్ధమైంది సంస్థ. పైలెట్ ప్రాజెక్టు కింద ఈ క్విక్ సేవలను ఈ నెల చివర్లో బెంగళూరులో ప్రారంభించనున్నట్లు అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ ప్రకటించారు. కేవలం బుకింగ్ చేసుకున్న 15 నిమిషాల్లో డెలివరీ చేసేవిధంగా ఈ సేవలు ఉంటాయని, బెంగళూరులో విజయవంతమైతే ఈ సేవలను ఇతర నగరాలకు విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం క్విక్ కామర్స్ మార్కెట్ విలువ 6.1 బిలియన్ డాలర్లు ఉండగా, 2030 నాటికి ఇది 40 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఇటీవల ఒక సర్వే వెల్లడించింది. దీంతో ఈ విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు, ఇందుకోసం దేశవ్యాప్తంగా ప్రతి పోస్టల్ నంబర్‌లో 2 వేలకు పైగా ఉత్పత్తులను సిద్ధం చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే బ్లింకిట్, జెప్టోలు ఈ తరహా సేవలు అందిస్తున్నాయి.

**గేమ్‌చేంజర్‌గా ఏఐ**

కృత్రిమ మేధస్సుతో దేశీయ రూపురేఖలు పూర్తిగా మారే అవకాశం ఉన్నదని సమీర్ కుమార్ వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, రిటైల్ రంగాలు తదుపరి దశకు చేరుకోనున్నాయన్నారు. ఏఐ స్టార్టప్‌లో 120 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టేందుకు సంస్థ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. మరోవైపు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా హాజరైన కేంద్ర వినియోగదారుల వ్యహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ..ఈ-కామర్స్ సంస్థలు పారదర్శకంగా, వినియోగదారులు కోరుకుంటున్న విధంగా వ్యవహరించాలని సూచించారు.

**మొదటి స్థానానికి భారత్: గడ్కరీ**

వచ్చే ఐదేండ్లలో ప్రపంచ ఆటోమొబైల్ రంగంలో దేశీయ ఆటోమొబైల్ రంగం మొదటి స్థానానికి చేరుకుంటున్నదన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు కేంద్ర రోడ్, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ. గడిచిన రెండేండ్లలో లాజిస్టిక్స్ ఖర్చులను 9 శాతం వరకు తగ్గించగలిగామన్నారు. రూ.7 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న దేశీయ ఆటోమొబైల్ రంగం ప్రస్తుతం రూ.22 లక్షల కోట్లకు చేరుకున్నదన్నారు. రూ.78 లక్షల కోట్లతో అమెరికా తొలిస్థానంలో నిలువగా, రూ.47 లక్షల కోట్లతో చైనా ఆ తర్వాతి స్థానంలో ఉన్నది.
2030 నాటికి 80 బిలియన్ డాలర్ల ఎగుమతి లక్ష్యంగా పెట్టుకున్నది అమెజాన్.
వచ్చే ఏడాది చివరినాటికి 10 లక్షల ఎంఎస్ఎంఈలను డిజిటల్ చేయడం ద్వారా 20 లక్షల ఉద్యోగాలను సృష్టించబోతున్నది.
వికసిత్ భారత లక్ష్యాన్ని చేరుకునేందుకు అమెజాన్ చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు.

## హైదరాబాద్‌లో ఐసీఏఐ రీసర్చ్ హబ్

**న్యూఢిల్లీ-నవభూమి:** చార్టర్డ్ అకౌంటెంట్స్ అపెక్స్ బాడీ ఐసీఏఐ..హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) రీసర్చ్ హబ్‌ను ప్రారంభించింది. ఈ సీవోఈ డీన్, డైరెక్టర్‌గా నూపుర్ పవన్ బంగ్‌ను నియమించింది ఐసీఏఐ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌తోపాటు ఆర్థిక అక్షరాస్యత, పాలసీల రూపకల్పన, సులభతర వాణిజ్యంలో సీఏల పాత్రపై కులంకుశకంగా చర్చించడానికి ఈ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజీత్ కుమార్ అగర్వాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఐసీఏఐకి హైదరాబాద్‌తోపాటు జైపూర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఉండగా, వచ్చే ఏడాది జనవరిలో కోల్‌కతాలోనూ ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే వచ్చే మూడేండ్లలో మరో ఎనిమిది సీవోఈలను దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.
ఇంకా చదవల్సిన వార్తలు

**కుదేలైన ఎల్ఐసీ షేరు**

**ముంబై-నవభూమి:** దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీకి గట్టి షాక్ తగిలింది. గత కొన్ని నెలలుగా ప్రీమియం వసూళ్లు పెరుగుతూ వచ్చిన సంస్థకు గత నెలలో ఎదురుదెబ్బ తగిలింది. ప్రీమియం వసూళ్లు 27 శాతం తగ్గింది. దీంతో కంపెనీ షేరు కుప్పకూలింది. రూ.982.95 వద్ద ప్రారంభమైన కంపెనీ షేరు ఇంట్రాడేలో రూ.951కి పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 3.95 శాతం లేదా రూ.38.95 తగ్గి రూ.947.40కి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో ప్రీమియం వసూళ్లు 16 శాతం వరకు పెరిగినప్పటికీ, నవంబర్‌లో మాత్రం భారీగా తగ్గాయి. వీటిలో రిటైల్ ప్రీమియం వసూళ్లు 19 శాతం తగ్గగా, వార్షిక ప్రీమియం వసూళ్లు 12 శాతం తగ్గాయి. ప్రభుత్వ బీమా దిగ్గజానికి ప్రైవేట్ సంస్థల నుంచి పోటీ తీవ్రతరం కావడంతో ప్రీమియం వసూళ్లు క్రమంగా తగ్గుతున్నాయి. స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయి. సెన్సెక్స్ 1.59 పాయింట్లు పెరిగి 81,510 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 8.95 పాయింట్లు తగ్గి 24,610 వద్ద ముగిసింది.

## 2024లో స్వర్ణం గెలిచిన డీఐసీవీ నాణ్యత, నవ్యతలో శ్రేష్టత ప్రదర్శన





**న్యూఢిల్లీ-నవభూమి:** డైమ్లర్ ట్రక్ AG యొక్క పూర్తిగా సొంతం చేసుకున్న అనుబంధ సంస్థ, డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్ శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ 2024లో ప్రతిష్టాత్మకమైన గోల్డ్ అవార్డ్ ను గెలవడం ద్వారా పెరుగుతున్న తమ విజయాల జాబితాకు తమ మొదటి అంతర్జాతీయ గుర్తింపును చేర్చింది. ఈ అత్యంత పోటీయుతమైన కార్యక్రమంలో 14 దేశాలకు చెందిన 1,083 జట్లతో పాటు DICV నుండి రెండు జట్లు పాల్గొన్నాయి.వార్షిక సదస్సు ICQCC, అంతర్జాతీయ వేదికగా పని చేస్తుంది. దీనిలో ప్రముఖ సంస్థలు నాణ్యతా నియంత్రణలో కొత్త ఆలోచనలను ఉత్తమమైన పద్ధతులను చూపిస్తాయి. ICQCCలో గోల్డ్ అవార్డ్ కి DICV యొక్క ప్రయాణం హెవీ-డ్యూటీ ట్రక్ తయారీలో రెండు కీలకమైన సవాళ్లను పరిష్కరించడంలో సంస్థ యొక్క అంకితభావం, అభిరుచి మరియు విస్తృతమైన సమూహ కృషిని చూపిస్తోంది. ఈ సమస్యలకు మూల కారణాలను గుర్తించడానికి లోతైన విశ్లేషణ, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది సహకారంతో పని చేయడం, వినూత్నంగా సమస్యలను పరిష్కరించడం సహా టీమ్ నిర్మాణపరమైన, డేటా-ప్రోత్సాహిత విధానాన్ని టీమ్ వినియోగించింది. పరిష్కారాలు కేవలం కస్టమర్ భద్రత మరియు కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, ఉత్పత్తి నాణ్యతను కూడా మెరుగుపరచాయి.
ఈ ప్రతిష్టాత్మకమైన విజయం గురించి మాట్లాడుతూ, సత్యకమ్ ఆర్య, మేనేజింగ్ డైరెక్టర్ డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్, ఇలా అన్నారు, " క్వాలిటీ సర్కిల్ పద్ధతి ద్వారా నిరంతర మెరుగుదల దిశగా మన టీమ్స్ యొక్క నిబద్ధత మరియు అభిరుచితో నేను ఎంతో ప్రభావితమయ్యాను. ICQCC 2024 లో ప్రతిష్టాత్మకమైన గోల్డ్ అవార్డ్ ను గెలుపొందడం DICVకి గర్వ కారణం మరియు వినూత్నత, నాణ్యత మరియు కార్యకలాపాల శ్రేష్టత పైన మా దృష్టి కేంద్రీకరణకు నిరూపణగా నిలిచింది. సంవత్సరాల క్రితం, షాప్ ఫ్లోర్ సందర్శన సమయంలో, మేము కేవలం భారతదేశంలో మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఉత్తమమైన వారిగా నిరూపించవలసిందిగా నేను టీమ్ ను ప్రోత్సహించాను. వారు ఆ సవాలును స్వీకరించారు మరియు వాణిజ్య వాహన పరిశ్రమ కోసం కొత్త ప్రమాణాలను ఏర్పర్చడంలో వారి అంకితభావం మరియు తెలివితేటలను ఈ అవార్డ్ చూపిస్తోంది."
'డైమ్లర్ ఇండియా స్కూల్ ఆఫ్ క్వాలిటీ' ద్వారా ఉన్నతమైన నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడటం DICVచూపిస్తోంది, ఇది ఆధునిక నాణ్యతా నైపుణ్యాలు మరియు వృద్ధి దృక్పధం ధోరణితో ఉన్న పూర్తి సిబ్బందిని కలిగి ఉంది. కార్యక్రమం మూడు స్థాయిలలో నిర్మితమైంది: ఫౌండేషన్ స్థాయి 'ప్రాథమిక నాణ్యతా సాధనాలు - పద్ధతులు' కవర్ చేస్తుంది, రెండవ స్థాయి 'ఆరు సిగ్మా అప్రోచ్ తో ఆధునిక నాణ్యతా సాధనాలు' బోధిస్తుంది, యూనివర్శిటీ స్థాయి పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ప్రోగ్రాంస్ పైన దృష్టి కేంద్రీకరిస్తుంది. ఉద్యోగులకు తమ అర్హతలు మరియు అనుభవం ఆధారంగా ప్రోగ్రాంలోని వివిధ దశలలో వివిధ కోర్స్ లు ఉద్యోగులకు అందచేస్తారు.నిరంతర సాధన నైపుణ్యాలను మెరుగుపరచడాన్ని ప్రోత్సహించడం ద్వారా, ప్రతి ఉద్యోగి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలు మరియు పరిశ్రమ పోకడలతో తాజా సమాచారాన్ని కలిగి ఉండేలా DICV నిర్ధారిస్తుంది

## మ్యూచువల్ ఫండ్స్‌లో తగ్గిన పెట్టుబడులు..




**న్యూఢిల్లీ-నవభూమి:** గత నవంబర్‌లో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి నెలవారీ ప్రాతిపదికన 14 శాతం పతనమై.. రూ.35,943 కోట్లకు చేరుకుంది. పలు ఆర్థికపరమైన అంశాలకు తోడుగా.. వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల కారణంగా ఏర్పడిన అస్థిరత కారణంగా పెట్టుబడులు తగ్గినట్లుగా అంచనా. అయినా కూడా ఈక్విటీ ఆధారిత ఫండ్స్‌లో నికర పెట్టబడులు పెరగడం గమనార్హం. నికర పెట్టబడులు నవంబర్‌లో వరుసగా 45వ సారి పెరిగాయి. ఇది పెట్టుబడిదారుల్లో మ్యూచువల్ ఫండ్స్‌పై పెరుగుతున్న ఆకర్షణకు సూచన అని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ లో పెట్టు బడులు స్థిరంగా కొనసాగుతున్నాయి.
అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో సిప్‌లో రూ.25,320 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు నెల అక్టోబర్‌లో రూ.25,323 కోట్లుగా ఉన్నాయి. డేటా ప్రకారం.. గత నెలలో మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మొత్తం రూ.60,295 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అక్టోబర్‌లో రూ.2.4 లక్షల కోట్లతో పోలిస్తే ఈ సంఖ్య దాదాపు 75 శాతం తక్కువ. డెట్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ భారీగా తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంటున్నారు. అక్టోబర్‌లో రూ.1.57 లక్షల కోట్లతో పోలిస్తే నవంబర్‌లో కేవలం రూ.12,915 కోట్లు మాత్రమే డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. పెట్టుబడులు తగ్గినప్పటికీ, మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న నికర ఆస్తులు అక్టోబర్‌లో రూ.67.25 లక్షల కోట్ల నుంచి రూ.68.08 లక్షల కోట్లకు పెరగడం గమనార్హం.

## బ్యాంకుల రుణాల్లో మొండి బాకీలు 3.09 శాతం.. వెల్లడించిన కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్థూల మొండి బకాయిలు రూ.3.16 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. గత సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకులు మంజూరు చేసిన రుణాల్లో మొండి బకాయిల వాటా 3.09 శాతం అని మంగళవారం రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు రాత పూర్వకంగా సమాధానమిస్తూ ఈ సంగతి తెలిపారు. 2024 సెప్టెంబర్ 30 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.3,16,331 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయని పంకజ్ చౌదరి వెల్లడించారు. ప్రైవేట్ రంగ బ్యాంకుల మొండి బకాయిలు రూ.1,34,339 కోట్లు అని తెలిపారు. మొండి బకాయిల్లో ప్రభుత్వ రంగాల వాటా 3.09 శాతం కాగా, ప్రైవేట్ బ్యాంకుల్లో 1.86 శాతం అని వివరించారు.

## వృద్ధిరేటు-ద్రవ్యోల్బణం మధ్య సమతుల్యత కీలకం.. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



**న్యూఢిల్లీ-నవభూమి:** ద్రవ్యోల్బణానికి, వృద్ధిరేటుకు మధ్య సమతుల్యత పునరుద్ధరించడం అత్యంత ముఖ్యమైన అంశం అని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. సుమారు గత నాలుగేండ్లలో కూరగాయల ధరలు అత్యంత వేగంగా పెరగడంతో గత అక్టోబర్ నెల ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ట స్థాయి 6.21 శాతానికి పెరిగిందన్నారు. మంగళవారం ఆర్బీఐ గవర్నర్‌గా పదవీ విరమణ చేస్తున్న శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడారు. సైబర్ మోసగాళ్ల బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కొత్త టెక్నాలజీల వినియోగంపై దృష్టిని కేంద్రీకరించాలని చెప్పారు. అపార అనుభవం గల సంజయ్ మల్హోత్రా.. ఆర్బీఐ గవర్నర్ గా సీబీడీసీ, యూపీఐ వంటి సంస్థలను సమర్థవంతంగా నడుపగలరని ఆశాభావం వయక్తం చేశారు. ఆర్బీఐ గవర్నర్‌గా నియమితులైన సంజయ్ మల్హోత్రా గురించి ప్రస్తావించడంతోపాటు ప్రస్తుతం ఆర్బీఐ ముందు ఉన్న సవాళ్లను గుర్తు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐ బృందానికి శక్తికాంత దాస్ కృతజ్ఞతలు తెలిపారు. 'ఆర్బీఐ గవర్నర్‌గా ఈ రోజు పదవీ విరమణ చేస్తున్నా. ఇప్పటి వరకూ నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఆర్బీఐ గవర్నర్‌గా పని చేస్తూ దేశానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు. ఆయన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం మరువలేనిది. ఇక కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు.. ఆర్థికశాఖ, ఆర్బీఐ మధ్య గత ఆరేండ్లుగా అత్యుత్తమ సమన్వయం నెలకొంది' అని అన్నారు.

## బడ్జెట్‌లో ఐటీ రిలీఫ్?



**న్యూఢిల్లీ-నవభూమి:** రాబోయే బడ్జెట్‌లో మధ్యతరగతి వేతన జీవులకు ఆదాయ పన్ను (ఐటీ) ఊరట లభించే అవకాశాలున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలోనే కొత్త పన్ను విధానంలో ఐటీ రిలీఫ్ చాన్స్ ఉందన్న అంచనాలు వస్తున్నాయి. ప్రస్తుతం పాత, కొత్త పన్ను విధానాలు అమల్లో ఉన్న విషయం తెలిసిందే. అయితే గత కొన్నేండ్లుగా పాత పన్ను విధానంలో పెద్దగా మార్పులు చేయని మోదీ సర్కారు.. కొత్త పన్ను విధానాన్నే సవరిస్తున్నది. ఇందులో భాగంగానే ఈసారి జీరో ట్యాక్స్ శ్లాబును పెంచే అవకాశాలున్నట్టు చెప్తున్నారు.
ఇదీ సంగతి..ఇప్పుడు కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షలదాకా వార్షిక ఆదాయం ఉన్నవారికి ఎలాంటి పన్నులూ లేవు. రూ.3-7 లక్షల మధ్య ఉంటే 5 శాతం పడుతున్నది. అయితే దీనికీ సెక్షన్ 87ఏ కింద ట్యాక్స్ రిబేటున్నది. కానీ దీంతో సంబంధం లేకుండా రూ.4 లేదా 5 లక్షలదాకా ఎలాంటి పన్నులూ ఉండబోవన్న ప్రకటన ఆర్థిక శాఖ నుంచి రావచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడున్న రూ.3-7 లక్షల శ్లాబును ఆ మేరకు అంటే రూ.4-7 లక్షలు లేదా రూ.5-7 లక్షలకు తగ్గించవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.
బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఐటీ మార్పులు
కొత్త పన్ను విధానంలో ఆదాయ పన్ను శ్లాబుల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది బడ్జెట్‌లో కొన్ని మినహాయింపుల్ని ప్రకటించారు. వాటిలో..
ఉద్యోగులు, పెన్షనర్లకు స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంపు.ఫ్యామిలీ పెన్షనర్లకు స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి రూ.15వేల నుంచి రూ.25వేలకు పెంపు.ప్రైవేట్ రంగ ఉద్యోగులకు సంస్థలు చేసే ఎన్‌పీఎస్ విరాళాలపై డిడక్షన్ 10 శాతం నుంచి 14 శాతానికి పెంపు.

## త్వరలో రేట్లు తగ్గుతాయ్‌లే..



**న్యూఢిల్లీ-నవభూమి:** రాబోయే ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లు తగ్గేందుకు వీలుందన్న సంకేతాలిచ్చారు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్‌గా పదవీ విరమణ చేస్తున్న శక్తికాంత దాస్. సుదీర్ఘకాలం పాటు రెపోరేటు స్థిరంగానే ఉంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దాస్ పలుకులు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. ఇక తన హయాంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్బీఐ మధ్య మంచి సంబంధాలే కొనసాగాయని ఆయన తెలిపారు. ఆర్బీఐ గవర్నర్‌గా మంగళవారంతో ఆయన పదవీకాలం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గడిచిన ఆరేండ్లుగా కేంద్రం, ఆర్బీఐ నడుమ సఖ్యతతో కూడిన వాతావరణమే ఉన్నట్టు, సమన్వయంతో ముందుకెళ్లినట్టు చెప్పారు. ఈ క్రమంలోనే ఇందుకు సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ఉన్నతాధికారులు, ఆర్బీఐ సిబ్బంది, వ్యాపార-పారిశ్రామిక వర్గాలు, బ్యాంకర్లకు దాస్ కృతజ్ఞతలు తెలిపారు.
క్లిష్ట పరిస్థితులు..ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన దగ్గర్నుంచి దాస్‌కు క్లిష్ట పరిస్థితులే ఎదుం ✓య్యాయి. 1980 తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. రిటైర్మెంట్ అనంతరం 2018 డిసెంబర్‌లో మూడేండ్లకుగాను ఆర్బీఐ 25వ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఉర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతోనే మోదీ సర్కారు దాస్‌ను తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే మరో మూడేండ్లు ఆయన పదవీకాలాన్ని పొడిగించింది. ఈ సమయంలో కరోనా, జీడీపీ పతనం, ద్రవ్యోల్బణం విజృంభణ, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మిడిల్‌ఈస్ట్ ఉద్రిక్తతలు వంటి అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఏప్రిల్ నుంచి వరుసగా 11 ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లో స్థిరంగానే ఉంచారు. ఆర్థిక వ్యవస్థను, బ్యాంకింగ్ రంగాలను డిజిటలైజ్ చేయడంలోనూ దాస్ కీలకపాత్ర పోషించారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) దిశగా కూడా అడుగులు పడ్డాయి.
అత్యధిక డివిడెండ్లు
ఉర్జిత్ పటేల్ హయాంలో కేంద్రంతో ఆర్బీఐకి దెబ్బతిన్న సంబంధాలను దాస్ పునరుద్ధరించగా.. గొడవకు కారణమైన ఆర్బీఐ మిగులు నగదు నిల్వలను సైతం చాకచక్యంగా ఖజానాకు తరలించగలిగారు. అంతేగాక తన హయాంలో కేంద్రానికి అత్యధిక డివిడెండ్లనూ ముట్టజెప్పారు. గడిచిన ఆరేండ్లలో రూ.6,61,024 కోట్లను అందించారు మరి. గత ఆర్థిక సంవత్సరంలోనే రికార్డు స్థాయిలో రూ.2,11,000 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించారు. ఇక ఆర్బీఐకి కొత్తగా వస్తున్న గవర్నర్ సంజయ్ మల్హోత్రా అనుభవజ్ఞుడని, ఆయన సారథ్యంలో ఆర్బీఐ మరింత బలపడగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా దాస్ వ్యక్తం చేశారు. ఇదిలావుంటే దేశ ఆర్థిక వ్యవస్థకు ఏది మంచిదనిపిస్తే దాన్నే చేస్తామని సంజయ్ మల్హోత్రా అన్నారు. బుధవారం ఆయన ఆర్బీఐ 26వ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు.

**దాస్ ఇంకా ఏమన్నారంటే?..**

వడ్డీరేట్లపై నిర్ణయం అంత సులువేమీ కాదు. వృద్ధిరేటు పతనానికి రెపోరేటు ఒక్కటే కారణం అనుకోవద్దు.
యెస్ బ్యాంక్ సంక్షోభం ఆర్బీఐకి మరింత పర్యవేక్షణ అవసరమని గుర్తుచేసింది. అందుకే గతంతో పోల్చితే పెరిగింది.
ఆర్బీఐ వంటి ఓ పెద్ద సంస్థలో ఎప్పుడూ చేయాల్సిన పని మిగిలే ఉంటుంది. పూర్తి చేయాల్సిన పరీక్షలు ఉంటూనే ఉంటాయి.
భారతీయ ఆర్థిక వ్యవస్థ బలమైనది, స్థితిస్థాపకత కలిగినది. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల్ని గట్టిగా ఎదుర్కోగలదు.
సైబర్ సెక్యూరిటీ ముందుకెళ్లాలంటే మరింత శ్రద్ధ అవసరం. ఫిన్‌టెక్ రంగంపై రిజర్వ్ బ్యాంక్ కఠినంగా ఉందన్న భావనలు సరికావు.
అప్పుల ఊబిలో కూరుకుపోయిన సంస్థల్ని కాపాడటానికి సామాన్యుల కష్టార్జితాన్ని వాడకుండా, బాగున్న సంస్థలో బాగాలేని మరో సంస్థను విలీనం చేయకుండా చూడటం కత్తిమీద సామే.

## మోటరోలా నుంచి ఎంట్రీ లెవల్ ఫోన్ మోటో జీ35 5జీ.. ఇవీ డిటెయిల్స్..!

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ మోటరోలా తన మోటో జీ35 5జీ ఫోన్‌ను మంగళవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. యూనిసోక్ టీ760 ప్రాసెసర్, 50-మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరాలతో వచ్చింది. కార్నింగ్ గ్లాస్ 3 ప్రొటెక్షన్‌తోపాటు 6.72 అంగుళాల ఫుల్ హెచ్డీం ఎల్‌సీడీ స్క్రీన్ కలిగి ఉంటుంది. మోటో జీ55 ఫోన్ తోపాటు మోటో జీ35 5జీ ఫోన్ కూడా సెలెక్టెడ్ యూరప్ మార్కెట్లలో గత ఆగస్టు నెలలో ఆవిష్కరించింది.
మోటో జీ35 5జీ ఫోన్ 4 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.9,999 పలుకుతుంది. ఫ్లిప్ కార్ట్, మోటరోలా ఇండియా ఆన్ లైన్ స్టోర్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. గువా రెడ్, లీఫ్ గ్రీన్, మిడ్ నైట్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ హెల్లో యూఐ స్కిన్ ఓఎస్ వర్షన్‌పై పని చేస్తున్న ఫోన్ విజన్ బూస్టర్, నైట్ విజన్ మోడ్‌లో అందుబాటులో ఉంది. 50-మెగా పిక్సెల్ క్వాడ్ పిక్సెల్ ప్రైమరీ రేర్ సెన్సర్ కెమెరా, 8-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ అల్ట్రా వైడ్ యాంగిల్ లెన్స్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి.డోల్బీ అట్మోస్ బ్యాక్డ్ స్టీరియో స్పీకర్స్ తో వస్తున్న మోటో జీ35 5జీ ఫోన్ సెక్యూరిటీ కోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింటర్ సెన్సర్ ఉంటుంది. దీంతోపాటు ప్రాగ్జిమిటీ సెన్సర్, యాక్సెలరోమీటర్, అంబియెంట్ లైట్, గైరోస్కోప్, ఎస్ఏఆర్ సెన్సర్, ఈ- కంపాస్ సెన్సర్ తదితరాలు ఉంటాయి. 20 వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ వస్తుంది. 5జీ, డ్యుయల్ బాండ్ వై-ఫై, బ్లూటూత్ 5.0, జీపీఎస్, ఏ-జీపీఎస్, గ్లోనాస్, గెలిలియో, క్యూజడ్ఎస్ఎస్ 3.5 ఎంఎం ఆడియో జాక్, యూఎస్బీ టైప్-సీ కనెక్టివిటీ కలిగి ఉంటుంది.



# వారానికి 4 రోజులే పని!



**టోక్యో-నవభూమి:** దేశంలో జననాల రేటును పెంచేందుకు జపాన్ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతున్నది. వారానికి నాలుగు రోజుల పని దినాలను అమలు చేయాలని నిర్ణయించింది. దీని వల్ల క్షీణిస్తున్న సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కోవచ్చని ప్రభు త్వం భావిస్తున్నది.జపాన్‌ను ప్రస్తు తం వృద్ధ జనాభా సంఖ్య ఆందోళనకు గురిచేస్తున్నది. దేశ జనాభా మొత్తంగా తగ్గుతున్నప్పటికీ 65 ఏండ్లు పైబడిన వృద్ధులు దేశంలో 29.3%మంది ఉండడం ప్రభుత్వాన్ని ఆందోళనపరుస్తున్నది. కొత్త విధానం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు వారానికి 3 రోజులు కుటుంబంతో గడపవచ్చు. టోక్యో మహిళా గవర్నర్ యురికో కొయికే ఈ ఆలోచనను అమలు చేయనున్నారు.

## సోషల్ మీడియా వేధింపులపై రాష్ట్రాలు చర్యలు తీసుకోవచ్చు.. కేంద్రం క్లారిటీ..



**న్యూఢిల్లీ-నవభూమి:**సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధించే, అప్రతిష్ట పాలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్రం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరులను దూషించటం సహా సైబర్ నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్రం పార్లమెంట్‌లో వెల్లడించింది. ఈ క్రమంలో భారతీయ న్యాయ సంహిత 2023 చట్టం సెక్షన్ 78 ప్రకారం మహిళలను వేధించే వారిపై అప్రతిష్టపాలు చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవచ్చు. ఇలాంటి కేసుల విషయంలో సంబంధిత చట్టంలోని సెక్షన్ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలకు ఉపక్రమించవచ్చు.మహిళలు, పిల్లలపై సైబర్ నేరాలు అరికట్టేందుకు కేంద్ర హోంశాఖ కూడా ప్రస్తుతం సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ చిల్డ్రన్ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యక్తుల డేటా, వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను కాపాడేందుకు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్టివ్ 2023 కూడా అమలులో ఉంది. టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా పార్లమెంట్లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో రెచ్చిపోయిన మావోయిస్టులు



**రాయ్‌పూర్-నవభూమి:** ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులు మరో సారి రెచ్చిపోయారు. బీజాపూర్ జిల్లాలో అమర్చిన మందుపాతరను పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు డీఆర్‌జీ జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన సైనికులను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి పోలీస్ ఉన్నతాధికారులు తరలించారు. బుధవారం ఉదయం గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముంగా గ్రామ సమీపంలో మావోయిస్టులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. గాయపడిన జవాన్లు.. మంగ్లు కుడియం, యోగేశ్వర్ షోరిగా గుర్తించారు.దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం పటిష్టమైన చర్యలు చేపట్టింది. అందుకు 2026, మార్చి మాసాంతం లోపు లక్ష్యంగా కేంద్రం నిర్దేశించుకొంది. ఈ నేపథ్యంలో లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టులను కేంద్రం పిలుపు నిచ్చింది. మరోవైపు మావోయిస్టుల ఏరివేతకు ఆపరేషన్ కగార్‌ను తీసుకు వచ్చింది.

## మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టు ఊరట



**న్యూఢిల్లీ-నవభూమి:** లిక్కర్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో 'ఆప్' నేత మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టు లో ఊరట లభించింది. బెయిలు షరతు లను అత్యున్నత న్యాయస్థానం బుధవారంనాడు సడలించింది. బెయిలు షరతుల ప్రకారం, వారంలో రెండు సార్లు విచారణ కార్యాలయంలో ఆయన రిపోర్ట్ చేయాల్సి ఉండగా, ఇక నుంచి ఆ అవసరం లేదని న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సడలింపు ఇచ్చింది.
'వారానికి రెండుసార్లు రిపోర్ట్ చేయాలనే బెయిలు షరతును తొలగిస్తున్నాం. అయితే అప్లికెంట్ (సిసోడియా) రెగ్యులర్‌గా విచారణకు హాజరు కావాలి" అని కోర్టు స్పష్టం చేసింది. మనీలాండరింగ్ కేసులో సిసోడియాకు గత ఆగస్టు 9న కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ జరపకుండా 17 నెలల పాటు నిర్బంధంలో ఉంచడాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయనకు బెయిలు మంజూరు చేసింది. అయితే ప్రతి సోమ, గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య విచారణ అధికారికి రిపోర్ట్ చేయాలని షరతు విధించింది.సిసోడియా బెయిల్ అభ్యర్థనపై నవంబర్ 22న విచారణకు అంగీకరించిన అత్యున్నత న్యాయస్థానం సీబీఐ, ఈడీలను స్పందించాల్సిందిగా నోటీసులు ఇచ్చింది. 22వ తేదీ విచారణలో సిసోడియా తరపు న్యాయవాది తమ వాదన వినిపిస్తూ, దర్యాప్తు అధికారుల ముందు సిసోడియా 60 సార్లు హాజరయినట్టు కోర్టు దృష్టికి తెచ్చారు. 2021-22 ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలులో అవకతవకలు జరిగాయంటూ 2023 ఫిబ్రవరి 26న సిసోడియను సీబీఐ అరెస్టు చేసింది. అనంతరం మార్చి 9న మనీలాండరింగ్ కింద ఈడీ ఆయనను అరెస్టు చేసింది. 2023 ఫిబ్రవరి 28న ఢిల్లీ క్యాబినెట్‌కు సిసోడియా రాజీనామా చేసారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన కొట్టివేశారు

## సీఎంగారూ.. సీబీఐ విచారణకు సిద్ధమేనా..

**చెన్నై-నవభూమి:**తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ)లో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు సిద్ధమేనా అని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. భారత సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి సౌర విద్యుత్ కొనుగోలు చేసేందుకు టీఎన్‌ఈబీకి ఆదానీ సంస్థ ముడుపులు చెల్లించినట్లు అమెరికా కోర్టులో దాఖలైన కేసుపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అన్బుమణి డిమాండ్ చేస్తూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.ఆదానీకి సంబంధించిన అవినీతి ఆరోపనలపై పార్లమెంట్ ఉమ్మడి కమిటీ విచారణ జరిపేందుకు పీఎంకే మద్దతు ఉంటుందని, ఈ వ్యవహారంలో తమకు ఎలాంటి సంకోచం లేదన్నారు. టీఎన్‌ఈబీకి ఆదానీ సంస్థ పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించిందనే ఆరోపనలపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఎలాంటి సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# సీఎం కాన్వాయ్‌ని ఢీకొట్టిన కారు.. గాయపడిన వారితోపాటు సీఎం



**రాజస్థాన్-నవభూమి:**రాజస్థాన్ జైపూర్‌లో ఏకంగా ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ కాన్వాయ్‌లో ఉన్న వాహానాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కాన్వాయ్‌లో ఉన్న భద్రతా సిబ్బందితో సహా 9 మంది గాయపడ్డారు. ఈ క్రమంలో సీఎం భజన్ లాల్ స్వయంగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆ క్రమంలో ఢీకొన్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు.ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా జైపూర్‌లోని ఎన్‌ఆర్‌ఐ సర్కిల్ సమీపంలో సీఎం కాన్వాయ్‌లోని ఓ వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ తర్వాత కాన్వాయ్ వాహనం రోడ్డుపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడినట్లు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి తెలిపారు.ఈ ప్రమాదం జరిగిన వేంటనే సీఎం తన కారును ఆపి వెంటనే తన వాహనంలో క్షతగాత్రులను మహాత్మాగాంధీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ క్రమంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ యథావిధిగా కదులుతున్నదని, ట్రాఫిక్ నిలిచిపోలేదని పేర్కొన్నారు. ట్రాఫిక్ మధ్యలో ఈ ఘటన చోటుచేసుకుంది. అంబులెన్స్ వచ్చే వరకు వేచి ఉండకుండా తన సొంత వాహనంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లడం మంచిదని సీఎం భావించారు.
కారణమిదేనా..జైపూర్‌లోని జగత్‌పురా ఎన్‌ఆర్‌ఐ సర్కిల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా రాంగ్ సైడ్ నుంచి వస్తున్న కారు కాన్వాయ్ ముందు ఢీకొట్టింది. ఢీకొనడంతో రాంగ్ సైడ్ నుంచి వస్తున్న వాహనం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఏడుగురు పోలీసులతో సహా 9 మంది గాయపడ్డారు. వాస్తవానికి సీఎం భజన్ లాల్ స్వయంగా రూట్ లైన్ తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో సామాన్యులెవరూ ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొలేదు.

**సీఎం భజన్‌లాల్ స్వయంగా**

కాన్వాయ్ రాంగ్ సైడ్ నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో సీఎం భజన్‌లాల్ కారు దిగి ప్రమాదంలో గాయపడిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో కాన్వాయ్‌లో ఉన్న ఏడుగురు పోలీసులు గాయపడ్డారు. ఢీకొన్న వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన పోలీసులను సీఎం భజన్‌లాల్ స్వయంగా తన వెంట తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదం అనంతరం పోలీసు ఉన్నతాధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కాన్వాయ్ వాహనాన్ని ఢీకొన్న కారును స్వాధీనం చేసుకున్నారు.

**ట్రాఫిక్ ఆపవద్దని**

ఈ కారు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. ఎక్కడ పొరపాటు జరిగిందో ఆరా తీస్తున్నారు పోలీసులు. వాస్తవానికి కొద్దిరోజుల క్రితం సీఎం కాన్వాయ్ వెళుతుండగా ట్రాఫిక్‌ను ఆపవద్దని సీఎం భజన్‌లాల్ స్పష్టం చేశారు. అందుకే ట్రాఫిక్ నిరాటంకంగా కదులుతోంది. ఇంతలోనే సీఎం కాన్వాయ్ దాటిపోవడంతో రాంగ్ సైడ్ నుంచి వచ్చిన కారు కాన్వాయ్‌లో ఓ ఉన్న వాహానాన్ని ఢీకొట్టింది.

## బంగ్లాదేశ్ మాటలతో వినకపోతే.. ఆర్‌ఎస్‌ఎస్ నేత కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, ముఖ్యంగా హిందువులపై కొనసాగుతున్న దాడులపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నేత సునీల్ అంబేకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సంప్రదింపులతో హింసాకాండ ఆగకపోతే మరో పరిష్కార మార్గాన్ని అన్వేషించాలని కేంద్రానికి ఆయన సూచించారు. బంగ్లాలో మైనారిటీలపై దాడులను ఖండిస్తూ సకల హిందూ సమాజ్ ఆధ్వర్యంలో నాగపూర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అంబేకర్ పాల్గొని ప్రసంగించారు."కేంద్రం గట్టి ప్రయత్నం చేయాలి, మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. చర్చలతో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాను. చర్చలు విఫలమైతే మాత్రం మరో మార్గాన్ని అన్వేషించాలి. మన ఆలయాలు తగులబెడుతున్నారు, లూటీ చేస్తున్నారు, మహిళలను చిత్రహింసలు పెడుతున్నారు. అసలేం జరుగుతోందంటూ ప్రతి హిందువు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ఇలాంటి ఘటనలను కేవలం ఖండించడం, మనస్తాపం చెందడంతో సరిపోదు. వీటికి అతీతంగా ఏం చేయాలనేది ఆలోచించి ముందుకు వెళ్లాలి" అని అంబేకర్ సూచించారు.హిందూ కమ్యూనిటీని కూకటి వేళ్లతో పెకిలించాలనే లక్ష్యంతోనే బంగ్లాలో హింస జరుగుతోందని అంబేకర్ అభిప్రాయ పడ్డారు. బంగ్లాదేశ్‌లో మాత్రమే కాదు, పాకిస్థాన్‌లోనూ హిందువులపై దాడులు జరుగుతున్నాయని, హిందువులపై దాడులను మనం ఎంతమాత్రం సహించరాదని సూచించారు. మనం అచేతనంగా ఉండిపోతే మన మౌనాన్ని భవిష్యత్ తరాలు ప్రశ్నిస్తాయని హెచ్చరించారు. నోబెల్ శాంతి బహుమతి అందుకున్న వ్యక్తి (మహ్మద్ యూనస్) నడుపుతున్న దేశంలోనే (బంగ్లాదేశ్)లోనే శాంతి లేదన్నారు. మైనారిటీలపై అకృత్యాలను అడ్డుకునేందుకు ఆయన చేస్తున్నదేమీ లేదని తప్పుపట్టారు.
బంగ్లాదేశ్‌లో అలజడులు సృష్టిస్తున్న విదేశీ శక్తులను గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆ విదేశీ శక్తుల గుట్టు బయటపెట్టి, దేశ విదేశాల్లో ఎక్కడా హిందువులపై దాడులు జరక్కుండా అడ్డుకట్టు వేయాలని సూచించారు. హిందువులపై జరుగుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా ప్రపంచదేశాల మద్దతును కూడగట్టాలని కేంద్రానికి సంఘ్ ఇటీవల పిలుపునిచ్చిన నేపథ్యంలో అంబేకర్ తాజా వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## బలపడిన అల్పపీడనం.. రెండు రోజుల భారీ వర్షసూచన



**చెన్నై-నవభూమి:** ఆగ్నేయ బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం పశ్చిమ దిశగా పయనించి బలపడిందని భారత వాతావరణ పరిశోధనా సంస్థ దక్షిణ మండల అధ్యక్షుడు బాలచంద్రన్ తెలిపారు. అయితే గత 24 గంటలుగా అక్కడే స్థిరంగా ఉన్న అల్పపీడనం ప్రస్తుతం తీరం వైపు పయనిస్తోందన్నారు. ఈ అల్పపీడనం దక్షిణాది జిల్లాల వైపు కదులుతోందని, ఓ వైపు ఈశాన్య రుతుపవనాల ప్రభావం, ఈ అల్పపీడనం కారణంగా రాజధాని నగరం చెన్నై(లో బుధ, గురువారాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని చెప్పారు.ఇదే విధంగా మైలాడుతురై, నాగపట్నం, తంజావూరు, తిరువారూర్, కడలూరుజిల్లాలు, పుదుచ్చేరిలో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వివరించారు. చెన్నై, శివగంగై, రామనాథపురం, తిరుచ్చి, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం సహా 11 జిల్లాల్లో భారీ నుంచి ఓ మోస్తరు వరకూ వర్షాలు కురుస్తాయని ఆయన వివరించారు.

## కాబోయే కోడలికి కీలక పదవి అప్పగించిన ట్రంప్



**అమెరికా-నవభూమి** :అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన కుటుంబ సభ్యులకు కీలక పదవులను అప్పగిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కాబోయే కోడలికి కీలక పదవి కట్టబెట్టారు. తన కుమారుడు డొనాల్డ్ జూనియర్ కు కాబోయే భార్య కింబర్లీ గిల్‌ఫోయిల్‌ను గ్రీక్ రాయబారిగా నియమించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ట్రంపే స్వయంగా ప్రకటించారు.గ్రీక్‌తో బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకునేందుకు, రక్షణ సహకారం, వాణిజ్యం, ఆర్థిక ఆవిష్కరణలు తదితర విషయాల్లో కింబర్లీ బలమైన దౌత్య సంబంధాలు నెలకొల్పగలదని ఈ సందర్భంగా ట్రంప్ ఆకాంక్షించారు. కాగా, కింబర్లీ గతంలో ఫాక్స్‌న్యూస్ హోస్ట్‌గా పనిచేశారు. అనంతరం పొలిటికల్ ఫండ్ రైజర్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. మీడియా, రాజకీయాలతో ఆమెకు ఉన్న విస్తృత అనుభవం, నాయకత్వంతోపాటు తెలివితేటలు ఆమెకు ఈ పదవి కట్టబెట్టడానికి కారణమని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, డిసెంబర్ 31, 2020లో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్‌తో కింబర్లీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే.ఇక ఇటీవలే ట్రంప్ తన వియ్యంకులకు కీలక పదవులు అప్పగించిన విషయం తెలిసిందే. పశ్చిమాసియా వ్యవహారాల సలహాదారుగా మస్సద్ బౌలోస్‌ను ఎంపిక చేసుకున్నారు. బౌలోస్ లెబనీస్-అమెరికన్ వ్యాపారవేత్త. ఆయన కుటుంబ సభ్యులకు నైజీరియా, లెబనాన్‌లలో వ్యాపారాలు ఉన్నాయి. ట్రంప్ చిన్న కుమార్తె టిఫ్ఫనీని బౌలోస్ కుమారుడు మైఖేల్ వివాహం చేసుకున్నారు. ఇక మరో వియ్యంకుడు చార్లెస్ కుష్నర్‌ను ఫ్రాన్స్ రాయబారిగా ఎంపిక చేసుకున్నారు. ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌కు తండ్రి చార్లెస్ కుష్నర్.

# రాజ్‌నాథ్‌కు రాహుల్ వినూత్న గిఫ్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంటు సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు, బీజేపీ మధ్య ఓవైపు ప్రతిష్ఠంభన కొనసాగుతుండగా, మరోవైపు పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ నేతలు 'అదానీ' అంశంపై చర్చ జరపాలంటూ వినూత్న రీతిలో నిరసనలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ నేతలు బుధవారంనాడు పార్లమెంటు వెలుపల నిలబడి సభలకు హాజరవుతున్న బీజేపీ నేతలకు త్రివర్ణ పతాకం, గులాబీలు అందించారు. ఆ సమయంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అక్కడకు రావడంతో రాహుల్ గాంధీ వేగంగా వెళ్లి ఆయన చేతికి త్రివర్ణ పతాకం, గులాబీ అందించారు. రక్షణమంత్రికి రాహుల్ గులాబీ ఇవ్వడం అంతా ఆసక్తిగా వీక్షించారు.
అదానీ' అంశంపై పార్లమెంటులో చర్చకు కాంగ్రెస్ పట్టుబడుతుండగా, కాంగ్రెస్-సోరోస్ సంబంధాలను బీజేపీ నిలదీస్తోంది. దీంతో సభా కార్యక్రమాలకు సజావుగా ముందుకు సాగడం లేదు. దీంతో అదానీ అంశంపై చర్చ జరపాల్సిందేనంటూ కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు పార్లమెంటు వెలుపల వినూత్న నిరసనలు సాగిస్తున్నారు. సోమవారంనాడు ఎంపీలు మోదీ, అదానీ మాస్క్‌లు ధరించగా వారితో విపక్ష నేత రాహుల్ ఇంటర్వ్యూ చేశారు. మంగళవారం సైతం ప్రధాని, అదానీ క్యారికేచర్లు ఉన్న బ్యాగులు ధరించి కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. 'మోదీ అదానీ భాయ్ భాయ్' అనే నినాదం బ్యాగులపై ముద్రించారు. కాగా, జాతీయ జెండా, గులాబీలతో నిరసన తెలపడంపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ వివరణ ఇచ్చారు. ఇతర విషయాల కంటే దేశం చాలా ముఖ్యమైనదని బీజేపీ నేతలకు తెలియజెప్పేందుకే వారికి జాతీయ జెండాలు ఇచ్చినట్టు చెప్పారు.

## కస్టడీలోనే దక్షిణ కొరియా మాజీ రక్షణ మంత్రి ఆత్మహత్యాయత్నం



**సియోల్:నవభూమి:**దక్షిణ కొరియారక్షణ శాఖ మాజీ మంత్రి కిమ్ యాంగ్ హున్.. పోలీసుల కస్టడీలోనే ఆత్మహత్యకు ప్రయత్నించారు. కానీ చివరి నిమిషాల్లో ఆయన ప్రయత్నాలను అడ్డుకున్నారు. గత రాత్రి బలవన్మరణానికి పాల్పడేందుకు కిమ్ ట్రై చేశారు. కానీ అతన్ని గుర్తించడంతో ఆ ప్రయత్నం నుంచి అతను తప్పుకున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన్ను గార్డింగ్ రూమ్‌లో పెట్టారు. ఆయనకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవు. ఇటీవల దక్షిణ కొరియా ప్రధాని సైనిక పాలన ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రతిపాదన చేసింది మంత్రి కిమ్.
దక్షిణకొరియాలో డిసెంబర్ 3వ తేదీ సైనిక పాలన విధిస్తూ ప్రకటన చేశారు. ఆ కేసులో కిమ్ యాంగ్‌ను అరెస్టు చేశారు. డిటెన్షన్ సెంటర్‌లో ఆయన ఆత్మహత్యకు ప్రయత్నించారు. అండర్‌వియర్ ద్వారా కిమ్ సూసైడ్ చేసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఆదివారం రోజు రక్షణ శాఖ మాజీ మంత్రి అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రోజున అతన్ని అధికారికంగా అరెస్టు చేశారు. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌పై తిరుగుబాటుకు పాల్పడినట్లు కిమ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# స్టూడెంట్ వీసాలకు అమెరికా కోత..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో భారతీయ విద్యార్థులకు అమెరికా జారీచేసే వీసాల సంఖ్య భారీ స్థాయిలో తగ్గిపోయింది. 2024 సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో భారతీయ విద్యార్థులకు జారీ చేసిన ఎఫ్-1 స్టూడెంట్ వీసాలలో 38 శాతం తగ్గుదల ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఇదే కాలంలో కొవిడ్ తర్వాత ఇంత భారీ స్థాయిలో వీసాల తగ్గుదల కనిపించడం ఇదే మొదటిసారి.
కొవిడ్ తర్వాత అమెరికాలోని అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో అంతర్జాతీయ విద్యార్థుల చేరికలో పెరుగుదల కనిపించింది. ఇతర దేశాల స్టూడెంట్ వీసాల జారీలో స్వల్పంగా తగ్గుదల ఉండగా భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసాల సంఖ్యలో మాత్రం గణనీయమైన పెరుగుదల ఉంది. ఇప్పటికే కఠినంగా ఉన్న అమెరికా వీసా నిబంధనలు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో మరింత కఠినంగా మారే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

**కొవిడ్ తర్వాత తొలిసారి తగ్గుదల..**

కొవిడ్ తర్వాత మొట్టమొదటిసారి భారతీయ విద్యార్థుల ఎఫ్-1 వీసాలలో భారీ తగ్గుదల ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2024 జనవరి, సెప్టెంబర్ మధ్య కేవలం 64,008 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. 2023లో ఇదే కాలంలో 1,03,495 వీసాలు జారీ కాగా 2021లో 65,235 వీసాలు, 2022లో 93,181వీసాలు జారీ అయ్యాయి. కొవిడ్ ప్రబలిన 2020 సంవత్సరం తొలి 9 నెలల్లో 6,646 ఎఫ్-1 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. ఇతర దేశస్తులతో పోలిస్తే చైనా విద్యార్థులకు అమెరికా జారీ చేసే ఎఫ్-1 వీసాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

**అమెరికాలో 3.31 లక్షల మంది భారత విద్యార్థులు**

అమెరికా సంస్థలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల కోసం అమెరికా విదేశాంగ శాఖ ఎఫ్-1 వీసాలను జారీ చేస్తుంది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో కొత్త విద్యార్థి వీసాల జారీలో భారత్ చైనాను మించిపోయింది. ఓపెన్ డోర్స్ 2024 నివేదిక ప్రకారం అమెరికా యూనివర్సిటీలలో చదువుకుంటున్న భారతీ విద్యార్థుల సంఖ్య 2023-24 విద్యా సంవత్సరంలో 3.31 లక్షలు ఉంది. అమెరికాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థి జనాభాలో ఇది 29.4 శాతంగా ఉండడం విశేషం.

## పౌరసత్వ జన్మహక్కును తొలిగించే ఆలోచనలో ట్రంప్ !



**న్యూయార్క్-నవభూమి:** అమెరికాలో జన్మించిన వారికి పౌరసత్వాన్ని ఇచ్చే విషయం తెలిసిందే. పేరెంట్స్‌కు పౌరసత్వం లేకున్నా.. అమెరికాలో పుట్టే పిల్లలకు పౌరసత్వం ఇస్తున్నారు. 150 ఏళ్ల నుంచి అమలులో ఉన్న ఆ రాజ్యాంగ హక్కును ఇప్పుడు కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తొలగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పౌరసత్వ జన్మహక్కు హాస్యాస్పదమైందని, జనవరి 20వ తేదీన బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆ హక్కును ట్రంప్ కాలరాస్తారని భావిస్తున్నారు.బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను మార్చేస్తామని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ తెలిపారు. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు ప్రజల వద్దకు వెళ్లాల్సి ఉంటుందని, కానీ ఏదో ఓ సందర్భంలో అంతం కావాలన్నారు. తొలి దశ అధ్యక్ష ఎన్నికల సమయంలోనూ పౌరసత్వ అంశాన్ని ప్రస్తావించారు. 14వ సవరణ ద్వారా పౌరసత్వ జన్మహక్కును రాజ్యాంగంలో పొందుపరిచారు. అమెరికా చట్టాల కింద ఆ హక్కును పటిష్టంగా అమలు చేస్తున్నారు.అయితే ఇప్పుడు ఆ చట్టాన్ని రద్దు చేయడం అంటే, చాలా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పౌరసత్వ జన్మహక్కు వల్ల.. గర్భంతో ఉన్న విదేశీ మహిళలు.. అమెరికాలోకి ఎంటర్ అయి ఇక్కడ పిల్లలను ప్రసవించిన తర్వాత మళ్లీ వెళ్లిపోతున్నారని, అందుకే ఆ విధానాన్ని మార్చాలని ట్రంప్‌తో పాటు ఇతర పార్టీలు ఆలోచిస్తున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ గురువారం 12 । డిసెంబర్ । 2024

# జర్నలిస్ట్ మూర్తిని సస్పెండ్ చేసిన తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్.!



ప్రముఖ తెలుగు ఫిలిం జర్నలిస్ట్ మూర్తి (అలియాస్ తాత, అలియాస్ దేవి ప్రియ)ని తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ సస్పెండ్ చేసినట్లు తెలుస్తుంది. అసోసియేషన్ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహారిస్తున్నందుకు సాయిరాజ్‌ను 6 నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు టీఎఫ్‌జేఏ ఒక ప్రకటన విడుదల చేసింది. ఫిల్మ్ జర్నలిస్టు సూర్య నారాయణ మూర్తి సోషల్ మీడియాలో బాగా పాపులర్ అనేది తెలిసిందే. మూవీ ప్రమోషనల్ ఈవెంట్స్‌లో సెలబ్రిటీలను ఆయన అడిగే క్వశ్చన్స్ చాలాసార్లు ట్రోలింగ్‌కు గురవడం గమనించే ఉంటారు. ఇక ప్రమోషనల్ ఈవెంట్‌లోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా దేవి ప్రియ పేరిటా ఏ పోస్ట్ పడితే ఆ పోస్ట్ పెడుతూ ఉంటాడు. అయితే తాతాగా పాపులర్ అయిన మూర్తి తాజాగా సస్పెండ్ అయినట్లు తెలుస్తుంది. అసోసియేషన్ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహారిస్తున్నందుకు తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ అతడిని 6 నెలలు సస్పెండ్ చేసినట్లు ఒక ప్రెస్ నోట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ విషయంపై టీఎఫ్‌జేఏ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

నవచిత్ర





కీర్తి సురేష్

# కీర్తి సురేష్.. పెళ్లి టైమ్‌లో హై గ్లామర్ డోస్!

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ డిసెంబర్ 12న తన చిన్ననాటి స్నేహితుడు, ప్రియుడు అయిన ఆంటోనీ తటిల్ తో పెళ్లి పీటలు ఎక్కబోతోంది. వీరి వివాహానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. గోవాలో కీర్తి, ఆంటోనీ పెళ్లి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరగబోతోంది. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాలలో వీరి వివాహ వేడుక జరగనున్నట్లు తెలుస్తోంది. సినిమా ఇండస్ట్రీ నుంచి కీర్తి సురేష్ సన్నిహితులు కొంతమంది ఈ వివాహానికి హాజరు కాబోతున్నారు. మరో వైపు డిసెంబర్ 20న హిందీలో కీర్తి సురేష్ డెబ్యూ మూవీ 'బేబీ జాన్' రిలీజ్ కి రెడీ అవుతోంది. తాజాగా మూవీ ట్రైలర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రంలో కీర్తి సురేష్ గ్లామర్ రోల్ లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. కచ్చితంగా బేబీ జాన్ తో కీర్తి సురేష్ కి బాలీవుడ్ లో బ్రేక్ వస్తుందని అనుకుంటున్నారు. ఈ సినిమా రిలీజ్ సందర్భంగా బాలీవుడ్ ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేయడానికి ఆమె ఫేస్ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ప్రత్యేక ఫోటో షూట్ చేయించుకుంది. ఈ ఫోటోలని తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేశారు. ఫోటోషూట్ లో ఎంబ్రాయిడరీ లెహంగాలో కీర్తి లుక్స్ స్టన్నింగ్ గా ఉన్నాయనే మాట వినిపిస్తోంది. ఇటు లెహంగాలో ట్రెడిషనల్ స్టైల్ ని కవర్ చేస్తోనే మరో వైపు వెస్ట్రన్ టచ్ తో గ్లామర్ ఫీస్ట్ అందిస్తోందనే మాట ఈ ఫోటోలని చూస్తుంటే అనిపిస్తోంది. కీర్తి సురేష్ అభిమానులు కూడా ఈ మ్యాగజైన్ ఫోటోషూట్ ని లైక్ చేస్తున్నారు. ఈ లుక్స్ లో కీర్తి చాలా గ్లామరస్ గా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. యూత్ ని క్లీన్ బౌల్డ్ చేసే లుక్స్ తో కీర్తి సురేష్ మెస్మరైజ్ చేస్తోందని అంటున్నారు. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కెరియర్ ఆరంభం నుంచి ఈ స్టాండర్డ్స్ లో కీర్తి సురేష్ గ్లామర్ రోల్స్ చేసి ఉంటే ఈ పాటికి ఇండియన్ సిల్వర్ స్క్రీన్ ని రూల్ చేసే క్వీన్ అయ్యేదని ఆమె అభిమానులు అంటున్నారు. బేబీ జాన్ తర్వాత కీర్తి సురేష్ స్పీడ్ పెంచడం గ్యారెంటీ అని భావిస్తున్నారు.

# అత్యధిక వేగంగా 1000 కోట్లు రాబట్టిన సినిమాలివే..



భారత సినిమా చరిత్రలో 1000 కోట్ల గ్రాస్ మార్క్‌ను అధిగమించడం అనేది ఇప్పుడు ప్రతీ పాన్ ఇండియా మేకర్స్‌కు మొదటి టార్గెట్. ఇక టాలీవుడ్ సినిమాలకు ఇది సాధ్యం అవుతుందని ఎవరు ఊహించలేదు. కొన్నేళ్ల క్రితం వరకు బాలీవుడ్ సినిమాలే బాక్సాఫీస్ ను ఎలాయి. ఇక బాహుబలి నుంచి సౌత్ సినిమాలు ఆ టార్గెట్ ను అందుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇక బాహుబలి 2 అనంతరం ఆర్ఆర్ఆర్, KGF2 వంటి సినిమాలు ఈ మార్క్‌ను అధిగమించడమే కాదు, కొత్త రికార్డులను సృష్టించాయి. అయితే ఇప్పుడు ఆ రికార్డులను కొత్త దశకు తీసుకెళ్లిన చిత్రం పుష్ప 2: ది రూల్. అల్లు అర్జున్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే 1000 కోట్ల గ్రాస్ మార్క్‌ను చేరి అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ఇండియన్ ఫిల్మ్‌గా నిలిచింది. పుష్ప 2: ది రూల్ సునామీని ఇండియన్ బాక్సాఫీస్‌తో పాటు అంతర్జాతీయ బాక్సాఫీస్ కూడా ఎదుర్కొంటోంది. కేవలం ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 1000 కోట్ల గ్రాస్‌ను రాబట్టి ఇండియన్ సినిమాల్లోనే అత్యంత వేగంగా ఈ క్లబ్‌లో చేరిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇక పాత రికార్డులను సైతం తుడిచిపెట్టింది. అంతకు ముందు ఈ ఘనత బాహుబలి 2కి దక్కింది. బాహుబలి 2 సినిమా 10 రోజుల్లో 1000 కోట్ల మార్క్‌ను దాటింది. ఆ తర్వాత ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్ 2 సినిమాలు ఈ ఘనతను 16 రోజుల్లో అందుకున్నాయి. కాగా, షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ 18 రోజుల్లో 1000 కోట్ల గ్రాస్ మార్క్‌ను చేరింది. ఆ తర్వాత పఠాన్ సినిమా 27 రోజుల్లో ఈ ఘనత సాధించి, అదే ఏడాది బాలీవుడ్‌ను రిప్రజెంట్ చేసింది. కానీ పుష్ప 2 ఈ లెక్కలన్నింటినీ కొత్త ఎత్తుకు చేర్చింది. పుష్ప 2 కోసం ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ రికార్డులను బ్రేక్ చేసే స్థాయిలో ఉంది. సుకుమార్ తన డైరెక్షన్‌తో ఈ సినిమాను పాన్-ఇండియా హిట్‌గా మార్చాడు. ముఖ్యంగా మాస్ క్లాస్ ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ దగ్గర సునామీ సృష్టిస్తోంది. ఈ సినిమాలో అల్లు అర్జున్ నటన, మ్యూజిక్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా ఈ చిత్రానికి పుష్ప 1 క్రేజ్ ఎంతగానో హెల్ప్ అయ్యింది. దీంతో హిందీలో బాక్సాఫీస్ లెక్కలు జెట్ స్పెస్ లో దూసుకుపోతున్నాయి. ఇకపై 1000 కోట్ల క్లబ్‌లో చేరే సినిమాల సంఖ్య పెరుగుతుండడం చూస్తుంటే, టాలీవుడ్ సినీ పరిశ్రమ ప్రపంచ స్థాయిలో ఎదుగుతున్నట్లు స్పష్టమవుతోంది. పుష్ప 2 సాధించిన రికార్డు ఇతర దర్శకులకు, నటులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. అల్లు అర్జున్, రష్మిక మందన్న ఈ సినిమా ద్వారా తమ కెరీర్‌లో మరో బిగ్గెస్ట్ రికార్డ్ అందుకున్నారు. మొత్తానికి, పుష్ప 2 తన శక్తిని ప్రపంచానికి చాటింది.

# మీనాక్షి ఛాన్స్ శ్రీలీల తన్నుకుపోయిందా!



మీనాక్షి చౌదరి సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తెలుగుతో పాటు తమిళ్ చిత్రాల్లోనూ వరుసగా అవకాశాలు అందుకుంటూ తనదైన మార్క్ వేస్తుంది. రష్మిక మందన్నా తర్వాత ఆ రేంజ్ లో ఫేమస్ అవుతున్న బ్యూటీ మీనాక్షి. అలాంటి నటి అవకాశాన్నే తెలుగు హీరోయిన్ శ్రీలీల తన్నుకుపోయిందన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువ సామ్రాట్ నాగచైతన్య హీరోగా 24వ చిత్రాన్ని కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. విరూపాక్షతర్వాత కార్తీక్ టేకప్ చేసిన ప్రాజెక్ట్ ఇది. మిథికల్ థ్రిల్లర్ గా తెరకెక్కుతుంది. ఇందులో చైతన్యకు జోడీగా మీనాక్షి చౌదరి అనుకున్నారు. కానీ మీనాక్షి స్థానంలో అనూహ్యంగా శ్రీలీల చేరింది. మీనాక్షి బిజీ షెడ్యూల్ కారణంగా ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ అవ్వడంతో లీలకు ఆ ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే మరో హీరోయిన్ స్థానంలో శ్రీలీల రీప్లేస్ అన్నది కొత్తది కాదు. గుంటూరు కారంలో పూజాహెగ్డే సగం షూటింగ్ చేసిన తర్వాత ఎగ్జిట్ అయితే శ్రీలీలను తీసుకున్నారు. పుష్ప-2లో కిస్సుక్కు సాంగ్ కోసం ఎంతో మంది భామల పేర్లను పరిశీలించారు. చివరికి బాలీవుడ్ కి వెళ్లారు. జాన్వీ కపూర్, శ్రద్ధా కపూర్, దిశా పటాని ఇలా ఎన్నో ఆప్షన్లు పరిశీలించాక చివరిగా శ్రీలీల కే ఆఛాన్స్ వరించింది. నితిన్ హీరోగా నటిస్తోన్న రాబిన్ హుడ్‌లో ముందుగా రష్మిక మందన్నాని అనుకున్నారు. కానీ ఆమె డేట్లు సర్దుబాటు కాకపోవడంతో ఆ ఛాన్స్ శ్రీలీలకే సొంతమైంది. ఇలా శ్రీలీలకు రీప్లేసింగ్ బ్యూటీగా పేరొచ్చింది. మరొకరి అవకాశాల్లో ఇంకొకరు నటించాలంటే? సెకెండ్ ఆప్షన్ తాను అనే ఫీలింగ్ సహజం. కానీ శ్రీలీల మాత్రం అలాంటి నెగిటివిటికీ ఎక్కడా తావు ఇవ్వకుండా ఎంతో బ్యాలెన్స్‌గా వ్యవహరిస్తుంది. వచ్చిన అవకాశాలు తెలివిగా ఒడిసి పట్టుకుంటుంది.

# సమంత పోస్ట్.. 2025లో పిల్లలట!




అదే సమయంలో రీసెంట్‌గా ఇన్ స్టాలో ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు సమంత. 2025లో తన రాశికి ఎలా ఉంటుందోనన్న విషయంపై ఒక మెసేజ్ ను షేర్ చేశారు. స్టార్ హీరోయిన్ సమంత.. ఇన్ స్టాగ్రామ్‌లో ఫుల్‌గా యాక్టివ్‌గా ఉంటున్న విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్‌తో పాటు తన జీవితానికి సంబంధించిన పలు విషయాలను తరచూ షేర్ చేసుకుంటుంటారు. ఆరోగ్యపరంగా ఉపయోగపడే టిప్స్ ను ఇస్తుంటారు. అందుకే ఆమె ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉంటుంటారు. సమంత తండ్రి జోసెఫ్ గత నెలలో మరణించగా.. ఆమె ఆ బాధ నుంచి బయటకు వచ్చేందుకు వర్క్ లైఫ్ పై ఫుల్ గా ఫోకస్ పెట్టినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఇటీవల సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సామ్.. తన యాక్టింగ్ తో విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుని అబ్బురపరిచారు. ఇప్పుడు రక్త్ బ్రహ్మాండ్ ది బ్లడీ కింగ్ డమ్ అనే మరో వెబ్ సిరీస్ తో బిజీగా ఉన్నారు. ఇటీవల సెట్స్ లోకి కూడా అడుగు పెట్టారు. ఆ సమయంలో మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి వచ్చేశానంటూ పోస్ట్ పెట్టారు. అంతకుముందు కొద్ది రోజుల క్రితం.. మా ఇంటి బంగారం మూవీ అనౌన్స్ చేశారు. దీంతో ఆమె ఫుల్ బిజీగా ఉన్నట్లే! అదే సమయంలో రీసెంట్‌గా ఇన్ స్టాలో ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు సమంత. 2025లో తన రాశికి ఎలా ఉంటుందోనన్న విషయంపై ఒక మెసేజ్ ను షేర్ చేశారు. వృషభ, కన్య, మకర రాశి వారు 2025లో వీటిని పొందే అవకాశం ఎక్కువగా ఉందంటూ పలు విషయాలను పాయింట్ల రూపంలో పోస్ట్ చేశారు సమంత. అవేంటంటే? ఏడాదంతా బిజీగా గడుపుతారు, వృత్తి పరంగా మెరుగు పడతారు, డబ్బులు ఎక్కువ సంపాదిస్తారు, మీరు ఆర్థికంగా బలంగా ఉంటారు, ప్రేమను పంచే భాగస్వామిని పొందుతారు, పాత లక్ష్యాలను పూర్తి చేస్తారు, ఆదాయం వచ్చే మార్గాలు పెంచుకుంటారు, మరిన్ని అవకాశాలు సొంతం చేసుకుంటారు.. అంటూ రాసుకొచ్చారు. మానసికంగాతోపాటు శారీరకంగా కూడా స్ట్రాంగ్ గా ఉంటారని, పిల్లలను పొందుతారని కూడా సామ్ ఇచ్చిన లిస్ట్ లో ఉంది. దీంతో భాగస్వామి, పిల్లలు కోసం సమంత పోస్ట్ లో ఉండడంతో నెట్టింట ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. దీంతో ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు. మేడమ్.. మీకు అన్ని విధాలుగా అంతా మంచి జరగాలని కోరుకుంటున్నట్లు అభిమానులు చెబుతున్నారు.

# జస్ప్రీత్ బుమ్రా మస్త్ విశ్రాంతి దొరికింది..! ఇక అన్ని టెస్టులు అడాల్సిందేనన్న మాజీ క్రికెటర్..!



టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్‌పై భారం పడుతుందన్న వార్తలను మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తోసిపుచ్చారు. ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో మిస్టరీ బౌలర్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆడిన రెండు మ్యాచుల్లో 11.25 సగటు, 2.50 ఎకానమీతో 12 వికెట్ల పడగొట్టాడు. అయితే, రెండో టెస్ట్‌లో బుమ్రా గాయం సమస్యలతో కాస్త ఇబ్బందిపడ్డాడు. ఈ క్రమంలోపై అతనిపై భారం తగ్గించాలన్న వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సంజయ్ మంజ్రేకర్ స్పందిస్తూ.. ఆస్ట్రేలియాతో జరిగిన అన్ని మ్యాచుల్లో బుమ్రా ఆడాలని అభిప్రాయపడ్డారు మంజ్రేకర్. గత మూడేళ్లలో బుమ్రా భారత్ తరఫున 34శాతం మ్యాచులు మాత్రమే ఆడాడని గుర్తు చేశారు. బుమ్రాను భారత క్రికెట్ చూసుకుంటుందని.. దాంతో అతను ప్రతి టెస్ట్‌లో ఆడాలన్నారు. మూడేళ్లలో 34 శాతం మ్యాచ్‌లు మాత్రమే ఆడాడని.. దాంతో అతనికి చాలా విశ్రాంతి లభించిందన్నారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఈ సిరీస్ ఎప్పటికీ గుర్తుండిపోయేదని.. ఈ సమయంలో జట్టుకు అతని అవసరం చాలా ఉందన్నారు. 2022 నుంచి భారత్ అన్ని ఫార్మాట్లలో కలిపి 165 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో అందులో బుమ్రా 47 మ్యాచ్‌లు ఆడాడు. గత మూడేళ్లలో భారత్ తరఫున బుమ్రా కేవలం 28.48 శాతం మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. ఇందులో అతను గాయం కారణంగా 10 నెలలు దూరంగా దూరమయ్యారు. 2022 నుంచి భారత్ 28 టెస్టు మ్యాచ్‌లు ఆడగా, అందులో బుమ్రా 17 మ్యాచులకు మాత్రమే అందుబాటులో ఉన్నాడు.

# రూట్‌ను వెనక్కి నెట్టేసిన హ్యారీ బ్రూక్.. టెస్టు బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో ఫస్ట్



దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ వచ్చేశాయి. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్(%ఝుతీతీఎ దీతీశీశీని% ) ఫస్ట్ ప్లేస్ కొట్టేశాడు. జో రూట్‌ను అతను వెనక్కి నెట్టేశాడు. ఇక బౌలింగ్‌లో ఇండియన్ పేసర్ బుమ్రా నెంబర్ వన్ స్పాట్‌లోనే ఉన్నాడు. ఆల్‌రౌండర్ పాత్రలో రవీంద్ర జడేజా టాప్‌లో ఉన్నాడు. 25 ఏళ్ల బ్రూక్ టెస్టుల్లో 8వ సెంచరీ నమోదు చేశాడు. వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్లో తాజాగా అతను సెంచరీ చేశాడు. ఒక్క పాయింట్ తేడాతో రూట్ కన్నా బ్రూక్ మెరుగయ్యాడు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బ్రూక్‌కు 898 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. జూలై నుంచి బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రూట్ ఫస్ట్ ప్లేస్ లో ఉన్నాడు. కేన్ విలియమ్‌సన్‌ను దాటేస్తూ అతను ఆ స్థానానికి వచ్చాడు. టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానంలో ఉన్నాడు. 890 రేటింగ్ పాయింట్లతో అతను టాప్‌లో కొనసాగుతున్నాడు. సౌతాఫ్రికా బౌలర్ కగిసో రబడా 856 పాయింట్లతో బుమ్రాకు పోటీ ఇస్తున్నాడు. ఆ తర్వాత స్థానంలో జోష్ హేజిల్‌వుడ్ అన్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ ర్యాంకుల్లో రవీంద్ర జడేజా నెంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. 415 రేటింగ్ పాయింట్లతో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

నవక్రీడ

# పాకిస్థాన్ బౌలర్ అరుదైన రికార్డు..



దర్బన్: పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది. అరుదైన రికార్డును సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లలో వంద వికెట్లు తీసుకున్న తొలి పాకిస్థాన్ బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. టీ20ల్లోనూ వంద వికెట్లు తీసుకున్న బౌలర్‌గా షాహిన్ అఫ్రిది రికార్డు క్రియేట్ చేశాడు. దర్బన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో వంద వికెట్ల మైలురాయి దాటేశాడు. ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసుకున్నాడతను. టీ20లతో పాటు వన్డేలు, టెస్టుల్లో కూడా షాహిన్ అఫ్రిది వందేసి వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు వన్డేల్లో 112, టెస్టుల్లో 116 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు అఫ్రిది. టీ20ల్లో వంద వికెట్లు తీసుకున్న మూడవ పాకిస్థాన్ బౌలర్ అయ్యాడు. అంతకముందు హరిస్ రౌఫ్, షాదాబ్ ఖాన్ ఆ మైలురాయి అందుకున్నారు. 74 టీ20 మ్యాచుల్లో షాహిన్ వంద వికెట్లు తీసుకున్నాడు. మూడు ఫార్మాట్లలో వందేసి వికెట్లు తీసిన బౌలర్లలో న్యూజిలాండ్ బౌలర్ టిమ్ సౌథీ, బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్, శ్రీలంక బౌలర్ లసిత్ మలింగ ఉన్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**